తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

మంగళవారం 07.07.2026 | సంపుటి :12 సంచిక : 348 | పేజీలు :12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698




## పహల్గాం సూత్రధారి హఫీజ్ సయీద్

### చార్జిషీట్ దాఖలు చేసిన ఎన్ఐఏ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** పహల్గాం ఉగ్రదాడికి సంబంధించిన దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ ఘటనలో లష్కరే తయ్యిబా వ్యవస్థాపకుడు హఫీజ్ సయీద్‌ను కీలక సూత్రధారిగా పేర్కొంటూ జాతీయ దర్యాప్తు సంస్థ సోమవారం అనుబంధ ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఈ దాడికి ఉగ్రవాదులను ఆదేశించడం దగ్గర్నుంచి.. కుట్రకు ప్రణాళిక రూపొందించడం, దాన్ని అమలు చేసేలా సయీద్ ఎప్పటికప్పుడు సమీక్షించినట్లు ఆధారాలున్నాయని ఎన్ఐఏ పేర్కొంది.పహల్గాం ఉగ్రదాడి కేసులో ఇప్పటికే 1597 పేజీల ఛార్జిషీట్‌ను ఎన్ఐఏ కోర్టుకు సమర్పించింది. దీనికి అనుబంధంగా నేడు మరోసారి అభియోగపత్రాలను దాఖలు చేసింది. ఇందులో సీమాంతర ఉగ్రవాదం, హఫీజ్ సయీద్ పాత్ర, ఉగ్రవాదులకు పాక్ అండ వంటి అంశాలను పొందుపర్చింది. గతేడాది మిగతా 2లో..



సంధ్య థియేటర్ ఘటన..

## వర్చువల్‌గా కోర్టుకు హాజరైన అల్లు అర్జున్

2లో..



## కోర్ అర్బన్‌లో పర్యాటక అభివృద్ధి శాఖను

# అభివృద్ధి చేయాలి

### ఫ్యూచర్‌సిటీలోని అటవీ భూములను అంతర్జాతీయ స్థాయిలో తీర్చి దిద్దాలి

- తారామతి బారాదరి, దుర్గం చెరువులను పూర్తిస్థాయి పర్యాటక ప్రాంతాలుగా మార్చాలి
- ట్రాఫిక్ మళ్లించి బ్రిడ్జిలపై పర్యాటకుల కోసం ఏర్పాట్లు చేయాలి
- మంజీరా, దిల్‌కుషా గెస్ట్ హౌస్‌ల ఆధునికీకరణ
- ఎకో టూరిజం పార్కుల అభివృద్ధి
- అర్బన్ ఫారెస్ట్ ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలి
- పర్యాటకంపై సమీక్షలో అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ ఆదేశాలు

**హైదరాబాద్,జూలై6(జనంసాక్షి):** తారామతి బారాదరి, దుర్గం చెరువులను పూర్తిస్థాయి పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. పర్యాటక కేంద్రాలను గుర్తించి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. పర్యాటక రంగాన్ని అభివృద్ధికి అసవరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో పర్యాటకశాఖపై సీఎం సమీక్ష నిర్వహించారు. మంజీరా, దిల్‌కుషా గెస్ట్ హౌస్‌లను ఆధునికీకరించాలని.. టూరిజం హబ్ డెవలప్‌మెంట్ పథకం కింద వికారాబాద్ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలన్నారు. అక్కడ వీరభద్ర స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయడంతో పాటు యాదగిరిగుట్ట తరహాలో కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. క్యూర్ పరిధిలోని అటవీశాఖ భూములను ఎకో టూరిజంగా అభివృద్ధి చేయాలన్నారు.గుర్రంగూడ ఎకో పార్కు తరహాలో నగరంలో మరిన్ని పార్కులను తీర్చిదిద్దాలని సూచించారు. ఫ్యూచర్ సిటీలోని అటవీ భూములను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయాలి. అర్బన్ ఫారెస్ట్ ప్రాజెక్టుల కోసం ప్రత్యేకాధికారులను నియమించాలన్నారు. పురానాపూల్, హెరిటేజ్ బ్రిడ్జిలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలి. ట్రాఫిక్‌ను మళ్లించి బ్రిడ్జిపై పర్యాటకుల కోసం ఏర్పాట్లు చేయాలి. డిసెంబర్‌లో జరిగే గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమిట్ ఏర్పాట్లు ప్రారంభించాలని సీఎం రేవంత్ దిశానిర్దేశం చేశారు.ఎంసీఆర్ మిగతా 2లో..

## కాళేశ్వరంపై కేసీఆర్ నిజాలు మాట్లాడాలి

### రూ.లక్ష కోట్లు ఎలా,ఎందుకు ఖర్చు పెట్టారో అసెంబ్లీకి వచ్చి వివరించాలి

ప్రాజెక్టుపై అంత డబ్బు దుబారా చేశారు కానీ.. పేదవాడికి ఒక సొంత ఇల్లు ఇవ్వలేకపోయారు

ఎవరేం చేశారో.. తెలంగాణ ప్రజలు అన్నీ గమనిస్తున్నారు : మంత్రి పొంగులేటి



**సిద్దిపేట,జూలై6(జనంసాక్షి):** గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి కాళేశ్వరం ప్రాజెక్టు కట్టడానికి లక్షల కోట్ల రూపాయల నిధులు వెచ్చిందని కానీ, పేదవాడికి ఒక సొంత ఇల్లు కట్టించి ఇవ్వడానికి మాత్రం వారికి మనసు రాలేదని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టింది వాళ్లే, దాన్ని ఓపెన్ చేసింది వాళ్లే, చివరకు అది కూలిపోయింది కూడా వాళ్ల హయాంలోనేనని మంత్రి గుర్తుచేశారు. ఇప్పుడు వాళ్లే కాళేశ్వరం దగ్గరకు పోయి తామేదో చేశామంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు.సిద్ధిపేట జిల్లా ములుగులో లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్లపట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖామంత్రి వివేక్ వెంకటస్వామి, జిల్లా కలెక్టర్ హైమావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌లపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రాజెక్టులో నీళ్లు నిల్వ ఉంచితే కింద ఉన్న ప్రాంతమంతా కొట్టుకుపోతుందని మిగతా 2లో..


### కాళేశ్వరంను కూలేశ్వరం చేసిందే బీఆర్ఎస్..

ప్రాజెక్టుపై కేటీఆర్ డ్రామాలు కట్టిపెడితే మంచిది..

లక్ష కోట్లు పెట్టి ప్రజల సొమ్ము దుబారా చేశారు :మంత్రి సీతక్క

హైకోర్టులో బండి భగీరత్ బెయిల్‌పై ముగిసిన వాదనలు

## తీర్పు రిజర్వు



9లో..

## ఎట్టకేలకు డీఎస్పీ భీమ్‌రెడ్డి అరెస్టు

### ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అదుపులోకి తీసుకున్న ఏసీబీ

**హైదరాబాద్,జూలై6(జనంసాక్షి):** ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలతో నమోదైన కేసులో డీఎస్పీ భీమ్‌రెడ్డిని ఏసీబీ అధికారులు సోమవారం అరెస్ట్ చేశారు. ఇటీవల నిర్వహించిన సోదాల్లో భారీ మొత్తంలో ఆస్తులు బయటపడటంతో ఆయనపై ఏసీబీ అధికారులు చర్యలు వేగవంతం చేశారు.ఐదు రోజుల క్రితం ఏసీబీ అధికారులు భీమ్‌రెడ్డితో పాటు ఆయన బంధువులకు సంబంధించిన నివాసాలు, ఇతర ప్రాంతాల్లో విస్తృత సోదాలు నిర్వహించాచిన విషయం తెలిసిందే. తెలంగాణలోని మొత్తం 16 ప్రాంతాల్లో ఏకకాలంలో చేపట్టిన ఈ దాడుల్లో పలు విలువైన ఆస్తులు, పత్రాలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సోదాల సందర్భంగా సుమారు రెండు కిలోల బంగారం, మిగతా 2లో..



## దేశానికి బీజేపీ క్షమాపణలు చెప్పాలి

- దేవుడి సొమ్మును దొంగిలించడం సిగ్గుచేటు
- అయోధ్య విరాళాల దోపిడీ వ్యవహారంలో మండిపడ్డ పొన్నం

**సిద్దిపేట,జూలై6(జనంసాక్షి):** అయోధ్య విరాళాల చోరీపై బిజెపి దేశానికి క్షమాపణలు చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు.. రాముని పేరుతో, అక్షింతలపై విరాళాలు అడుక్కున్నారని విమర్శించారు. బీజేపీ నాయకుల అవినీతిని గుర్తించి అయోధ్య ప్రజలే ఆ పార్టీ ఎంపీని ఓడించారన్నారు. ఈ విషయంలో బీజేపీ స్పందించి.. మిగతా 2లో..



ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి

### రాజీనామా

నూతన ప్రధాన కార్యదర్శిగా కృష్ణమోహన్ నియామకం

2లో..

## మోదీకి ఇండోనేసియా అరుదైన గౌరవం

### ప్రధాని విమానానికి ఎస్కార్ట్ ఫైటర్ జెట్‌తో ప్రత్యేక స్వాగతం





**జకార్తా(జనంసాక్షి):** ప్రధాని నరేంద్రమోదీ ఇండోనేసియా పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయనకు అరుదైన గౌరవం లభించింది. మోదీని ఆ దేశం ప్రత్యేకంగా స్వాగతించింది. ఆయన ప్రయాణిస్తున్న విమానం జకార్తా గగతనలంలోకి ప్రవేశించగానే.. ఆ దేశ వైమానిక దళానికి చెందిన యుద్ధ విమానాలు ఎస్కార్ట్‌గా వచ్చాయి. ప్రధాని మోదీ విమానాశ్రయానికి చేరుకోగానే ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో స్వాగతం పలికారు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ సోషల్ మీడియాలో పంచుకున్నారు. తాను జకార్తా చేరుకున్నానని.. ప్రబోవో సుబియాంతో స్వాగతం పలికిన తీరు తనను ఎంతగానో కదిలించిందని పేర్కొన్నారు. అన్ని రంగాల్లో ఇరు దేశాల మధ్య భాగస్వామ్యాన్ని మరింత పెంచే లక్ష్యంతో ముందుకు వెళ్తామన్నారు. ఇండోనేసియాలో పర్యటన ముగిసిన అనంతరం మిగతా 2లో..

## గంజాయి సాగుచేసే వారు తీవ్రవాదుల కంటే ఎక్కువ

- అటువంటి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటాం
- తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ హెచ్చరిక





**భద్రాద్రి కొత్తగూడెం,జూలై6(జనంసాక్షి):** రాష్ట్రంలో గంజాయి రవాణాను అరికట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఇప్పటికే దాడులు చేపట్టి పెద్ద ఎత్తున అరికట్టే చర్యలు చేపట్టామని అన్నారు. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మణుగూరులో నూతన పోలీస్ స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. ప్రతి పోలీస్ అధికారి డ్రగ్స్‌పై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. గంజాయి సాగును చేసే వారిని తీవ్రవాదుల కంటే ఎక్కువగా పరిగణిస్తామని హెచ్చరించారు. ప్రజలకు మంచి మిగతా 2లో..


## భారత్‌కు నీరవ్ మోదీ




### ఏ క్షణమైనా అప్పగించే అవకాశం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** బ్యాంకులను భారీ ఎత్తున మోసగించి దేశం విడిచి పారిపోయిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీని భారత్‌కు రప్పించే ప్రక్రియ తుది దశకు చేరింది. తనను భారత్‌కు అప్పగించకుండా ఉండేందుకు యూకే కోర్టుల్లో మిగతా 2లో..

## ఫిఫా ప్రపంచకప్‌నూ వదలని ట్రంప్



### అమెరికా అధ్యక్షుడి జోక్యంతో అమెరికన్ ఫుట్‌బాలర్‌పై సస్పెన్షన్ ఎత్తివేత.. యూరోఫుట్‌బాల్ మండిపాటు



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** అమెరికన్ ఫుట్‌బాలర్ ఫోలారిన్ బాలోగన్‌పై విధించిన సస్పెన్షన్‌ను ఫిఫా ఎత్తివేసింది. దీంతో ప్రిక్వార్టర్స్‌లో బెల్జియంతో జరిగే మ్యాచ్‌లో అతడు ఆడేందుకు మార్గం సుగమమైంది. అయితే, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జోక్యం చేసుకోవడంతో అతడిపై నిషేధం తొలగిపోవడం గమనార్హం. రౌండ్‌-32లో భాగంగా బోస్నియాతో జరిగిన మ్యాచ్‌లో ప్రత్యర్థి ఆటగాడి కాలి మడమను తొక్కినందుకు గానూ బాలోగన్‌కు రిఫరీ రెడ్ కార్డ్ చూపించారు. ప్రపంచకప్ నిబంధనల ప్రకారం అతనిపై ఒక మ్యాచ్ నిషేధం విధించారు. అయితే ఈ నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫిఫా అధ్యక్షుడు జియానీ ఇన్ఫాంటినోను ఫోన్‌లో కోరినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. అనంతరం ఫుట్‌బాలర్‌పై సస్పెన్షన్‌ను ఫిఫా ఎత్తివేసింది.అనంతరం ట్రంప్ దీనిపై పోస్ట్ చేశారు. "సరైన నిర్ణయం తీసుకుని.. జరిగిన అన్యాయాన్ని సరిదిద్దినందుకు ఫిఫాకు ధన్యవాదాలు" అంటూ రాసుకొచ్చారు. ఇలా ఆటగాడి సస్పెన్షన్‌ను ఎత్తివేయడం ఫిఫా చరిత్రలోనే తొలిసారి కావడం మిగతా 2లో..

మీరే కాదు.. భారత్‌కూడా

## మా వైపే..

ఆ దేశంలోని 140 కోట్ల జనాల మద్దతు కూడా ఉంది జె.డి.వాన్స్ వ్యాఖ్యలను తిప్పికొట్టిన నెతన్యాహు

2లో..



## మీ స్నేహాన్ని ఎప్పటికీ మరువలేం

### దుఃఖ సమయంలో ఇరాన్ ప్రజలకు అండగా నిలిచింది

ఇరుదేశాల మైత్రి, అనుబంధానికి ప్రతీక: భారత్‌కు ఇరాన్ కృతజ్ఞతలు

**టెహ్రాన్(జనంసాక్షి):** తమ మాజీ సుప్రీం ఖమేనీ అంత్యక్రియలకు హాజరైన భారత ప్రతినిధులకు దిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయం కృతజ్ఞతలు తెలిపింది. ఈ దుఃఖ సమయంలో ఇరాన్ ప్రజలకు అండగా నిలిచి..తమ సానుభూతిని భారత్‌ను మరిచిపోలేమని తెలపింది. ఈ చర్య ఇరుదేశాల మధ్య స్నేహం, అనుబంధానికి ప్రతీక అని.. చారిత్రక, సాంస్కృతిక సంబంధాలను ప్రతిబింబిస్తుందని పేర్కొంది. ఇరుదేశాల మధ్య ఉన్న ఈ చిరకాల బంధాన్ని, స్నేహాన్ని ఇరాన్ ప్రజలు ఎప్పటికీ గుర్తపెట్టుకుంటారని పేర్కొంది. మిగతా 9లో..

## జమ్మూకశ్మీర్‌లో క్లౌడ్‌బరస్ట్



### ఆకస్మిక వరదలతో విరిగిపడ్డ కొండచరియలు

రోడ్లు బురదమయమై అందులో కూరుకుపోయిన వాహనాలు.. ప్రజల ఇక్కట్లు



**శ్రీనగర్(జనంసాక్షి):** జమ్మూకశ్మీర్‌లోని కిశ్త్‌వాడ్‌లో మేఘ విస్ఫోటం సంభవించింది. ఆకస్మిక వరదలతో రోడ్లు బురదమయ మయ్యాయి. భారీ వర్షాలకు కొండ చరియలు విరిగి పడి అనేక ప్రాంతాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. కిశ్త్‌వాడ్‌లో నిర్మాణంలో ఉన్న 540 మెగావాట్ల జలవిద్యుత్ ప్రాజెక్ట్ వద్ద పలు వాహనాలు బురద, రాళ్ల కింద కూరుకు పోయాయి. వాటిని తొలగించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనలో ఆస్తి, ప్రాణనష్టానికి సంబంధించిన వివరాలు ఇంకా తెలియరా లేదు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడం వల్ల ప్రాజెక్ట్ సైట్‌కు వెళ్లే రహదారిపై కొండచరియలు విరిగిపడ్డా యని అధికా రులు పేర్కొన్నారు. పలు వాహనాలు, భారీయంత్రాలు బురద కింద కూరుకుపో యాయన్నారు. దాన్ని తొలగించి వాహనాలను బయటకు తీసేందుకు భారీ యంత్రాలతో రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించినట్లు తెలిపారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, ఆర్మీ సిబ్బంది, పోలీసులు మిగతా 9లో..

# కోర్ అర్బన్‌లో పర్యాటకశాఖను అభివృద్ధి చేయాలి

హెచ్ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో జరిగిన ఈ సమావేశంలో సీఎం సలహాదారు కె.రామకృష్ణా రావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్?, పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఎట్టకేలకు డీఎస్పీ భీమ్‌రెడ్డి అరెస్టు

20 కిలోల వెండి, 23 విదేశీ మద్యం సీసాలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే స్థిర, చరాస్తులకు సంబంధించిన పలు కీలక పత్రాలను కూడా పరిశీలించినట్లు సమాచారం. సోదాల అనంతరం భీమ్‌రెడ్డి అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఆయన ఆరోగ్య పరిస్థితి మెరుగుపడిన తర్వాత ఏసీబీ అధికారులు అధికారికంగా అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. కేసులో స్వాధీనం చేసుకున్న ఆస్తుల విలువ, వాటి మూలాలు, కుటుంబ సభ్యుల పేర్లపై ఉన్న ఆస్తుల వివరాలపై ఏసీబీ అధికారులు సమగ్ర దర్యాప్తు చేస్తున్నారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను ఏసీబీ అధికారులు త్వరలో వెల్లడించే అవకాశం ఉంది. డీఎస్పీ స్థాయి అధికారిపై అవినీతి ఆరోపణల నేపథ్యంలో జరిగిన ఈ పరిణామం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఏసీబీ దర్యాప్తులో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి.

# గంజాయి సాగుచేసే వారు తీవ్రవాదుల కంటే ఎక్కువ

సేవలు అందించాలని ఈ సందర్భంగా పోలీసులకు ఆయన సూచించారు. ప్రజలకు ఆటంకం కలగకుండా శాంతి భద్రతలు కాపాడాలని పోలీసులకు తెలంగాణ డీజీపీ స్పష్టం చేశారు. ఏఐ టెక్నాలజీతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పోలీసులకు వివరించారు. యువత డ్రగ్స్‌కి అలవాటు కాకుండా ఉండేందుకు కఠినమైన చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో మావోయిస్టులను పూర్తిగా అదుపు చేశామని గుర్తు చేశారు. ప్రస్తుతం కొత్తగా మాదక ద్రవ్యాలు, సైబర్ క్రైమ్స్, రోడ్డు ప్రమాదాలపై దృష్టి సారించాలని పోలీసులకు స్పష్టం చేశారు.

# మోదీకి ఇండోనేసియా అరుదైన గౌరవం

ప్రధాని మోదీ జులై 8న ఆస్ట్రేలియా చేరుకుంటారు. జులై 9న అక్కడ జరిగే 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడి నుంచి న్యూజిలాండ్‌కు వెళ్లనున్నారు. ఇదీ చదవండి: మీ స్నేహాన్ని ఎప్పటికీ మరువలేం.. భారత్‌కు ఇరాన్ కృతజ్ఞతలు

**శ్యామాప్రసాద్ ముఖర్జీకి నివాళి అర్పించిన ప్రధాని మోదీ**

భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఘనంగా నివాళులర్పించారు. దేశ సమైక్యత కోసం ఆయన చేసిన త్యాగం, ప్రజాసేవ పట్ల చూపిన అంకితభావం తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఆయన జీవితం 'ధైర్యానికి, మాతృభూమి పట్ల అచంచలమైన నిబద్ధతకు కాలాతీత ఉదాహరణ' అని కొనియాడారు. ప్రధాని మోదీ తన బ్లాగ్‌లో శ్యామా ప్రసాద్ ముఖర్జీ జీవిత విశేషాలను ప్రస్తావించారు. శ్యామా ప్రసాద్ సంపన్న కుటుంబంలో జన్మించినప్పటికీ, దేశసేవనే జీవిత లక్ష్యంగా ఎంచుకున్నారని చెప్పారు. వలస పాలన, విభజన రాజకీయాలు, సామాజిక సవాళ్ల వంటి అంశాలపై ఆయన రాజీపడకుండా పోరాడారని గుర్తు చేశారు. దేశ సమైక్యతే శ్యామా ప్రసాద్ ముఖర్జీ ప్రజాజీవితానికి మూల సూత్రమని ప్రధాని అన్నారు. దేశ విభజన సమయంలో పశ్చిమ బెంగాల్ భారతదేశంలోనే కొనసాగడంలో ఆయన కీలక పాత్ర పోషించారని, అనంతరం జమ్మూ కశ్మీర్ సంపూర్ణ విలీనానికి కృషి చేస్తూ నిర్బంధంలోనే ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. మ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 370, 35ఏలను 2019లో తమ ప్రభుత్వం రద్దు చేసిందని, అది శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాలకు నిజమైన నివాళి అని ప్రధాని మోదీ అభివర్ణించారు అలాగే కలకత్తా విశ్వవిద్యాలయానికి అత్యంత పిన్న వయసులో వైస్ ఛాన్సలర్‌గా బాధ్యతలు చేపట్టిన శ్యామా ప్రసాద్.. పరిశోధన, గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. స్వతంత్ర భారత తొలి పరిశ్రమల మంత్రి అయిన శ్యామా ప్రసాద్ ముఖర్జీ, దామోదర్ వ్యాలీ కార్పొరేషన్, సింద్రి ఎరువుల కర్మాగారం వంటి కీలక ప్రాజెక్టులకు పునాది వేశారని ప్రధాని గుర్తు చేశారు.

# భారత్‌కు నీరవ్ మోదీ

అందుబాటులో ఉన్న అన్ని న్యాయపరమైన అవకాశాలను కోల్పోయిన తరువాత.. ఆయన 'యూరోపియన్ కోర్ట్ ఆఫ్ హ్యూమన్ రైట్స్'ను ఆశ్రయించారు. అక్కడ కూడా ఆయనకు ఉపశమనం లభించలేదు. దీంతో యూకే నీరవ్‌ను భారత్‌కు అప్పగించే ప్రక్రియ ప్రారంభించినట్లు తెలుస్తోంది. 2019 మార్చి నుంచి లండన్ జైలులో ఉన్న నీరవ్ మోదీపై పీఎన్‌బీ రుణ మోసం, మనీలాండరింగ్ కేసుల్లో విచారణ కొనసాగుతోంది. ఈ కేసుల్లో ఆయనను భారత్‌కు తీసుకురావాలని సీబీఐ, ఈడీ చాలా కాలంగా ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే.

# కీవ్‌పై రష్యా భారీ దాడి

**ప్రతిగా భారత్‌కు చమురు ఎగుమతి చేసే రష్యా పోర్టులపై ఉక్రెయిన్ దాడి**

కీవ్,మాస్కో(జనంసాక్షి):ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లోని అనేక ప్రాంతాలపై రష్యా భీకర దాడులు చేసింది. బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్‌లతో మాస్కో విరుచుకుపడడంతో అనేక భవనాలు ధ్వంసమయ్యాయని.. 12 మంది ప్రాణాలు కోల్పోయారని కీవ్ అధికారులు వెల్లడించారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించడానికి సహాయక చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. నాటో శిఖరాగ్ర సదస్సులో భాగంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ భేటీ కానున్న వేళ ఈ దాడులు చోటుచేసుకోవడం గమనార్హం.కీవ్‌లోని సైనిక-పారిశ్రామిక సౌకర్యాలు, ఇంధన, శక్తి కేంద్రాలను లక్ష్యంగా చేసుకున్నట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. తమ దేశంలోని పౌర మౌలిక సదుపాయాలపై ఉక్రెయిన్ దాడులకు ప్రతిస్పందనగా ఈ దాడులు చేపట్టినట్లు వెల్లడించింది. కీవ్‌పై మాస్కో అతిపెద్ద దాడులకు సిద్ధమవుతోందని.. ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ హెచ్చరించిన కొన్ని గంటల్లోనే ఈ దాడులు చోటుచేసుకున్నాయి.

భారత్‌కు చమురు ఎగుమతి చేసే రష్యా పోర్టులపై ఉక్రెయిన్ దాడి

మాస్కో:రష్యాలోని చమురు క్షేత్రాలు, ఇంధన మౌలిక సదుపాయాలే లక్ష్యంగా సోమవారం తెల్లవారుజామున ఉక్రెయిన్ డ్రోన్ దాడులు చేసింది. ఈ దాడుల్లో భారత్‌కు చమురు ఎగుమతి చేసే బాల్టిక్ సముద్రంలోని వైసోట్స్క్, ఉస్ట్-లుగా పోర్టులు తీవ్రంగా దెబ్బతిన్నట్లు రష్యా అధికారులు వెల్లడించారు. 70కి పైగా డ్రోన్లను కూల్చామన్నారు. చమురు శుద్ధి కర్మాగారాలపై డ్రోన్ దాడులు కొనసాగుతుండడంతో ఇంధనం నింపే కేంద్రాల వద్ద కిలోమీటర్ల మేర ట్యాంకర్లు నిలిచిపోయాయని పేర్కొన్నారు. ఉస్ట్-లుగా రష్యాలోని అతిపెద్ద ఓడరేవులలో ఒకటి. మాస్కోను బలహీనపరిచే ప్రయత్నంలో భాగంగా ఉక్రెయిన్ గతంలోనూ పలుమార్లు ఈ ఓడరేవును లక్ష్యంగా చేసుకుంది. రష్యా నుంచి భారత్‌కు ఎగుమతయ్యే మొత్తం చమురులో 60-70 శాతం.. బాల్టిక్ సముద్ర మార్గం (ప్రధానంగా ఉస్ట్-లుగా, ప్రిమోర్స్క్ ఓడరేవుల) ద్వారానే రవాణా అవుతోంది. అక్కడి నుంచి చమురు నౌకలు ఉత్తర సముద్రం, సూయజ్ కాలువ, ఎర్ర సముద్రం మీదుగా ప్రయాణించి భారత తీరాలకు చేరుకుంటాయి.

# కాళేశ్వరంపై కేసీఆర్ నిజాలు మాట్లాడాలి

ఎన్‌డీఎస్‌ఏ హెచ్చరించినా, బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్న తీరు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. ప్రాజెక్టు కట్టినప్పుడు గత పాలకులకు చిత్తశుద్ధి, నిజాయితీ ఉంటే కాళేశ్వరానికి ఈ గతి పట్టేది కాదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దుయ్యబట్టారు. కేవలం అధికారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వంపై నిందలు మోపడం ఆపాలని హితవు పలికారు. కాళేశ్వరం ప్రపంచంలోనే ఎనిమిదో వింత అన్న పెద్దమనిషి కేసీఆర్ ఇప్పటికైనా అసెంబ్లీకి రావాలి. కాళేశ్వరాన్ని ఎలా కట్టారో సమాధానం చెప్పి.. తాము చేసిన పాపాన్ని అసెంబ్లీ సాక్షిగా కడుక్కోవాలని సవాల్ విసిరారు. వారు ఏవైనా సలహాలు, సూచనలు ఇవ్వాలనుకుంటే అసెంబ్లీ వేదికగా చర్చించడానికి తాము సిద్ధంగా ఉన్నామని, కేసీఆర్ సభకు వచ్చి కాళేశ్వరంపై పూర్తి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలోనే కాళేశ్వరం కట్టారని.. ఆ ప్రాజెక్టు పేరుతో నిధులు మెక్కారని ఎద్దేవా చేశారు. కానీ నిందలేమో తమ ప్రభుత్వంపై వేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రతి విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని.. ప్రతిసారి కర్రు కాల్చి వాత పెడుతున్నారని హెచ్చరించారు. పేదోడి కష్టం తెలియని బీఆర్ఎస్ ప్రభుత్వానికి మాత్రం కాళేశ్వరం కట్టడానికి లక్ష కోట్ల రూపాయలు ఎలా వచ్చాయని మంత్రి పొంగులేటి ప్రశ్నించారు. అధికారం కావాలనే దాహంతో తమ ప్రభుత్వంపై నిందలు మోపడం బీఆర్ఎస్ నేతలు ఆపాలని



హితవు పలికారు. చిత్తశుద్ధితో సలహాలు ఇవ్వాలనుకుంటే అసెంబ్లీకి రావాలని కోరారు. ప్రపంచంలో ఉన్న ఏడు వింతలు కాదని.. ఎనిమిదో వింత కాళేశ్వరమని ఆనాడు చెప్పిన పెద్దమనిషి అసెంబ్లీకి రావాలని సూచించారు. కాళేశ్వరం ఎలా కట్టారో చెప్పాలని, కేసీఆర్ తెలంగాణకు చేసిన పాపాన్ని అసెంబ్లీ సాక్షిగా కడుక్కోవాలని పేర్కొన్నారు.బీఆర్ఎస్ హయాంలో పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అసంపూర్తిగా కట్టి మధ్యలోనే వదిలేశారని మంత్రి పొంగులేటి ఆరోపించారు. గుడిసెలు లేని తెలంగాణను నిర్మించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం వదిలేసిన ఆ అసంపూర్తి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అన్నింటినీ రిపేర్ చేసి త్వరలోనే పేదలకు అందిస్తామని భరోసా ఇచ్చారు. అవసరమైతే తల తాకట్టు పెట్టి అయినా సరే, అర్హులైన ప్రతి పేదవాడి సొంత ఇంటి కలను నెరవేర్చడమే తమ ఇందిరమ్మ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో 32 వేల పూరి గుడిసెలు ఉన్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు. మొదటి విడతలో ఇవ్వలేక పోయిన వాటికి రెండో విడత ఇందిరమ్మ ఇళ్లలో ఇస్తామని.. వారికే మొదటి ప్రాధాన్యం కల్పిస్తామని వెల్లడించారు. ఏ పార్టీల్లోని లబ్ధిదారులైనా.. పైరవీ లేకుండా చిత్తశుద్ధితో ఇళ్లను మంజూరు చేస్తున్నామని వివరించారు. కేసీఆర్ హయాంలో సిద్దిపేట గజ్వేల్, సిరిసిల్ల, నియోజకవర్గాల్లో మాత్రమే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అత్యధికంగా కట్టుకున్నారని చెప్పారు. వేరే నియోజకవర్గాల్లో అరకొరగా 50, 60 ఇళ్లు కట్టి అసంపూర్తిగానే వదిలేశారని తెలిపారు. రెండోవిడతలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా రెండున్నర లక్షల ఇళ్లను మంజూరు చేశామని వ్యాఖ్యానించారు. గతంలో అసంపూర్తిగా ఉన్న ఇళ్లకు కూడా డబ్బులు ఇవ్వాలని కేబినెట్‌లో నిర్ణయించామని చెప్పుకొచ్చారు. ప్రతి నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న 500 ఇళ్లకు నిధులు మంజూరు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

# పహల్గాం సూత్రధారి హాఫీజ్ సయీద్

డిసెంబరు 15న దాఖలైన తొలి ఛార్జిషీట్‌లో పాకిస్థానీ హ్యాండ్లర్ సాజిద్‌తో పాటు, 2025 జులైలో జరిగిన ఆపరేషన్ మహాదేవ్‌లో భద్రతా బలగాలు హతమార్చిన ముగ్గురు ఉగ్రవాదులు, అరెస్టయిన ఇద్దరు నిందితులను ఎన్ఐఏ పేర్కొంది. దాడిలో లష్కరే తయ్యిబా, దాని అనుబంధ సంస్థ అయిన టీఆర్ఎఫ్ సంస్థల పాత్ర గురించి అభియోగపత్రంలో చేర్చింది. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఏప్రిల్ 22, 2025న జరిగిన ఉగ్రదాడిలో 26 మంది మృతి చెందిన విషయం తెలిసిందే.

**సంధ్య థియేటర్ ఘటన..**

# వర్చువల్‌గా కోర్టుకు హాజరైన అల్లు అర్జున్

**హైదరాబాద్(జనంసాక్షి):** సంధ్య థియేటర్ ఘటన కేసులో సినీనటుడు అల్లు అర్జున్ నాంపల్లి కోర్టులో వర్చువల్‌గా విచారణకు హాజరయ్యారు. షూటింగ్ కారణంగా ముంబయిలో ఉండడంతో వర్చువల్ విచారణకు న్యాయస్థానం అనుమతించింది. ఈ క్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా న్యాయమూర్తి ఎదుట అల్లు అర్జున్ విచారణకు హాజరయ్యారు. అయితే, ఈ కేసుకు సంబంధించి ఇవాళ కొంతమంది నిందితులు కోర్టుకు హాజరుకాకపోవడంతో తదుపరి విచారణను న్యాయస్థానం జులై 29వ తేదీకి వాయిదా వేసింది. ఈ కేసులో 23 మంది నిందితులపై 500 పేజీల ఛార్జిషీట్ కాపీలను పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టుకు సమర్పించారు.

# బెంగాల్లో మూడు రాజ్యసభ స్థానాలకు నోటి ఫికేషన్

**24న ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ విడుదల**

కోల్‌కతా,జూలై6(జనంసాక్షి): పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీల రాజీనామాలతో మూడు రాజ్యసభ స్థానాలకు ఖాళీలు ఏర్పడ్డ సంగతి తెలిసిందే. ఎంపీలు సుఖేందు శేఖర్ రాయ్, సుస్మితా దేవ్, ప్రకాష్ చిక్ బారైక్ రాజీనామాలతో ఈ ఖాళీలు ఏర్పడ్డాయి. భారత ఎన్నికల సంఘం ఈ మూడు రాజ్యసభ స్థానాలకు సంబంధించి ఉప ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. జులై 24వ తేదీన మూడు స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపింది. జూలై 7వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. నామినేషన్ల సమర్పణకు జూలై 14 ఆఖరి తేదీ అని పేర్కొంది. ఎన్నికల సంఘం మూడు ఖాళీలను విడివిడిగా పరిగణిస్తూ ప్రత్యేకంగా నోటిఫికేషన్లు జారీ చేసి, పోలింగ్ నిర్వహించనుంది. జులై 24వ తేదీన ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. బ్యాలెట్ పేపర్‌పై ఓటు వేయడానికి రిటర్నింగ్ అధికారి ఇచ్చే ప్రత్యేక ఊదా రంగు పెన్ను మాత్రమే వాడాలని, ఇతర పెన్నులు వాడితే ఓటు రద్దవుతుందని ఎన్నికల సంఘం తెలిపింది. ఇక, అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభంకానుంది.

# కాళేశ్వరంను కూలేశ్వరం చేసిందే బీఆర్ఎస్..

**మహబూబాబాద్,జూలై6(జనంసాక్షి):**

కాళేశ్వరం పేరుతో కెటిఆర్ డ్రామాలు చేస్తున్నారని మంత్రి సీతక్క ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి కేటీఆర్ తీరుపై పై మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మహబూబాబాద్‌లో పర్యటించి, పలు కార్యక్రమాల్లో మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. కేటీఆర్‌కు అధికార దాహమే తప్ప... ప్రజలపై ప్రేమ లేదని విమర్శించారు.పదేళ్లు అధికారంలో ఉండి ఏం చేశారని మంత్రి ప్రశ్నించారు. కాళేశ్వరం కట్టింది.. కూలిపోయింది బీఆర్ఎస్ హయాంలోనే అని ప్రస్తావించారు. కాళేశ్వరం పేరుతో లక్షన్నర కోట్లను వృథా చేశారని ఆరోపించారు. మళ్లీ అధికారం కావాలంటున్నారని.. ఆ ప్రాజెక్టులో నీటిని నిల్వచేస్తే పరివాహక గ్రామాలన్నీ కొట్టుకుపోవాలని కేటీఆర్ చూస్తున్నారా.. అని మంత్రి సీతక్క ప్రశ్నించారు. పదేళ్లలో తెలంగాణ ప్రజల జీవితాలను బీఆర్ఎస్ తాకట్టు పెట్టిందని మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో నీటి పారుదల శాఖను నాశనం చేశారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నాయకులు ఏది ముట్టుకుంటే అది నాశనమని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక ఇరిగేషన్ శాఖను చక్కదిద్దామని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నాయకుల లాభం కోసం కాళేశ్వరం కట్టారు తప్ప.. తెలంగాణ ప్రజల కోసం కాదని చెప్పుకొచ్చారు. కోట్లు ఖర్చు చేసి నామమాత్రపు ఆయకట్టు ఇచ్చారని మంత్రి తెలిపారు. ఆ ప్రాజెక్టులు అన్ని అసంపూర్తిగా ఉన్నాయని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టింది కేసీఆర్ హయాంలోనే.. కూలిపోయింది వాళ్ల హయాంలోనే అని ఇంజినీర్లు రిపోర్ట్ ఇచ్చారని ప్రస్తావించారు. కన్నెపల్లి పంపు దగ్గరకు పోయి ప్రాణహిత పంపు ఆన్ చేసి నీళ్లు ఇవ్వాలంటూ మాజీ మంత్రి కేటీఆర్ నాటకాలు ఆడుతున్నారని వ్యంగ్యంగా అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు సరిగ్గా కడితే ఈ పరిస్థితి వచ్చేది కాదని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ వల్లే కాళేశ్వరం నీళ్లు ఉపయోగించలేక పోతున్నామని అన్నారు. నాసిరక నిర్మాణం వల్లే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులు ఉపయోగించలేక పోతున్నామని మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఫౌండేషన్ తప్పుగా ఉందని అధికారులు రిపోర్ట్ ఇచ్చారని తెలిపారు. కాళేశ్వరం ఇలానే కొనసాగిస్తే ప్రమాదమని అంతర్జాతీయ, జాతీయ నీటి నిపుణులు నివేదిక ఇచ్చారని అన్నారు. కేటీఆర్ కన్నా ఎన్డీఎస్ఏ అధికారులకు నాలెడ్జ్ ఎక్కువగా ఉందని తాను అనుకుంటున్నానని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లు స్టోరేజ్ చేసినప్పుడు కూలిపోతే కింద ఉన్న 40 ఊర్లు, భద్రాచలం కొట్టుకుపోతుందని హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకులు కమిషన్లకు కక్కుర్తి పడి తుమ్మడిహెట్టి వద్ద ప్రాజెక్ట్ కట్టకుండా తెలంగాణ ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. లేకపోతే ఎప్పుడో ఉత్తర తెలంగాణ సస్యశామలం అయ్యేదని వివరించారు. తెలంగాణ ప్రజలకు అన్యాయం చేసింది కాక ఇప్పుడు ఎదురుదాడి విమర్శలు చేయడంపై మంత్రుఇ సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు.

**'యూజర్‌నేమ్' వ్యవహారం..**

# వాట్సప్‌నకు కేంద్రం మరో 3 రోజుల డెడ్‌లైన్

**న్యూఢిల్లీ:**ప్రముఖ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సప్ ఇటీవల కొత్తగా తీసుకొచ్చిన 'యూజర్‌నేమ్' ఫీచర్ వివాదాస్పదమైన విషయం తెలిసిందే. దీంతో ఈ ఫీచర్‌పై వివరణ ఇవ్వాలని మెటాకు కేంద్ర ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. ఆ గడువు నేటితో ముగియనున్న నేపథ్యంలో.. వాట్సప్ నకు కేంద్రం కాస్త ఊరట కల్పించింది. నోటీసులపై సమాధానం ఇచ్చేందుకు మరో 3 రోజుల పాటు అదనపు గడువు కల్పించింది. దీనిపై సంప్రదింపులు పూర్తయ్యేంతవరకు యూజర్‌నేమ్ ఫీచర్ ను భారత్‌లో అందుబాటులోకి తీసుకురాబోమని వాట్సప్ ఈ సందర్భంగా కేంద్రానికి తెలిపింది.ఫోన్ నంబర్ ప్రైవసీని కాపాడుతూ యూజర్ నేమ్ ఆప్షన్‌ను వాట్సప్ ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. దీనివల్ల యూజర్లు ఫోన్ నంబరును షేర్ చేయాల్సిన అవసరం లేకుండానే సంభాషణలు జరపొచ్చని తెలిపింది. అయితే, ఈ ఫీచర్ వల్ల నకిలీ యూజర్‌నేమ్స్ సృష్టించి, ప్రజలను మోసం చేసే ప్రమాదం ఉందని ఆందోళనలు వ్యక్తమయ్యాయి. సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్ట్ స్కామ్‌ల వంటివి చోటుచేసుకునే అవకాశం ఉందని భయాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలోనే స్పందించిన కేంద్రం మెటాకు నోటీసులు జారీ చేసింది. ఈ ఫీచర్ ఐటీ చట్టాన్ని ఉల్లంఘించేలా ఉందని అందులో పేర్కొంది. ఆ చట్టం కింద వాట్సప్‌పై ఎందుకు చర్యలు తీసుకోకూడదే వివరణ ఇవ్వాలని కేంద్రం ఆదేశించింది. అంతేగాక, ఈ వ్యవహారంలో సంప్రదింపులు పూర్తయ్యేదాకా ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకురావొద్దని స్పష్టం చేసింది.ఈ ఫీచర్‌పై వివరణ ఇచ్చేందుకు జులై 6 వరకు గడువు విధించడంతో మెటా ప్రతినిధులు.. కేంద్రాన్ని సంప్రదించారు. సమాధానం ఇచ్చేందుకు తమకు మరింత సమయం ఇవ్వాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ.. జులై 9 వరకు గడువు కల్పించింది.

# బహ్రాయిన్‌లో నిజామాబాద్ వాసి మృతి

**బీచ్‌లో ప్రమాదవశాత్తు దుర్మరణం**

నిజామాబాద్,జూలై6(జనంసాక్షి):బహ్రెయిన్‌లో విషాదం నెలకొంది. దుర్రత్ అల్ బహ్రెయిన్ సముద్ర తీరంలో నీటిలో మునిగి తెలంగాణ వాసి ప్రాణాలు కోల్పోయారు. మృతుడిని నిజామాబాద్ జిల్లాకు చెందిన తోట శ్రీనివాస్‌గా గుర్తించారు. అతను బహ్రెయిన్‌లోని ఏఎంసీ సంస్థలో ప్రాజెక్ట్ డిపార్ట్‌మెంట్‌లో ఆపరేటర్‌గా 2019 నవంబర్ 26వ తేదీ నుంచి విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో తాజాగా సముద్ర తీరానికి వెళ్లిన అతను ప్రమాదవశాత్తూ నీటిలో మునిగిపోయాడు. దీనిపై సమాచారం అందుకున్న బహ్రెయిన్ కోస్ట్‌గార్డు బృందాలు ఘటనాస్థలికి చేరుకు సహాయక చర్యలు చేపట్టాయి. కానీ లాభం లేకుండాపోయింది. తోట శ్రీనివాస్ మృతిపై ఏఎంసీ సంస్థ యాజమాన్యం సంతాపం ప్రకటించింది. అతని కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపింది.

# దేశానికి బీజేపీ క్షమాపణలు చెప్పాలి

దేశ ప్రజలందరికీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శ్రీరామునికి రామ జన్మభూమిలో రామ మందిర విరాళారం నిర్మాణానికి ప్రజలు ఎవరి స్థితికి తగ్గట్టు వారు విరాళాలు ఇచ్చారని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. విరాళాల్లో కోట్ల రూపాయలు అవినీతి జరిగిందని ఆరోపించారు. రాజకీయంగా ఎదగడానికి రాముని పేరును కమలం పార్టీ వాడుకుందని ఆరోపించారు. రాజకీయం వేరు, భక్తి వేరని మంత్రి తెలిపారు. ఈ విషయంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అమిత్ షా, యూపీ ముఖ్యమంత్రిదే బాధ్యత అని అన్నారు. రాముడి హుండీలోని విరాళాలను ఎత్తుకెళ్లడం దేశ ప్రజలకు అవమానకరమన్నారు. భక్తి పేరుతో, రాముని పేరుతో రాజకీయం చేసే వారి రంగును ప్రజలు గుర్తించాలని తెలిపారు. దేవుడి పేరుపై బీజేపీ స్కాం చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. అయోధ్యలో రామ జన్మభూమి నిర్మాణం జరగాలనీ శిలాన్యాసం రాజీవ్ గాంధీ గారు వేశారు..అయోధ్య ట్రస్ట్ నిర్వాహకులు ప్రధాని మోడీ, అమిత్ షా,ముఖ్యమంత్రి గారికి సన్నిహితులు వారు ఎందుకు స్పందించడం లేదన్నారు. హుండీలు కొల్లగొట్టారు..రాముని పేరు మీద దేశ వ్యాప్తంగా వసూలు చేసిన చందాలు ఎత్తుకొని పోయారు.. ఇక్కడ ప్రతి ఊర్లో అక్షింతలు పంచి ఓట్లు అడిగారు.. మీకు రామునికి వ్యతిరేకం కాదు..మేము శ్రీరాముడి కళ్యాణంలో పాల్గొంటాం..ఇల్లంతకుంట రామాలయంలో నేను ఎంపీగా ఉన్నప్పుడు ప్రారంభించిన బోజన కార్యక్రమం ఇప్పటికీ నడుస్తుంది..రామాలయం పై బీజేపీ పెద్దలు స్పందించాలి...భక్తి పేరు మీద రాముని పేరు మీద రాజకీయాలు చేసే వారు మాట్లాడాలని పొన్నం అన్నారు. అక్కడ జరిగిన దానిపై పొరపాటు అని దేశ ప్రజలకు క్షమాపణలు అడగాలి..రామ జన్మభూమి అయోధ్య ఆలయంలో సొమ్ములు దొంగిలించడంపై హిందువులు అందరికీ అవమానం..దేవుడి పేరు మీద జరిగిన స్కాం.. దేవుడి స్కాం కి వాడుకున్న పార్టీ బీజేపీ అన్నారు. మజ్లిస్ పేరు తీయంది కిషన్ రెడ్డి బతకడు..కిషన్ రెడ్డి గెలవాలంటే మజ్లిస్ ను తిట్టాలి ఇది వారి రాజకీయాలు అంటూ విమర్శించారు. రాష్ట్రంలో ఓటరు సవరణ పక్రియ జరుగుతుంది. ఓటరు సవరణ ప్రజాస్వామ్యంలో చాలా ముఖ్యమైంది..ప్రతి ఇంటింటా ఎన్యూమరేషన్ ఫారాలు చేరాయి.. బిఎల్‌వోలతో సమన్వయం చేసుకుంటూ అర్హత కలిగిన ఒక ఓటు కూడా మిస్ కాకుండా చూడాలన్నారు. నేను స్వయంగా ఏడు మండలాలు ప్రత్యక్షంగా తిరిగాను..మా పార్టీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చాం..హైదరాబాద్ ,సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో బతిస పై ఉప ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో జరిగింది..ఓటరు సవరణ పక్రియ విజయవంతంగా జరగాలని అన్నారు.

**ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి రాజీనామా**

లక్నో(జనంసాక్షి):అయోధ్య విరాళాల చోరీ ఘటన వెలుగులోకి రావడంతో నైతిక బాధ్యత వహిస్తూ శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి పదవికి చంపత్‌రాయ్ రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను ట్రస్ట్ సమావేశంలో ఆమోదించారు. మరోవైపు కొత్త ప్రధాన కార్యదర్శిగా విశ్వ హిందూ పరిషత్ కు చెందిన సీనియర్ నేత బజరంగ్ బాగ్రాను నియమిస్తున్నట్లు సమాచారం. ఈ సమావేశంలో రామమందిర నిర్వహణకు సంబంధించి భవిష్యత్తులో తీసుకునే చర్యలు, నూతన పరిపాలన వ్యవస్థ ఏర్పాటు వంటి వాటి గురించి కూడా చర్చించినట్లు ట్రస్ట్ వెల్లడించింది. అయోధ్య విరాళాల దుర్వినియోగం కేసులో చంపత్ రాయ్ డ్రైవర్ సహా ఎనిమిది మందిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఇందులో ఇంకా ఎవరెవరి పాత్ర ఉందనే విషయంపై సిట్ దర్యాప్తు కొనసాగిస్తోంది.ఆలయంలో విరాళాల చోరీ వార్తలు తనను తీవ్ర వేదనకు గురి చేశాయని క్షేత్ర ట్రస్ట్ ఛైర్మన్ నృత్య గోపాల్ దాస్ పేర్కొన్నారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి.. ఈ నేరంతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరినీ చట్టం ముందు నిలబెడతామన్నారు. బాధ్యులకు కఠిన శిక్ష విధించాలని సిట్ అధికారులను కోరారు.

**అయోధ్య ట్రస్టు ప్రధాన కార్యదర్శిగా కృష్ణమోహన్**

అయోధ్య విరాళాల చోరీ ఘటన నేపథ్యంలో శ్రీ రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ప్రధాన కార్యదర్శిగా కృష్ణ మోహన్ నియమితులయ్యారు. చంపత్ రాయ్ రాజీనామాను ఆమోదించిన ట్రస్టు.. ఆయన స్థానంలో తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా కృష్ణమోహన్‌కు బాధ్యతలు అప్పగించింది. ఈ విషయాన్ని ట్రస్టు కోశాధికారి గోవింద్ గిరి మీడియాకు వెల్లడించారు.అయోధ్య విరాళాల చోరీ వ్యవహారం వెలుగులోకి రావడంతో నైతిక బాధ్యత వహిస్తూ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్ సభ్యుడు అనిల్ మిశ్రా రాజీనామా చేసిన విషయం తెలిసిందే. సోమవారం మధ్యాహ్నం నుంచి దాదాపు 3 గంటలకు పైగా కొనసాగిన ఈ సమావేశానికి ట్రస్ట్ ఛైర్మన్ నృత్యగోపాల్ దాస్‌తో పాటు తొమ్మిది మంది శాశ్వత సభ్యుల్లో ఏడుగురు హాజరు కాగా.. చంపత్ రాయ్, మిశ్రా మాత్రం హాజరు కాలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి.

# ఫిఫా ప్రపంచకప్‌లోనూ ట్రంప్ జోక్యం

గమనార్హం. కాగా.. ఈ పరిణామాలపై బెల్జియం ఫుట్‌బాల్ సమాఖ్య మాత్రం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఫుట్‌బాల్ నైతిక విలువలకు ఇది విరుద్ధమని పేర్కొంది. అన్ని న్యాయపరమైన అవకాశాలను పరిశీలిస్తున్నట్లు వెల్లడించింది.

ట్రంప్ జోక్యంపై యూరోఫుట్‌బాల్ మండిపాటు

యూఎస్ఏ ఫుట్‌బాల్ ఆటగాడు ఫోలారిన్ బాలోగన్‌పై విధించిన సస్పెన్షన్‌ను ఫిఫా రద్దు చేయడం ఇప్పుడు చర్చకు దారితీసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'ఫిఫా'పై ఒత్తిడి తేవడం వల్లే సస్పెన్షన్ ఎత్తివేసినట్లు ఆరోపణలు వచ్చాయి. తాజాగా దీనిపై యూరోపియన్ ఫుట్‌బాల్ సమాఖ్య తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ మేరకు కీలక ప్రకటన జారీ చేసింది."యూఎస్ఏ ఆటగాడు ఫోలారిన్ బాలోగున్‌కు రెడ్ కార్డ్ జారీ అయింది. అతడిపై విధించిన ఆటోమేటిక్ మ్యాచ్ సస్పెన్షన్ అమలును ఏడాదిపాటు ప్రొబేషనరీ పీరియడ్ కోసం నిలిపేస్తూ ఫిఫా తీసుకున్న నిర్ణయం సహేతుకంగా అనిపించలేదు. ఫుట్‌బాల్‌లోనూ ఇతర జట్ల మాదిరిగా నియమాలకు కట్టుబడి ఉండాలి. పారదర్శకంగా నిర్ణయాలు ఉండాలి. లేకపోతే ఆట ప్రమాణాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. కానీ, యూఎస్ఏ ప్లేయర్ విషయంలో అలా జరగలేదు. రెడ్ కార్డ్ వచ్చిన తర్వాత ఆటోమేటిక్ సస్పెన్షన్ అనేది విచక్షణతో కూడిన ఎంపిక కాదు. నిబంధనలలో పొందుపరిచిన నియమం. దీనికి మినహాయింపులు లేవు. మెగా టోర్నీ మధ్యలో ఇతర ప్లేయర్లు రెడ్‌కార్డ్‌ను ఎదుర్కొని తమ సస్పెన్షన్‌ను పూర్తి చేసినప్పుడు.. అమెరికా ఆటగాడు మాత్రం తప్పించుకునేలా తీసుకున్న ఈ నిర్ణయం సమర్థనీయం కాదు. ఇలాంటిది జరుగుతుందని అస్సలు ఊహించలేదు. ఈ నిర్ణయాన్ని మేం వ్యతిరేకిస్తున్నాం" అని యూరోపియన్ ఫుట్‌బాల్ సంఘం తెలిపింది.

**అసలేం జరిగిందంటే?**

అమెరికన్ ఫుట్‌బాలర్ ఫోలారిన్ బాలోగన్‌పై విధించిన సస్పెన్షన్‌ను ఫిఫా ఎత్తివేసింది. దీంతో ప్రిక్వార్టర్స్‌లో బెల్జియంతో జరిగే మ్యాచ్‌లో అతడు ఆడేందుకు మార్గం సుగమమైంది. రౌండ్-32లో భాగంగా బోస్నియాతో జరిగిన మ్యాచ్‌లో ప్రత్యర్థి ఆటగాడి కాలిని తొక్కినందుకు గానూ బాలోగన్‌కు రిఫరీ రెడ్ కార్డ్ చూపించారు. ప్రపంచకప్ నిబంధనల ప్రకారం అతనిపై ఒక మ్యాచ్ నిషేధం విధించారు. అయితే ఈ నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫిఫా అధ్యక్షుడు జియానీ ఇన్ఫాంటినోను ఫోన్‌లో కోరినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. అనంతరం ఫుట్‌బాలర్‌పై సస్పెన్షన్‌ను ఫిఫా ఎత్తివేసింది.

# మీరే కాదు.. భారత్ కూడా మా వైపే..

**వాషింగ్టన్(జనంసాక్షి):**

భారత్ నుంచి తమకు మద్దతు ఉందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు చెప్పారు. అమెరికా-ఇరాన్ శాంతి చర్చల్ని ఇజ్రాయెల్ గౌరవించాలని, యావత్ ప్రపంచంలో శక్తిమంతమైన అమెరికా మద్దతు మాత్రమే ఇజ్రాయెల్‌కు ఉందని ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ చేసిన వ్యాఖ్యను ఆదివారం ఆయన ఖండించారు. "మాకు అనేక దేశాల అండ ఉంది. వాటిలో ఓ 'చిన్న' దేశమైన ఇండియా కూడా. ఆ దేశంలో 140 కోట్ల మంది ప్రజలున్నారు" అని వాన్స్‌కు చురక అంటించారు.ఫేస్‌బుక్‌లోనూ తనకు మద్దతు ఉందని చెప్పారు. తమ దేశంలోని అగ్రశ్రేణి సైబర్ భద్రత నిపుణుల సాయాన్ని అనేక దేశాలు కోరుతుంటాయన్నారు. చాలా దేశాల నేతలు తనకు ఫోన్ చేసి, వారి సమస్యలు చెప్పి ఏఐ, సైబర్ నిపుణుల చేయూతను కోరుతుంటారని వివరించారు. ప్రపంచంలో సైబర్ రంగంలో ఇజ్రాయెల్ రెండోస్థానంలో ఉందని, తమ సాంకేతికత ఎంతో మేలైనదని నెతన్యాహు చెప్పారు.

# ప్రజావసరాలు పట్టకుండా కబ్జాలు



- హైడ్రా ప్రజావాణికి 49 ఫిర్యాదులు

**హైదరాబాద్, జులై 06 (జనంసాక్షి) :** ఒకదగ్గర రహదారి కబ్జా, మరో చోట పార్కు, ఇంకో కాలనీలో నాలాపై నిర్మాణం.. ఇలా ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కబ్జాదారులు మాయం చేస్తున్నారు. లే ఔట్ వేసినప్పుడే ఎంతో ముందు చూపుతో పాఠశాల, క్రీడాస్థలం, పార్కు, లైబ్రరీ కోసం కేటాయించిన స్థలాలు తర్వాత ప్లాట్లుగా మారిపోతున్నాయి. తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్లు చేసుకుని ఇళ్లు నిర్మించేస్తున్నారు. గతంలో ఎన్నో ఇలా కబ్జాలకు గురయ్యాయి.. ఉన్నవాటిని కాపాడుకోవాలని నగర ప్రజలు హైడ్రాను ఆశ్రయిస్తున్నారు. హైడ్రా ప్రతి సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఫిర్యాదు చేస్తున్నారు. వంద గజాల పార్కు లేదా ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలం కబ్జా అయినా మౌనంగా ఉండడంలేదు. హైడ్రాకు వచ్చి ఫిర్యాదు చేశారు. మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కీసర మండలం, బోగారం గ్రామంలో సుచిరిండయా ప్రాజెక్టులో కొన్న ప్లాట్లను హోలిమేరి గ్రూప్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం ఆక్రమించుకుంది. దాదాపు 21 ప్లాట్లను ఆక్రమించుకున్నారని ఫిర్యాదు చేశారు. బేగంపేటలోని బ్రాహ్మనవాడ రోడ్డు నంబరు 7లో ఉన్న ఇల్లు కూలేందుకు సిద్ధంగా ఉంది. దానిని తొలగించి పక్కన ఉన్న వాళ్లకు ప్రమాదం లేకుండా కాపాడాలని అక్కడి నివాసితులు కోరారు. చందానగర్ హుడా కాలనీలోని మంజీరా పైపులైను రోడ్డును ఆక్రమించి ఇళ్లు నిర్మిస్తున్నారు. వెంటనే పనులు ఆపాలని కోరారు. ఇలా సోమవారం హైడ్రా ప్రజావాణికి మొత్తం 49 ఫిర్యాదులందాయి. ఈ ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్య పరిశీలించారు. ఫిర్యాదుల పరిష్కార బాధ్యతలను సబంధిత అధికారులకు అప్పగించారు.

మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి మండలం బోడుప్పల్ విలేజ్‌లోని సుద్దకుంట (బోడుప్పల్‌కుంట) లోంచి వేస్తున్న బాక్స్ డ్రైన్ పనులు వెంటనే పూర్తి చేసేలా చూడాలని హైడ్రా ప్రజావాణిలో అక్కడి నివాసితులు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతతం ఉన్న లైను మార్చి రహదారిలో బాక్సు డ్రైన్ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయని.. అలా లైనును మల్లిస్తే గ్రావిటీ(ఎత్తు పల్లాలు) ఇబ్బందులు తలెత్తుతాయని.. ప్రస్తుతం ఉన్న లైనును కొనసాగించి పనులు పూర్తి చేయాలని కోరారు. వాస్తవానికి రాచెరువు – సుద్దకుంట – ఉప్పల్ నల్లచెరువును కలుపుతూ సాగే ఈ వరద కాలువ ద్వార నాచారం, మల్లాపూర్ పారిశ్రామిక వ్యర్థజలాలు కూడా కలిసి వచ్చి పరిసరాలను దుర్గంధం చేయడమే కాకుండా.. భూగర్భ జలాలను కూడా కలుషితం చేస్తున్నాయని వాపోయారు. మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా మల్కాజిగిరి మండలం చెంగిచెర్ల డివిజన్ పరిధిలోని సర్వే నంబరు 130లో ఉన్న జయప్రద కాలనీలోని ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు కబ్జాలకు గురౌతున్నాయని అక్కడి నివాసితులు ఫిర్యాదు చేశారు. ఇందులోని 1200 చదరపు గజాల స్థలాన్ని వందగజాల ప్లాట్లుగా అమ్ముకుని ఇళ్లు నిర్మిస్తున్నారని అక్కడి నివాసితులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

శేరిలింగంపల్లి మండలం హాఫీజ్‌పేట్ లోని సాయినగర్ యూత్ కాలనీ ప్రాంతంలో ప్రధాన మురుగు కాలువ (సీవరేజ్ లైన్)పై అక్రమంగా ఇంటి నిర్మాణం చేపట్టి, మురుగు ప్రవాహాన్ని అడ్డుకోవడంతో తీవ్ర సమస్యలు ఏర్పడ్డాయని స్థానికులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఓ వ్యక్తి రోటరీ డాక్యుమెంట్ ఆధారంగా ప్రధాన మురుగు కాలువపై ఇంటిని నిర్మించారని, అనంతరం ఆ ఇంటి కిందుగా వెళ్లే సీవరేజ్ పైప్‌లైన్‌ను మూసివేయడంతో మురుగు నీటి ప్రవాహం పూర్తిగా నిలిచిపోయిందని పేర్కొన్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

- జిల్లా ప్రగతికి కార్యాచరణ వేగవంతం
- యూరియా సరఫరా పై అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలి
- అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలి
- మేడారం మాస్టర్ ప్లాన్ పై ప్రత్యేక దృష్టి సారించాలి
- రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క



**ములుగు ప్రతినిధి, జులై 06(జనంసాక్షి):** మేడారం ఆలయ అభివృద్ధి, మాస్టర్ ప్లాన్ అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని, వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, జిల్లాలో కొనసాగుతున్న పెండింగ్ అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ సీతక్క సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తో కలిసి మేడారం ఆలయ అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణ, ఐడీఓసీ పనుల పురోగతి, రామచంద్రపురం భూసర్వే, పైలాన్ నిర్మాణం, వర్షాల పరిస్థితి, రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి చేపట్టాల్సిన సన్నాహక చర్యలు తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ రహదారుల అభివృద్ధి కోసం పంచాయతీరాజ్ శాఖ ద్వారా సుమారు రూ.6,000 కోట్ల విలువైన పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ములుగు జిల్లాలో పర్యటించే సందర్భంగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. జాతీయ రహదారి పక్కన గట్టమ్మ దేవాలయం సమీపంలో పంచాయతీరాజ్ రోడ్డు పనులకు భూమిపూజ, నూతన కలెక్టరేట్, మెడికల్ కాలేజ్, నర్సింగ్ కాలేజ్, కేంద్రీయ విద్యాలయం, పొట్లాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్, కరకట్టల నిర్మాణం తదితర కీలక అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో చేపట్టిన ప్రధాన అభివృద్ధి కార్యక్రమాలను ఒకే శిలాఫలకంపై పొందుపరిచి, రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. మేడారం సమ్మక్క–సారలమ్మ ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఆలయ పరిసరాల్లో భూసేకరణ, రహదారుల విస్తరణ, క్యూ లైన్ల పునర్వ్యవస్థీకరణ, అతిథి గృహం, ఆసుపత్రి, కాటేజీలు, పార్కింగ్, పారిశుధ్య సదుపాయాలు, జంపన్న వాగు పరిసరాల అభివృద్ధి తదితర అంశాలతో సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. ప్రకృతి అందాలను పరిరక్షిస్తూ పర్యాటక అభివృద్ధికి అనుగుణంగా పనులు చేపట్టాలని, గట్టమ్మ దేవాలయం, పంచాయతీరాజ్ పైలాన్, ట్రైబల్ యూనివర్సిటీ, కలెక్టరేట్ తదితర ప్రాంతాలను అనుసంధానిస్తూ ములుగు జిల్లాను ఆకర్షణీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆలయ అభివృద్ధి పనుల్లో పూజారులు, స్థానిక ప్రజలు, అధికారులు పరస్పర సహకారంతో ముందుకు రావాలని కోరారు. యుద్ధ ప్రాతిపదికన జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రామచంద్రపురం పరిధిలోని 10,600 ఎకరాల భూముల రీసర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని, పొట్లాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్, రామప్ప–లక్నవరం పైప్‌లైన్ పనులను వేగవంతం చేయాలని సూచించారు. జంపన్న వాగులో ఏడాది పొడవునా నీరు ఉండేలా చర్యలు చేపట్టాలని, రైతులకు యూరియా కొరత లేకుండా తగిన నిల్వలు, సరఫరా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. వరదల సమయంలో అత్యవసర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని, పట్వారిపల్లె, సర్వాపురం గ్రామాల్లో రీసర్వే ప్రక్రియను వేగవంతం చేసేందుకు సర్వేయర్ల ప్రత్యేక బృందాలను సిద్ధం చేయాలని సూచించారు. వర్షాకాలంలో తాగునీరు కలుషితం కాకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టి ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని, అటవీశాఖ ఆధ్వర్యంలో వివిధ రకాల మొక్కలను అందుబాటులో ఉంచి విస్తృతంగా మొక్కల నాటకం చేపట్టాలని ఆదేశించారు. అనంతరం మీడియా ప్రతినిధుల తో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు ముందుగా మేడారం ఆలయానికి సంబంధించిన పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. పెండింగ్ బిల్లుల చెల్లింపులకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, రైతుబంధు, ఉద్యోగుల జీతాల చెల్లింపులు పూర్తయిన వెంటనే పెండింగ్ బిల్లులను కూడా విడుదల చేసే చర్యలు చేపడ తామని పేర్కొన్నారు. వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# కాళేశ్వరం అవినీతిపై కాంగ్రెస్, బీఆర్ఎస్ నాటకాలు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతిపై అటు కాంగ్రెస్ ప్రభుత్వం, బీఆర్ఎస్ పార్టీలు ఆడుతున్న రాజకీయ నాటకం తప్ప మరొకటి కాదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు అన్నారు. 'ఏక్ దేశ్.. ఏక్ విధాన్.. ఏక్ ప్రధాన్' అనే మహోన్నత సంకల్పంతో అఖండ భారత సాధన కోసం జీవితాంతం కృషి చేసిన భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో జియో టెక్నికల్ రిపోర్టులు, ఇతర సాంకేతిక పరీక్షల ద్వారా డ్యాం సేఫ్టీ చర్యల్లేవని 'నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్డీఎస్ఏ)' స్పష్టం చేసినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు రిపేర్ పనులు ప్రారంభించకపోవడం వారి ఘోర నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను ఒక 'ఏటీఎం'లా మార్చుకుని, కేవలం డబ్బు, అహంకారంతోనే తరతరాలుగా రాజకీయం చేయొచ్చని భావించిందని విమర్శించారు. ఇప్పుడు అధికారంలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన భారీ అవినీతిని పూర్తిగా మర్చిపోయారని, అక్కడ జరిగిన అవినీతిపై ఎలాంటి కఠిన చర్యలు లేకుండా, కేవలం కొందరు అధికారులపై నామమాత్రంగా చర్యలు తీసుకొని చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం అవినీతిపై రేవంత్ రెడ్డి ఉన్న ఈ హఠాత్తు 'మమకారం' వెనుక రహస్యం ఏంటో ప్రజలకు సమాధానం చెప్పాలని, ఇరు పార్టీలు కలిసి నాటకాలు ఆడుతూ ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని ఆరోపించారు. మరోవైపు హైదరాబాద్ నగరంలో 'హైడ్రా' వ్యవహరిస్తున్న తీరుపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలో హైడ్రా పేరుతో పేదవాళ్ల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూలగొడుతున్న ప్రభుత్వం.. ఎంఐఎం పార్టీకి సంబంధించిన అక్రమ కట్టడాల జోలికి ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. ఎంఐఎంకు సంబంధించిన 'ఫాతిమా విద్యాసంస్థల విషయంలో స్పష్టంగా నిబంధనలను ఉల్లంఘించిందని, అదేవిధంగా స్వయంగా విద్యాశాఖ కూడా అనుమతులే లేవని కోర్టుకు తెలపడాన్ని ఆయన గుర్తుచేశారు. హైడ్రా అనేది నిష్పక్షపాతంగా పనిచేయాలని, పేదవాళ్లకు ఒక న్యాయం, ఎంఐఎంకు ఒక న్యాయం ఉండటానికి వీల్లేదని స్పష్టం చేశారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం ఎంఐఎంకు చెందిన అక్రమ ఇన్‌స్టిట్యూషన్స్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్, ఎంఐఎం, హైడ్రా పక్షపాత వైఖరిపై భారతీయ జనతా పార్టీ పెద్ద ఎత్తున ప్రజా పోరాటం చేస్తుందని రాంచందర్ రావు హెచ్చరించారు.

## ఖమ్మంలో అధ్వాన్నంగా పారిశుధ్యం

- మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్



**ఖమ్మం, జూలై6 (జనంసాక్షి) :** పారిశుధ్య నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆరోపించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం తక్షణమే సమగ్ర ప్రణాళిక రూపొందించి పారిశుధ్య సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వర్షాకాలం దృష్ట్యా ఖమ్మం జిల్లాను పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉంచేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సూచించారు. పారిశుధ్యం లోపించడం అపరిశుభ్రత కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రతిచోటా చెత్త పేరుకుపోవడం, మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడంతో దుర్భర పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తంచేశారు.

# మత్స్య అభివృద్ధి పథకాలతో మత్స్యకారులకు మేలు

- కలెక్టర్ గరిమా అగర్వాల్ వెల్లడి

**రాజన్నసిరిసిల్ల, జూలై6 (జనంసాక్షి) :** ప్రభుత్వం అమలు చేస్తున్న మత్స్య అభివృద్ధి పథకాలు గ్రామీణ మత్స్యకారుల జీవనోపాధిని బలోపేతం చేస్తున్నాయని, చేపల ఉత్పత్తి పెరగడంతో వారి ఆదాయం గణనీయంగా పెరుగుతోందని రాజన్నసిరిసిల్ల కలెక్టర్ గరిమా అగర్వాల్ తెలిపారు. ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు, కేంద్ర ప్రభుత్వ అధికారులు, జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు కమిటీ సభ్యులు సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్‌తో సమావేశమై జిల్లాలో అమలవుతున్న మత్స్య అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. సహకార సంఘాలకు అందిస్తున్న ఆర్థిక సహాయం, చేప పిల్లల ఉత్పత్తి, మార్కెటింగ్, మత్స్యకారుల సంక్షేమానికి చేపడుతున్న చర్యలను కలెక్టర్ బృందానికి వివరించారు. అనంతరం బృందం బోయినపల్లి మండలంలోని నర్సింగాపూర్ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించి ఉత్పత్తి విధానం, నిర్వహణ, ఆదాయ వనరులు, ప్రభుత్వ సహకారంపై క్షేత్రస్థాయిలో పరిశీలించింది. చేపల ఉత్పత్తి పెంపుతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడంతో పాటు మత్స్యకార కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని అధికారులు వివరించారు. ఈ పర్యటనలో వరల్డ్ బ్యాంక్ ప్రతినిధులు జూలియన్ మిలియన్, అనుజా శుక్లా, ఆర్పీ సిలార్డ్, ఇంతిసార్ ఎ. సిద్దిఖీ, దీపా సుమన్, జిల్లా మత్స్య శాఖ అధికారి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

# నీతి అయోగ్‌లోని అంశాలపై పురోగతి సాధించాలి

- జిల్లా కలెక్టర్ కె.హరిత



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జులై 06(జనంసాక్షి) :** నీతి అయోగ్ లో భాగంగా ఆకాంక్షిత జిల్లా, ఆకాంక్షిత తిర్యాని బ్లాక్ లో నిర్దేశించిన అంశాలపై పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టర్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నీతి అయోగ్ లో భాగంగా ఆకాంక్షిత జిల్లా, ఆకాంక్షిత తిర్యాని బ్లాక్ లో నిర్దేశించిన అంశాలను క్షేత్రస్థాయిలో పూర్తిచేసి పనులలో పురోగతి సాధించాలని తెలిపారు. గర్భిణీలు, చిన్నపిల్లల ఆరోగ్యం పై దృష్టి సారించాలని, ప్రతినెల అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్సలు అందించాలని తెలిపారు. క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి ప్రతి నెల కిట్లను అందించి వ్యాధి నయం అయ్యేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. బరువు తక్కువగా పుట్టిన పిల్లలను గుర్తించి వైద్య సేవలు అందించాలని, మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాలలోని పిల్లలకు క్రమం తప్పకుండా శ్యామ్ మామ్ కార్యక్రమాలు నిర్వహించి బరువు, ఎత్తు తక్కువగా ఉన్న పిల్లలతో పాటు మానసిక ఎదుగుదల లేని పిల్లలకు పోషకాహారాలు అందించాలని తెలిపారు.. ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని, పాఠశాలలలో బాలికల కోసం ప్రత్యేక మూత్రశాలల నిర్మాణాలు, త్రాగునీరు, విద్యుత్ పనులు చేపట్టాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని, పశువులకు నిర్ణీత గడువులోగా టీకాలు అందించాలని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు రుణ సదుపాయం కల్పించి వారు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రోత్సహించాలని తెలిపారు. మారుమూల గ్రామాలలో రహదారి అనుసంధానం, త్రాగునీరు, ఇంటర్నెట్ సౌకర్యాల కల్పనపై అధికారులు దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, నీతి అయోగ్ జిల్లా సమన్వయకర్త బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఈఎస్ఐ ఆస్పత్రి త్వరితగతిన నిర్మించాలి

- కలెక్టర్‌ను కోరిన ఐక్యవేదిక ప్రతినిధులు

**కరీంనగర్, జూలై 6 (జనంసాక్షి) :** రామగుండం నియోజక వర్గానికి మంజూరైన ఈఎస్ఐ ఆస్పత్రి త్వరితగతిన నిర్మించాలని స్వచ్ఛంద సంఘాల ఐక్య వేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. వేదిక ప్రతినిధులు మద్దెల దినేష్, గోలివాడ చంద్రకళ, దుర్గం నగేష్ మాట్లాడుతూ ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆస్పత్రి స్థల సేకరణ, నిర్మాణంలో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. దీంతో అసంఘటిత కార్మికులు వైద్య సేవలకు నోచుకోవడం లేదని మండిపడ్డారు. వంద పడకల ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం రూ.వంద కోట్లు నిధులు మంజూరు చేసినా జిల్లా అధికారుల నిర్లక్ష్యంతో అడుగు ముందుకు పడటం లేదన్నారు. పారిశ్రామిక ప్రాంత ప్రగతికి కార్మికుల ఆరోగ్య భద్రత అత్యంత కీలకమనీ, ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణం జరిగితే వేలాది మంది కార్మికులు, వారి కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. తక్షణమే రామగుండంలో వంద పడకల ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి పునాది వేయాలని కలెక్టర్‌ను కోరారు.

## గురుకులాల్లో నాణ్యమైన భోజనం కరువు

- ఎమ్మెల్యే కోవ లక్ష్మ విమర్శలు



**ఆసిఫాబాద్, జూలై6 (జనంసాక్షి) :** కేసీఆర్ ప్రారంభించిన గురుకులాల్లో గిరిజన విద్యార్థులకు నాణ్యమైన అందించారని ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు కోవ లక్ష్మి అన్నారు. వాటిని ఇప్పుడు అధ్వాన్నంగా మార్చారని అన్నారు. నాణ్యమైన భోజనం కూడా పెట్టడం లేదన్నారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం బుసిమెట్టలోని గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలో కంపౌండ్ వాల్ నిర్మాణానికి భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన బిడ్డల చదువుకు , భద్రతకు నాటి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. కంపౌండ్ వాల్ నిర్మాణం పనులు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జైనూర్ మండల మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమేత విశ్వనాథ్, ఫాక్స్ చైర్మన్ కొడప హన్ను పటేల్, జైనూర్ సర్పంచ్ కొడప ప్రకాష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఇంతియాజులాల, అధికారులు పాల్గొన్నారు.

## చెట్టు నరికిన వారికి జరిమానా

**నిజామాబాద్, జూలై6 (జనంసాక్షి) :** హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు చెట్లుగా ఎదిగాయి. అయితే కొందరు వ్యక్తులు విద్యుత్ తీగలకు అడ్డుగా వస్తున్నాయని కారణంతో మరికొందరు చెత్తను వారికి చేనుకు కంచె వేసుకుంటున్నారు. ఈ క్రమంలో పెరిగిన చెట్లు నరికి కంచవేశారు.. విషయం తెలుసుకున్న పందిమడుగు గ్రామపంచాయతీ కార్యదర్శి మహేష్ స్పందించి చెట్లు నరికిన ఒకరికి రూ.2వేలు, మరొకరికి రూ.1000 జరిమానా విధించారు. ఎవరైనా రోడ్డుకు ఇరువైపుల నాటిన చెట్లను నరికితే వారిపై కేసులు నమోదు చేయించి చర్యలు తీసుకుంటామని కార్యదర్శి, సర్పంచ్ గోవింద్ తెలిపారు.

# పేదల జోలికొచ్చిన ఏ ప్రభుత్వమూ బతికి బట్టకట్టలేదు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** పేదల జోలికి వస్తే ఏ ప్రభుత్వం బతికి బట్టకట్టదని, పాలకులు మారినా పేదల బతుకులు మారడం లేదని, కేవలం రేషన్ కార్డులు, పెన్షన్లు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విరుచుక పడ్డారు. పోలీసు యంత్రాంగం, బుల్డోజర్లు చేతిలో ఉన్నాయని పేదల గుడిసెలను నిర్దాక్షిణ్యంగా కూలుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ప్రతి పేదవాడికి ఇళ్లు ఇవ్వాలనే నినాదం తో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో సోమవారం ఇందిరాపార్కు వద్ద మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో వెలుగుమట్ల, హనుమకొండలోని గుండ్ల సింగారం, గోపాలపురం, మహబూబాబాద్, యాదాద్రి జిల్లా కొలనుపాక, చేవెళ్ల, అబ్దుల్లాపూర్ అశ్వారావుపేట వంటి ప్రాంతాల్లో వరుసగా జరిగిన కూల్చివేతలను తీవ్రంగా ఖండించారు. భూదాన్ భూములు, ప్రభుత్వ భూములను ల్యాండ్ మాఫియా దొంగల్లా దోచుకుంటుంటే ప్రభుత్వం చోద్యం చూస్తోందని, మరో వైపు నోరు లేని మూగజీవాల్లాంటి పేదలు తలదాచుకోవడానికి గుడిసె వేసుకుంటే మాత్రం కూల్చేస్తున్నారు. ప్రభుత్వానికి అంతగా సమర్థత ఉంటే, ల్యాండ్ మాఫియా దగ్గర నుంచి ఎన్ని వేల ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నారో శ్వేతపత్రం' విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హైడ్రా' పేరుతో పేదలను ఇబ్బందులకు గురిచేయవద్దని, కబ్జాకోరులను జైల్లో పెట్టడితే తాము స్వాగతిస్తామన్నారు. కమ్యూనిస్టులుగా పోరాటం చేస్తే డిమాండ్లను అమలు చేస్తామని ఖమ్మం సభలో ముఖ్యమంత్రి రేవంత్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా గుడిసెల్లో నివసిస్తున్న పేదలకు పట్టాలు ఇవ్వకుండా, వారి నివాసాలను కూల్చివేయడం అన్యాయమని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. గత ప్రభుత్వం 'బంగారు తెలంగాణ' పేరుతో ప్రజలను మోసం చేసిందని, ప్రస్తుతం 'ఇందిరమ్మ రాజ్యం', 'ప్రజా ప్రభుత్వం' పేరుతో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే విధానాన్ని కొనసాగిస్తోందని విమర్శించారు. రెండున్నరేళ్లుగా వామపక్ష పార్టీలు శాసనసభలో, ప్రజా ఉద్యమాల ద్వారా ఇంటి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించలేదన్నారు. భూదాన్ భూములు, కోర్టు కేసులు వంటి కారణాలు చూపుతూ కాలయాపన చేస్తూనే, మరోవైపు గుడిసెల కూల్చివేతలు చేపడుతోందని ఆరోపించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 80 ఏళ్లు గడిచినా పేదలకు కనీసం నివాస స్థలం కల్పించలేకపోవడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యమని అన్నారు. ఈకార్యక్రమంలో పశ్య పద్మ, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు, ఈ.టి.నరసింహా, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.డి.అబ్బాస్, వామపక్షాల నాయకులు వనం సుధాకర్ , కె.గోవర్ధన్ , సదానంద్ , భరత్, మూడ్?గణేష్, సాధినేని వెంకటేశ్వర్లు, జ్యోతి ప్రసంగించారు.

### కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి : సీపీఎం కార్యదర్శి జాన్ వెస్లీ

రాష్ట్రంలో ఇళ్లులేని పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఆ హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 30 లక్షల మంది పేదలకు సొంత ఇళ్లు లేవని, హైదరాబాద్ 60 శాతం మంది అద్దె ఇళ్లలోనే జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం గుడిసెల కూల్చివేతలను వెంటనే నిలిపివేయాలని, పేదలను రోడ్డున పడేయవద్దన్నారు. గుడిసెల కూల్చివేతలు కొనసాగితే బుల్డోజర్లకు ఎదురొడ్డి ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. ప్రధాని మోడీ, సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వాలు పేదల ఇళ్ల సమస్యను పరిష్కరించడంలో విఫలమయ్యాయని విమర్శించారు. పేదలు, శ్రామికవర్గం ఐక్యంగా పోరాడి తమ హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు.

# మొద్దుబారిన రాజకీయ అస్త్రం

సంపాదకీయం

అయోధ్య రామ మందిర నిర్మాణం కేవలం ఒక కట్టడం కాదు, భారత రాజకీయాల దిశనే మార్చిన ఒక అధ్యాయం. దశాబ్దాల రాజకీయ అస్త్రం.. ప్రజల మధ్య విభజన రేఖ, న్యాయస్థానాల తీర్పులు, రాజకీయ సమీకరణాలు అన్నీ కలిసి 2024లో రామమందిర ప్రారంభోత్సవం జరిగినప్పుడు, దేశవ్యాప్తంగా భాజపా దాన్ని తన అతిపెద్ద రాజకీయ విజయంగా ప్రచారం చేసుకుంది. హిందూ మతభావాలను ఒక పార్టీకి అనుకూలంగా మలుచుకోవడంలో భాజపా చూపిన నైపుణ్యం అసాధారణమైనది. కానీ ఇప్పుడు అదే మందిర ధర్మకర్త మండలిలో వెలుగు చూసిన కుంభకోణం, ఆ కథనాన్ని పూర్తిగా తారుమారు చేసే అవకాశాన్ని ప్రతిపక్షాలకు ఇచ్చింది.


శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టులో చందా వసూళ్లలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు జూన్ 2026లో బయటకు వచ్చాయి. కోట్ల రూపాయల విరాళాలు, బంగారం, వెండి ఆభరణాలు తప్పిపోయాయని, నగదు లెక్కింపు జరిగే ప్రాంతంలో నెలల తరబడి సీసీటీవీ ఫుటేజీ తొలగించారని ఆరోపణలు వచ్చాయి. దీనిపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటైంది, ఎఫ్ఐఆర్ నమోదైంది, ఎనిమిది మంది అరెస్టయ్యారు, ధర్మకర్త మండలి ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్‌తో సహా పలువురు కీలక వ్యక్తులు రాజీనామాలు చేశారు. నియామకాల్లో కమిషన్లు తీసుకున్నారన్న ఆరోపణలు కూడా తెరపైకి వచ్చాయి. ఇంత తీవ్రమైన, స్పష్టమైన ఆధారాలున్న వ్యవహారం దేశ రాజకీయాల్లో పెద్ద కుదుపు తేవాల్సింది. కానీ ఆసక్తికరంగా, ఈ వివాదాన్ని మొదట బయటపెట్టి, రాజకీయంగా అత్యంత దూకుడుగా ముందుకు తీసుకెళ్లింది కాంగ్రెస్ కాదు, సమాజ్‌వాదీ పార్టీ. అఖిలేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే పవన్ పాండే వంటి నేతలు ఈ అంశాన్ని పార్లమెంటు స్థాయిలో, వీధి స్థాయిలో నిలదీశారు. దేశవ్యాప్తంగా అతిపెద్ద ప్రతిపక్ష పార్టీగా ఉన్న కాంగ్రెస్, ఈ అంశంపై ఒక స్పష్టమైన, నిరంతర, జాతీయ స్థాయి ప్రచార వ్యూహాన్ని రూపొందించలేకపోయింది. రాహుల్ గాంధీ నేతృత్వంలోని పార్టీ అడపాదడపా ప్రకటనలు చేసినా, దాన్ని ఒక సమన్వయ ఉద్యమంగా, భాజపా విశ్వసనీయతను ప్రశ్నించే ఆయుధంగా మలచడంలో విఫలమైంది. ఇది కాంగ్రెస్ రాజకీయ వ్యూహంలో ఉన్న లోతైన బలహీనతను బయటపెడుతుంది. హిందూ మతభావాలకు సంబంధించిన అంశాలను ముట్టుకోవడానికి పార్టీ ఇప్పటికీ సందిగ్ధంలో ఉంది. మృదు హిందుత్వ, లౌకికవాదం మధ్య ఊగిసలాడుతూ, స్పష్టమైన వైఖరిని తీసుకోలేకపోతోంది. రామమందిరం అనే అంశాన్ని ముట్టుకుంటే మెజారిటీ ఓటర్లకు దూరమవుతామన్న భయం ఒకవైపు, అవినీతిని ఎండగట్టకపోతే పార్టీ నిబద్ధతపైనే ప్రశ్నలు తలెత్తుతాయన్న ఆందోళన మరోవైపు కాంగ్రెస్‌ను నిర్ణయరాహిత్యంలో ఉంచాయి. ఫలితంగా, దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన ఈ కుంభకోణం, స్థానిక ఉత్తరప్రదేశ్ రాజకీయాలకే పరిమితమైపోయింది.

ఇది కేవలం ఒక అవకాశాన్ని కోల్పోవడం మాత్రమే కాదు. అధికార పార్టీ మతపరమైన సంస్థలను రాజకీయ మూలధనంగా వాడుకున్నప్పుడు, అదే సంస్థల్లో అవినీతి బయటపడితే జవాబుదారీతనాన్ని నిలదీయాల్సిన బాధ్యత ప్రధాన ప్రతిపక్షంపై ఉంటుంది. ఆ బాధ్యతను సమర్థంగా నిర్వహించలేకపోవడం, కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్త రాజకీయ కథనాన్ని నిర్మించే సామర్థ్యంపైనే సందేహాలు రేకెత్తిస్తుంది. ప్రాంతీయ పార్టీలు స్థానిక సమస్యలను బలంగా లేవనెత్తగలుగుతున్నప్పుడు, జాతీయ పార్టీగా చెప్పుకునే కాంగ్రెస్ ఇలాంటి కీలక ఘట్టాల్లో వెనుకబడిపోవడం, రానున్న ఎన్నికల్లో దాని రాజకీయ భవిష్యత్తుపై నీలినీడలు వేస్తుంది. అయితే, ఈ వ్యవహారం ఇంకా కొనసాగుతోంది. దర్యాప్తు తుది నివేదిక, న్యాయస్థాన విచారణ ఫలితాలు ముందుముందు వెలువడనున్నాయి. కాంగ్రెస్‌కు ఇప్పటికీ ఈ అంశాన్ని సమర్థంగా ప్రజల్లోకి తీసుకెళ్లే అవకాశం లేకపోలేదు. కానీ రాజకీయాల్లో సమయమే అత్యంత విలువైనది. సరైన సమయంలో స్పందించలేకపోతే, ఎంత బలమైన ఆయుధమైనా మొద్దుబారిపోతుంది.

# విరసం సభా హక్కుపై రేవంత్ ఫాసిస్టు నిర్బంధం

*రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏడవ గ్యారెంటీగా ప్రజాస్వామిక హక్కుల పునరుద్ధరణ హామీ ఇచ్చాడు. కానీ 56 ఏండ్ల విప్లవ రచయితల సంఘం తన ఆవిర్భావ దినం సందర్భంగా 5 జులై 2026న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సభ నిర్వహణకు ప్రయత్నిస్తే చివరి నిమిషంలో సభను రద్దు చేసే విధంగా నిర్బంధాన్ని అమలు పరచిన ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వానికే దక్కింది. ఇప్పుడు మేధావులు, ప్రజాస్వామిక వాదులు తెలంగాణ వచ్చిన తరువాత గత పదేళ్ళ పాలనలో బిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన నిర్బంధాన్ని చూసి దానికి ప్రత్యామ్నాయంగా తాను ప్రజాస్వామ్య రాజ్యాంగ పద్ధతిలో పరిపాలన కొనసాగిస్తానని రాహుల్ గాంధీతో పాటు రేవంత్ రెడ్డి కూడా ప్రజల ముందు అనేకసార్లు వాగ్దానం చేశాడు.ఆ కాలంలోనే 16 ప్రజా సంఘాలను నిషేధానికి గురిచేశాయి. ఆ నిషేదాన్ని ఛాలెంజ్ చేస్తూ న్యాయస్థానంలో పోరాటానికి సిద్ధమైన స్థితిలో కెసిఆర్ ప్రభుత్వమే నిషేదాన్ని ఎత్తి వేసింది.*

ఆ విధంగా గత ప్రభుత్వం తన పద్ధతిని సరిచేసుకుంది. కాని ఆర్టికల్ 19 ప్రకారం భావ ప్రకటన స్వేచ్ఛా హక్కు ఆర్టికల్ 21 జీవించే హక్కు ఏ విధంగా అణచివేయబడుతున్నాయో మన ముందర గత వారం రోజులుగా కనిపిస్తూ ఉంది. రాజ్యాంగం ప్రజాస్వామ్యం పాలకుల చేతుల్లో ఊత పదాలుగా మారిపోయాయి. కేవలం రాజకీయ నాయకులకు పెట్టుబడిదారులకు పోలీసులకు మాత్రమే రాజ్యాంగం హక్కులు అందుతున్నాయి. మిగతా ఏ ప్రజలకు కూడా రాజ్యాంగంలో పేర్కొన్న ప్రాథమిక హక్కులు ఏవీ కూడా అమలు కావడం లేదు. గత రెండేళ్ళుగా మధ్యభారతంలో ఆపరేషన్ కగార్ పేరుతో మన తెలంగాణ రాష్ట్రానికి చెందిన అనేక మంది ఉద్యమ నాయకులను కాల్చి చంపి ఎన్‌కౌంటర్‌గా ప్రకటిస్తుంటే వాటికి వ్యతిరేకంగా పౌరహక్కుల సంఘం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మహేశ్ కుమార్ గౌడ్, చత్తీస్‌ఘడ్ రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు కూడా పాల్గొని ఆపరేషన్ కగార్ హత్యాకాండను ఖండించిన సందర్భాలున్నాయి. కానీ ఆ ఆపరేషన్ కగార్‌లో భాగంగానే కరకు గూడెం, చల్పాకలో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్‌లో 14మందిని చంపిన ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వానికే దక్కింది. ఇక్కడ ఉన్న మేధావులు న్యాయమూర్తులు అందరు కూడా శాంతి చర్చల ప్రక్రియ కొనసాగి జీవించే హక్కును కాపాడుదామనే ప్రయత్నాన్ని కూడా రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్వీకరించలేకపోయింది. ఏదో ఒక మేరకు ఆపరేషన్ కగార్ హత్యాకాండకు వ్యతిరేకంగా 50 ప్రజాసంఘాలతో ఆవిర్భవించిన ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక చిన్న చిన్న మీటింగులకు అనుమతి ఇవ్వగలిగిందే కాని గత ఏడాది వరంగల్‌లో నిర్వహించ తలపెట్టిన ఆదివాసీ హక్కుల సంఘీభావ వేదిక సభకు కాంగ్రెస్ పార్టీ నాయకులే వక్తలుగా ఉన్నప్పటికీ, శాంతి భద్రతల సమస్య రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనిది అయినప్పటికి కేంద్ర ప్రభుత్వం ఒత్తిడితో రేవంత్ రెడ్డి ప్రభుత్వం సభ నిర్వహణకు అనుమతి ఇవ్వలేదు. ఒకవైపు కగార్ హత్యాకాండ కొనసాగిస్తూండగా మరొకవైపు లొంగుబాటు ప్రక్రియను కొనసాగించారు. అందులో భాగంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి డిజిపి శివధర్ రెడ్డి ఎస్ఐబి చీఫ్ సమక్షంలో లొంగుబాట్లను చాలా గొప్పగా కొనసాగించారు. కాని అదే స్థాయిలో జరుగుతున్న ప్రాథమిక హక్కుల ఉల్లంఘనలో భాగంగా జీవించే హక్కును రద్దు చేస్తున్న ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా ఎవరు మాట్లాడలేకపోయారు. అయినప్పటికి తెలంగాణలో ఉన్న బుద్ధిజీవులు, ప్రజాస్వామిక వాదులు ఆదివాసి మంత్రి అయిన సీతక్కతో పాటు వరంగల్‌కు చెందిన రాష్ట్ర మంత్రుల అందరి దగ్గరికి ఒక ప్రజాస్వామిక పాలన కోసం నిర్బంధానికి వ్యతిరేకంగా మాట్లాడాలని కలిసారు. కాని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కగార్ అణచివేత పట్ల మౌనాన్ని ఆచరించింది. ఇది ఒకవైపు కొనసాగి ఒక ఉద్యమ పార్టీ లేని స్థితిని ఇప్పుడు ప్రజలకు ఏర్పడింది. ఏ కమ్యూనిస్టు పార్టీ అయినా ప్రజల మౌళిక సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేస్తాయి. ఆ ఉద్యమాల అణచివేత లోంచే ఉద్యమ ఆచరణ కూడా రూపాంతరం చెందుతుంది. అందులో భాగంగానే కొన్ని ఉద్యమాలు సాయుధ రూపం తీసుకున్న విషయం మనందరికి తెలుసు. ఆ రూపం తీసుకున్నందుకు ప్రభుత్వాలు నిషేదం ప్రకటించి నిర్బంధాన్ని తీవ్ర స్థాయిలో అమలు చేసి ఇప్పటికి కనీసం 20 వేలకు పైగా ఎన్‌కౌంటర్ హత్యాకాండకు అవకాశం కల్పించారు పాలకులు. కాని హక్కుల సంఘాల పేర్కొన్నట్లుగా 1996 పేసా యాక్టు, 2006 అటవీ హక్కుల చట్టం, 1/70 యాక్టు, అమలైనట్లయితే ఆదివాసీలకు న్యాయం జరిగేది. ఆదివాసి ఉద్యమాలు ఇంత బలంగా కొనసాగేవి కాదు. ఈ నేపథ్యంలోంచే విప్లవ రచయితల సంఘం 56 ఏండ్లుగా తన సాహిత్యాన్ని పోరాడుతున్న ప్రజల నేపథ్యంలోంచి తీసుకువచ్చి ప్రజలకు అందించే ప్రయత్నం చేస్తున్నారు. అందులో భాగంగానే 2014లో వచ్చిన మోడీ ప్రభుత్వం గత 12 ఏళ్ళుగా తీవ్ర అణచివేతను కొనసాగిస్తూ, ఫాసిజాన్ని కొనసాగిస్తున్నాయి. వీరి సభలో ఫాసిజం ప్రత్యేకతల అంశంతో ఏ విధంగా ఫాసిజం అమలవుతున్నది. అణచివేత ఎలా ప్రాథమిక హక్కులు రద్దు అవుతాయని ప్రజల తెలియజెప్పాల్సిన తమ బాధ్యతను నిర్వర్తించడానికి ప్రయత్నం చేశాయి. కాని మోడీ రేవంత్ రెడ్డి ప్రభుత్వాలు ఆ సభలో వక్తలు ఏ విధంగా మాట్లాడుతారో అనే అంశాన్ని పట్టించుకోకుండా తన 56 ఏళ్ల విరసం చరిత్రలో నిర్వహించ తలపెట్టిన సభను అర్ధాంతరంగా ఆపివేసారు. ఇది వారు ఏదైతే ఫాసిజం అణచివేత గురించి మాట్లాడనుకున్నారో అదే ఫాసిజం అణచివేతలో వారి సభ రద్దు అయినట్లుగా ప్రజలు భావిస్తున్నారు. 2015లో శేషాచలం ఎర్రచెందనం 22 మంది కూలీలను అతి క్రూరంగా చంపి ఎన్‌కౌంటర్‌గా ప్రకటించింది. నల్గొండ ఆలేరులో వరంగల్ నుండి న్యాయస్థానంకు తీసుకువస్తున్న 5గురు ముస్లిం ఖైదీలను వ్యాను లోనేకాల్చి ఎన్‌కౌంటర్‌గా ప్రకటించారు. 2019లో దిశా హత్యాచార నిందితులను కేస్ రీ కన్‌స్ట్రక్షన్ పేరుతో ఎన్‌కౌంటర్ పేరుతో చంపేసారు. ఇటువంటి నిర్బంధ కాండను తెలంగాణ ప్రభుత్వం అనుభవిస్తున్నది. 1200 మంది అమరుల త్యాగంతో సాధించుకున్న తెలంగాణలో అణచివేత హత్యాకాండలు పాలకుల పాలనలుగా ప్రజలకు ఇబ్బంది పెడుతున్నాయి. మహిళా జర్నలిస్టులపై జరుగుతున్న మతోన్మాద ట్రోలింగ్‌లతో మహిళా జర్నలిస్టులు అతి కష్టంగా పనిచేయగలుగుతున్నారు. విద్యార్థి సంఘాలు కార్మిక సంఘాలు మహిళా సంఘాలు ఎటువంటి ఉద్యమ పోరాట రూపం తీసుకున్నా తీవ్రమైన అణివేతకు గురి చేస్తున్నారు. అణచివేతకు అలవాటుపడిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం మోడీతో కలిసి తెలంగాణలో ప్రజాస్వామిక గొంతు లేకుండా చేయడం కోసం ప్రశ్నారావన్‌ని, కెవిఆర్‌ను ఏ విధంగా అరెస్టు చేసారో మనం చూస్తున్నాం. అఖిల భారత స్థాయిలో ప్రశ్నించే గొంతుక ఉండకూడదని భీమా కొరెగావ్ ఉపా కుట్ర కేసులో అఖిల భారత స్థాయిలో ప్రజామేధువలందరిని ఏళ్ళకు ఏళ్ళుగా బెయిల్ రానీయకుండా జైళ్ళో నిర్బంధించారు. 84 ఏళ్ళ ఫాదర్ స్టాన్ సామి లాంటి వాళ్ళు ఆదివాసులకు మద్దతు తెలుపుతున్నారని ఆదివాసీ చట్టాల అమలు కోసం న్యాయస్థానంలో పోరాడుతున్నారని అత్యంత అమానవీయంగా వ్యవస్థీకృత హత్యకు గురి చేశారు. ఇటువంటి నిర్బంధ స్థితిని తెలంగాణ ప్రజానీకం నిరంతరం ప్రశ్నిస్తూనే ఉంది. ఈ నిర్బంధ అణచివేతను రాహులు ఖర్గెల దృష్టికి కూడా తీసుకువెళ్ళగలిగింది. కానీ నేడు సభ హక్కు రద్దు చేయడమంటేనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం తను ప్రకటించిన హక్కుల పునరుద్ధరణలో సభ అదుపు తానే రద్దు చేసినట్లు మనకర్థమవుతుంది. రాజ్యాంగాన్ని అమలుపరచాల్సిన పాలకులు నిర్బంధాన్ని అమలు చేస్తే ప్రజలు ఏం చేయాలో ఆలోచించుకోవాలి.





ఎన్. నారాయణ రావు
ప్రధాన కార్యదర్శి
పౌరహక్కుల సంఘం

## వాళ్ళు ఎవరు?

దేశంలో ఎక్కడైనా
'వాళ్ళ'తో పొత్తు
మీపార్టీ చిత్తు!
రేపు ఏ.పి సంగతి?
జైశ్రీరామ్!అంతే!
'వాళ్ల'గొప్ప కాదు
మీ డొప్ప కాదు!

వేల యేండ్ల గా
జనంలో బానిసత్వం!
ఇదీ అసలు కారణం!
ఇది'వాళ్ళ'కెంతోఘనం!
సామ్రాజ్యాల వరకు
వలసపాలన నుండి
ప్రజాస్వామ్యంవరకు
పునాదికదిలించలేదు!
జనం అజ్ఞానంలోనే!

'వాళ్ల 'ప్రాభవాన్ని
వెతుక్కున్నారు!
అందరూ ఒకే మచ్చు!
దోచుకు తినటం!
అమానుషహింసలతో
జనాన్నిచీల్చి చీల్చి
పిపీలికాదిరేణువులుగా
బుగ్గిచేసి ఊదేశారు!
నేటికీ దిక్కులేని జనం!

ఎంతటి దురదృష్టం!
ప్రతిపక్షాలు కూడా
ఎప్పటికప్పుడుఅనైక్యం!
వీళ్ళకే దిక్కులేదు!
జనాన్నేంకలుపుతారు!
ఈ లోపాలన్నీ
తెలిసిన'వాళ్ళే'వాళ్లు'!
బూర్జువాపార్టీలకు
తెలిసినా పట్టదు

వారికి జేబులుముఖ్యం!
ఇదీ నా దేశం!
ఇదీ నా ప్రజలు!
ఇదీ నాయకులు!
ఇదీ ప్రతిపక్షం!
ఇంతకీ'వాళ్లు'ఎవరు?

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

## రెండు కళ్లు



హిమ శిఖరం
మహోన్నత సముద్రం
సరి పోలవు
సత్యవచనం
ప్రపంచాన్ని గెల్చింది
నోటుపై బొమ్మ

ప్రజా పాలన
బడుగుల సంజీవి
రాజ్యాంగ కర్త

రేడియమ్
ఫో.నం.9291527757

# తెలంగాణ రైతన్న ఆరుతడి పంటల వైపు మళ్లాలి!

తెలంగాణ వ్యవసాయ రంగం ప్రస్తుతం ఒక కీలకమైన మలుపు వద్ద నిలిచింది. ఒకప్పుడు చెరువులు, వాగులు, బావులు, వర్షాధార వ్యవసాయం ఆధారంగా సాగిన వైవిధ్యమైన పంటల చరిత్ర నేడు పూర్తిగా మారిపోయింది. గత రెండు దశాబ్దాల్లో వరి సాగు విస్తీర్ణం విపరీతంగా పెరగడంతో రైతుల ఆలోచనా విధానం కూడా ఒకే పంట చుట్టూ తిరిగే పరిస్థితి ఏర్పడింది. అయితే ప్రకృతి ఎప్పుడూ ఒకే విధంగా ఉండదు. వాతావరణ మార్పులు, తగ్గుతున్న వర్షపాతం, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, భూగర్భ జలాల క్షీణత వంటి సవాళ్లు తెలంగాణ వ్యవసాయాన్ని కొత్త మార్గాల వైపు నడిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆరుతడి పంటల సాగు వైపు మళ్లించాలని సూచించడం కేవలం ఒక వ్యవసాయ సలహా మాత్రమే కాదు, భవిష్యత్తు తరాల ఆహార భద్రతను కాపాడే వ్యూహాత్మక నిర్ణయంగా చూడాలి. భారతదేశంలో వ్యవసాయం ఇప్పటికీ ప్రధాన జీవనాధారంగా కొనసాగుతోంది. దేశ జనాభాలో సుమారు 45 శాతం మంది ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారు. తెలంగాణలో కూడా లక్షలాది కుటుంబాల జీవనం వ్యవసాయంతో ముడిపడి ఉంది. 2014లో రాష్ట్ర ఏర్పాటు తర్వాత సాగునీటి వసతులు విస్తరించడంతో వరి సాగు గణనీయంగా పెరిగింది. కనీస మద్దతు ధర, ప్రభుత్వ కొనుగోలు వ్యవస్థ, నీటి లభ్యత వంటి కారణాలతో వరి అత్యంత ప్రాధాన్య పంటగా మారింది. కానీ వరి ఒక్కటి అధిక నీటిని అవసరం చేసే పంట. ఒక ఎకరం వరి సాగుకు సగటున లక్షల లీటర్ల నీరు అవసరమవుతుందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. వర్షపాతం తగ్గుతున్న పరిస్థితుల్లో ఈ నీటి వినియోగం భవిష్యత్తులో తీవ్ర సంక్షోభానికి దారితీయవచ్చు.

2026 సంవత్సరానికి సంబంధించిన వాతావరణ అంచనాలు అనేక ప్రాంతాల్లో వర్షపాతం అసమానంగా ఉండే అవకాశాలను సూచిస్తున్నాయి. ఒకవైపు భారీ వర్షాలు, మరోవైపు దీర్ఘకాలిక ఎండలు రైతులకు అనిశ్చితిని కలిగిస్తున్నాయి. గతంలో నాలుగు నెలల పాటు కురిసే వర్షాలు ఇప్పుడు కొద్ది రోజుల్లోనే కురిసి మిగిలిన కాలం పొడి వాతావరణం కొనసాగుతోంది. దీంతో వరి వంటి పంటలకు అవసరమైన నిరంతర నీటి లభ్యత దెబ్బతింటోంది. ఈ నేపథ్యంలో శాస్త్రవేత్తలు నీటి వినియోగం తక్కువగా ఉండే ఆరుతడి పంటల వైపు రైతులు మొగ్గు చూపాలని సూచిస్తున్నారు.

తెలంగాణ చరిత్రను పరిశీలిస్తే ఆరుతడి పంటలే ఈ నేల అసలు స్వభావానికి అనుకూలమని స్పష్టమవుతుంది. కంది, పెసర, మినుము, జొన్న, మొక్కజొన్న, సజ్జ, రాగులు వంటి పంటలు శతాబ్దాలుగా తెలంగాణ గ్రామీణ జీవన విధానంలో భాగంగా ఉన్నాయి. ఇవి రైతులకు ఆదాయం మాత్రమే కాకుండా, ప్రజల ఆహారపు అలవాట్లు, ఆరోగ్యం, పశుసంపద, నేల సారాన్ని కాపాడిన పంటలు. కానీ వరి ప్రాధాన్యత పెరగడంతో ఈ సంప్రదాయ పంటలు క్రమంగా కనుమరుగవుతున్నాయి. ఈ ధోరణిని మార్చాల్సిన సమయం ఆసన్నమైంది.

ఒకే పంటను నిరంతరం సాగు చేయడం వల్ల భూమి సహజ సారం తగ్గుతుందని వ్యవసాయ శాస్త్రం చెబుతోంది. వరుసగా వరి సాగు చేస్తే నేలలోని సూక్ష్మ పోషకాలు క్షీణిస్తాయి. దీంతో ఎరువుల వినియోగం పెరిగి ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది. పప్పుధాన్యాలు నేలలో నత్రజనిని పెంచి తదుపరి పంటలకు అనుకూల వాతావరణం కల్పిస్తాయి. కాబట్టి ఆరుతడి పంటలు రైతుకు మాత్రమే కాదు, నేల ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయి.

ప్రపంచవ్యాప్తంగా ఆహారపు అలవాట్లలో పెద్ద మార్పులు వస్తున్నాయి. చిరుధాన్యాలు ఇప్పుడు ఆరోగ్యకర ఆహారంగా గుర్తింపు పొందుతున్నాయి. మధుమేహం, ఊబకాయం, గుండె జబ్బులు పెరుగుతున్న నేపథ్యంలో జొన్న, సజ్జ, రాగి వంటి ధాన్యాలకు డిమాండ్ పెరుగుతోంది. తెలంగాణ రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అధిక నీటితో తక్కువ లాభం ఇచ్చే వరి కంటే తక్కువ నీటితో అధిక విలువ కలిగిన ఆరుతడి పంటలు భవిష్యత్తులో మరింత లాభదాయకంగా నిలుస్తాయి.




*ఒకప్పుడు పేదల ఆహారంగా భావించిన చిరుధాన్యాలు ఇప్పుడు ఆరోగ్యకరమైన ఆహారంగా గుర్తింపు పొందుతున్నాయి. మధుమేహం, ఊబకాయం, గుండె జబ్బులు పెరుగుతున్న నేపథ్యంలో జొన్న, సజ్జ, రాగి వంటి ధాన్యాలకు దేశీయంగానే కాక అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా మంచి డిమాండ్ ఏర్పడుతోంది. ఈ పరిస్థితిని తెలంగాణ రైతులు ఒక అవకాశంగా మలచుకోవాలి. అధిక నీటితో వరి పండించి తక్కువ లాభం పొందడం కంటే తక్కువ నీటితో అధిక విలువ కలిగిన పంటలను సాగు చేయడం భవిష్యత్తులో మరింత ప్రయోజనకరంగా ఉండవచ్చు.*

రైతులు ఒక్కరోజులోనే వరి నుంచి ప్రత్యామ్నాయ పంటలకు మారలేరు. కనీస మద్దతు ధర, కొనుగోలు వ్యవస్థ, విత్తనాల లభ్యత, రుణ సౌకర్యాలు, బీమా, మార్కెటింగ్ వంటి అంశాలు రైతు నిర్ణయాన్ని ప్రభావితం చేస్తాయి. కాబట్టి ప్రభుత్వం ఆరుతడి పంటలకు కూడా వరితో సమానమైన మార్కెట్ భద్రత కల్పించాలి. మండల స్థాయిలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మధ్యవర్తుల జోక్యం లేకుండా నేరుగా కొనుగోలు చేయాలి.

తెలంగాణలో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ వంటి వర్షాధార ప్రాంతాల్లో వరి సాగును విస్తరించడం కంటే స్థానిక వాతావరణానికి అనుకూలమైన ఆరుతడి పంటలను ప్రోత్సహించడం ఉత్తమం. ఇలా చేస్తే నీటి వినియోగం తగ్గడమే కాకుండా పంట నష్టాల ప్రమాదం కూడా తగ్గుతుంది.


వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, విస్తరణ అధికారులు గ్రామస్థాయిలో నిరంతర శిక్షణలు, నమూనా పొలాలు, ప్రదర్శనలు నిర్వహించాలి. యాంత్రీకరణ, ప్రాసెసింగ్ యూనిట్లు ఆరుతడి పంటలకు అనుగుణంగా అభివృద్ధి చెందాలి. ప్రపంచం వాతావరణ మార్పుల ప్రభావాన్ని తీవ్రంగా అనుభవిస్తున్న ఈ కాలంలో నీటిని ఆదా చేసే, నేలను కాపాడే, రైతు ఆదాయాన్ని వైవిధ్యపరిచే ఆరుతడి పంటలే భవిష్యత్తుకు సరైన మార్గం.

తెలంగాణ రైతన్న చరిత్రలో ప్రతి సంక్షోభాన్ని ధైర్యంగా ఎదుర్కొన్నాడు. వాతావరణ మార్పుల సవాలును కూడా సరైన ప్రణాళిక, శాస్త్రీయ వ్యవసాయం, ప్రభుత్వ సహకారంతో అధిగమించగలడు. వరిని పూర్తిగా వదిలేయాల్సిన అవసరం లేదు. కానీ భూమి స్వభావం, నీటి లభ్యత, మార్కెట్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని పంటల వైవిధ్యాన్ని పెంచుకోవడం అత్యవసరం. ఇదే రైతు ఆర్థిక భద్రతకు, రాష్ట్ర వ్యవసాయ స్థిరత్వానికి, దేశ ఆహార భద్రతకు శాశ్వత మార్గం.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# లిబరేషన్ పరిణామ క్రమం... ప్రజల దారిలో...



భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రను ఒకసారి వెనక్కి తిరిగి చూస్తే, కొన్ని సంఘటనలు కాలాన్ని రెండు భాగాలుగా విడగొడతాయి. అలాంటి మలుపుల్లో నక్సల్బరీ తిరుగుబాటు ఒకటి. అది ఒక గ్రామంలో జరిగిన రైతుల ఘర్షణ మాత్రమే కాదు. దేశమంతా విప్లవం గురించి ఆలోచిస్తున్న వేలాది మంది యువత మనసుల్లో మంట రాజేసిన సంఘటన. భూమి కోసం, గౌరవం కోసం, దోపిడీకి వ్యతిరేకంగా లేచిన పేద రైతు కూడా చరిత్రను మార్చగలడనే నమ్మకాన్ని అది కలిగించింది. అందుకే నక్సల్బరీని కేవలం ఒక పోరాటంగా కాకుండా, భారత కమ్యూనిస్టు ఉద్యమంలో కొత్త అధ్యాయానికి నాందిగా గుర్తిస్తారు.

కానీ ఏ చారిత్రక ఉద్యమాన్నైనా దాని విజయాలతో పాటు దాని పరిమితుల వెలుగులో కూడా చూడాలి. చరిత్రను ఆరాధించడం ఎంత ప్రమాదమో, చరిత్రను పూర్తిగా తిరస్కరించడం కూడా అంతే ప్రమాదం. వినోద్ మిశ్రా రాజకీయ ఆలోచనల్లో పదేపదే కనిపించే విషయం ఇదే. గతాన్ని గౌరవించాలి, కానీ గతంలోనే బంధీ అయిపోవద్దు. త్యాగాలను స్మరించాలి, కానీ తప్పులను కూడా నిజాయితీగా అర్థం చేసుకోవాలి. ఎందుకంటే మార్క్సిజం అంటే అదే, జీవితాన్ని, అనుభవాన్ని, పోరాటాన్ని నిరంతరం పరిశీలిస్తూ ముందుకు సాగే పద్ధతి.

నక్సల్బరీ తర్వాత ఏర్పడిన విప్లవోద్యమం వేలాది మంది యువతను ఆకర్షించింది. ఉద్యోగాలు, చదువులు, కుటుంబ జీవితాలు వదిలి ప్రజల మధ్యకు వెళ్లిన ఆ తరం భారత రాజకీయ చరిత్రలో అరుదైన ఉదాహరణ. వాళ్ల త్యాగం లేకుండా భారత వామపక్ష ఉద్యమ చరిత్రను రాయడం అసాధ్యం. కానీ అదే సమయంలో ఉద్యమం ఎదుర్కొన్న ఎదురుదెబ్బలు కూడా చిన్నవి కావు. తీవ్రమైన నిర్బంధం, అరెస్టులు, ఎన్‌కౌంటర్లు, నాయకత్వ నష్టాలు మాత్రమే కాదు కొన్ని రాజకీయ అవగాహనల పరిమితులు కూడా ఉద్యమాన్ని బలహీనపరిచాయి.

ఈ విషయాన్ని వినోద్ మిశ్రా ఎక్కడా భావోద్వేగంతో కాకుండా, రాజకీయంగా విశ్లేషిస్తారు. ప్రజల మధ్య దీర్ఘకాలిక సంఘటిత పని కంటే కొన్నిసార్లు తక్షణ చర్యలకు ఎక్కువ ప్రాధాన్యం దక్కిందని ఆయన గుర్తిస్తారు. ప్రజలే విప్లవానికి కేంద్రశక్తి అనే మౌలిక సూత్రం ఎప్పుడూ మరువకూడదని ఆయన గుర్తుచేస్తారు. కొద్దిమంది ధైర్యసాహసాలు చరిత్రలో స్ఫూర్తిని కలిగించగలవు. కానీ సమాజాన్ని మార్చేది కోట్లాది ప్రజల సంఘటిత శక్తి మాత్రమే.

అక్కడి నుంచే లిబరేషన్ పార్టీ తన ప్రయాణాన్ని కొత్తగా ఆలోచించడం ప్రారంభించింది. లక్ష్యం మారలేదు. మారింది దాన్ని చేరుకునే మార్గంపై అవగాహన. ప్రజలతో కలిసి నడవకుండా ప్రజల కోసం నడవలేమనే స్పష్టత క్రమంగా బలపడింది. రైతు సమస్య రైతు మధ్యే అర్థమవుతుంది. కార్మికుడి బాధ కర్మాగార గేటు దగ్గరే తెలుస్తుంది. దళితులపై దాడులు, మహిళలపై అణచివేత, నిరుద్యోగ యువత ఆవేదనలన్నీ వేర్వేరు సమస్యలు కాదు. భారత సమాజంలోని దోపిడీ నిర్మాణానికి చెందిన పరస్పర సంబంధిత రూపాలు. వాటితో మమేకం కాని రాజకీయాలు ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోలేవని పార్టీ నిర్ధారణకు వచ్చింది.


అందుకే ప్రజా సంఘాల నిర్మాణానికి కొత్త ప్రాధాన్యం వచ్చింది. రైతు సంఘం, కార్మిక సంఘం, విద్యార్థి ఉద్యమం, మహిళా ఉద్యమం, యువజన సంఘం, సాంస్కృతిక వేదికలు, ఇవి పార్టీకి వెలుపల ఉన్న అనుబంధాలు కాదు. ప్రజలు రాజకీయంగా ఎదిగే పాఠశాలలు. అక్కడే ప్రజలు తమ అనుభవాలను పంచుకుంటారు, తమ శక్తిని గుర్తిస్తారు, సంఘటిత పోరాటం విలువను నేర్చుకుంటారు. విప్లవ రాజకీయాలు ప్రజల జీవితాల్లో వేరు వేయాలంటే ఈ ప్రక్రియ తప్పనిసరి అని లిబరేషన్ పార్టీ భావించింది.

ప్రజా సంఘాల నిర్మాణం గురించి మాట్లాడినప్పుడు వినోద్ మిశ్రా ఒక విషయాన్ని చాలా స్పష్టంగా చెబుతారు. ప్రజలను కేవలం పోరాటానికి పిలవడం సరిపోదు. వాళ్లతో కలిసి జీవించాలి. వాళ్ల కష్టసుఖాల్లో భాగస్వాములు కావాలి. వాళ్ల భాషలో మాట్లాడాలి. వాళ్ల అనుభవాల నుంచే రాజకీయ పాఠాలు నేర్చుకోవాలి. ప్రజల నుంచి నేర్చుకోని పార్టీ, చివరికి ప్రజలకు నేర్పించే హక్కును కూడా కోల్పోతుంది.

అందుకే లిబరేషన్ పార్టీ తన రాజకీయ జీవితాన్ని కేవలం రహస్య కార్యకలాపాలకే పరిమితం చేయలేదు. గ్రామాల్లో రైతు సంఘాలు, వ్యవసాయ కూలీల సంఘాలు, పట్టణాల్లో కార్మిక సంఘాలు, కళాశాలల్లో విద్యార్థి ఉద్యమాలు, మహిళా సంఘాలు, యువజన సంఘాలు, రచయితలు, కళాకారులు, మేధావుల వేదికలన్నీ కలిసి ఒక విస్తృత ప్రజా ఉద్యమాన్ని నిర్మించే ప్రయత్నం చేసింది. ఒక ఉద్యమం బలంగా ఉండాలంటే ప్రజల జీవితంలోని ప్రతి రంగంలో దాని ఉనికి కనిపించాలనే అవగాహన ఈ మార్పుకు పునాది. ఇక్కడే మరో పెద్ద చర్చ మొదలైంది. ఎన్నికల్లో పాల్గొనడం విప్లవ రాజకీయాలకు వ్యతిరేకమా? లేక ప్రజలతో మరింత విస్తృతంగా సంభాషించే అవకాశమా? ఈ ప్రశ్న చుట్టూ భారత వామపక్ష ఉద్యమంలో ఎన్నో సంవత్సరాలు తీవ్రమైన వాదోపవాదాలు జరిగాయి. వినోద్ మిశ్రా ఈ ప్రశ్నకు ఇచ్చిన సమాధానం ఒకవైపు సరళంగా కనిపించినా, దాని వెనుక ఉన్న రాజకీయ ఆలోచన లోతైనది. ఎన్నికలు సమాజాన్ని మార్చే అంతిమ సాధనం కావు. కానీ ప్రజలతో మాట్లాడేందుకు, వారి సమస్యలను దేశం ముందుకు తీసుకురావడానికి, పాలక వర్గాల విధానాలను బహిర్గతం చేయడానికి అవి ఒక రాజకీయ వేదిక. ఆ వేదికను పూర్తిగా వదిలేయడం కూడా ప్రజలతో ఉన్న సంబంధాన్ని బలహీనపరచే ప్రమాదం ఉందని ఆయన భావించారు.

అయితే ఎన్నికలకే పరిమితమైపోయే రాజకీయాలను కూడా ఆయన సమర్థించలేదు. ప్రజల అసలు శక్తి ఓటు పెట్టే రోజున మాత్రమే కనిపించదు. పొలంలో కూలి తన హక్కు కోసం నిలబడినప్పుడు కనిపిస్తుంది. కర్మాగారంలో కార్మికుడు సమ్మె చేసినప్పుడు కనిపిస్తుంది. దళితులపై దాడికి వ్యతిరేకంగా గ్రామం ఒక్కటిగా నిలిచినప్పుడు కనిపిస్తుంది. మహిళలు అన్యాయానికి ఎదురు తిరిగినప్పుడు కనిపిస్తుంది. విద్యార్థులు విద్య హక్కు కోసం పోరాడినప్పుడు కనిపిస్తుంది. ఈ పోరాటాలే ప్రజాస్వామ్యానికి ప్రాణం. ఎన్నికలు వాటికి తోడ్పడే ఒక రంగం మాత్రమే. అదే కారణంగా ప్రజాస్వామ్య హక్కుల కోసం జరిగే ఉద్యమాలకు లిబరేషన్ పార్టీ ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చింది. భావ ప్రకటనా స్వేచ్ఛ, సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కు, సమ్మె హక్కు, భూమి హక్కు, కనీస వేతనం, దళితుల రక్షణ, మహిళల సమాన హక్కులు, ఆదివాసీల భూమి రక్షణ ఇవన్నీ విడివిడిగా ఉన్న సమస్యలు కావు. ఇవన్నీ ప్రజల సంఘటిత శక్తిని పెంచే రాజకీయ ప్రక్రియలో భాగాలని వినోద్ మిశ్రా విశ్లేషించారు.

భారత సమాజాన్ని అర్థం చేసుకోవాలంటే కేవలం వర్గ దోపిడీ గురించి మాత్రమే మాట్లాడితే సరిపోదని ఆయన భావించారు. ఇక్కడ కులవ్యవస్థ శతాబ్దాలుగా మనుషులను అవమానిస్తూ, విభజిస్తూ, అణచివేస్తూ వచ్చింది. అందుకే కుల వివక్షకు వ్యతిరేక పోరాటం కూడా వర్గ పోరాటానికి అంతర్భాగమేనని ఆయన నొక్కి చెప్పారు. దళితుడి గౌరవం కోసం జరిగే పోరాటం, భూమి కోసం జరిగే పోరాటం, కనీస వేతనం కోసం జరిగే పోరాటాలు పరస్పరం బలపరుచుకునే పోరాటాలుగా ఆయన చూశారు. అదేవిధంగా మహిళల ప్రశ్నను కూడా ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు.



- మామిండ్ల రమేష్ రాజా
7893230218
సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ తెలంగాణ

## బాబు జగ్జీవన్‌రావు సేవలు చిరస్మరణీయం



**మల్కాజిగిరి, జూలై 6 (జనంసాక్షి) :** బాబు జగ్జీవన్ రావ్ సేవలు చిరస్మరణీయమని గౌతమ్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ పేర్కొన్నారు. బాబు జగ్జీవన్ రావ్ వర్ధంతిని పురస్కరించుకొని గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని ఇందిరా నెహ్రూ నగర్ తదితర ప్రాంతాలలో ఉన్న బాబు జగ్జీవన్ రావ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ సేవలను నేటి యువత అలవర్చుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రాముయాదవ్,బైరుయానిల్,టి ఆర్ఎస్వి నర్సింగ్,నగేష్ గౌడ్,రావు,నరహరి,భాను,గణేశ్ నాయక్,కిషన్,రాజా,హబీబ్,లక్ష్మణ్ యాదవ్,యాదగిరి,ప్రదీప్,శశిధర్,రవి హుసిన్,లక్ష్మణ్ చారి,సిద్ధులు, సాయి,ప్రభు,అనిత,లక్ష్మి,మౌనికా,సరిత తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి



**ఘట్కేసర్, జూలై 6 (జనం సాక్షి) :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేసి, అర్హులైన దరఖాస్తుదారులకు త్వరితగతిన ప్రొసీడింగ్స్ మంజూరు చేయాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఘట్కేసర్ సర్కిల్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ అమలుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తుకు సంబంధించి ఎల్--1, ఎల్--2, ఎల్--3 స్థాయిల్లో పెండింగ్‌లో ఉన్న పరిశీలనలను త్వరితగతిన పూర్తి చేసి, దరఖాస్తుదారులకు ఎల్ఆర్ఎస్ ప్రొసీడింగ్స్ జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎల్ఆర్ఎస్ ఫీజుపై ప్రభుత్వం ప్రకటించిన 25 శాతం రాయితీ ఈ నెల జూలై 31తో ముగియనున్న నేపథ్యంలో, కార్యాలయ సిబ్బంది ప్రతి దరఖాస్తుదారునికి ఈ రాయితీపై పూర్తి అవగాహన కల్పించాలని, చివరి తేదీకి ముందే దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకునేలా సహకరించాలని అధికారులకు ఆదేశించారు. ప్రజలు ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సమీక్ష సమావేశంలో చీఫ్ సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డిప్యూటీ కమిషనర్ వాణి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ రాజీవ్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ శ్రీదేవి, ఎల్--1, ఎల్--2, ఎల్--3 అధికారులు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## బోలక్‌పూర్‌లో స్క్రాప్ దుకాణాలు తొలగించాలి

- పలువురు బిజెపి నాయకులు
- జీహెచ్ఎంసీ కార్యాలయం ఎదుట ధర్నా



**ముషీరాబాద్, జూలై 6 (జనం సాక్షి) :** బోలక్పూర్ ప్రాంతం లో భద్రతా ప్రమాణాలు పాటించకుండా ఇష్టాను రీతిలో అక్రమంగా స్క్రాప్ దుకాణాలు వెలిశాయని, వాటి వల్ల ఇటీవలి కాలంలో అనేకమార్లు అగ్ని ప్రమాదాలు సంబంవించి ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారని, ప్రభుత్వం అధికారులు స్పందించి తక్షణమే భోలక్పూర్ ప్రాంతంలోని అక్రమ స్క్రాప్ దుకాణాలను తొలగించాలని పలువురు బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం దోమలగూడ లోని జీహెచ్ఎంసీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం డిప్యూటీ కమిషనర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, నివాస ప్రాంతాల్లో నిర్వహిస్తున్న స్క్రాప్ దుకాణాల వల్ల స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజల భద్రతతో పాటు పరిశుభ్రతకు కూడా విఘాతం కలుగుతోందని ఆరోపించారు. సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని అక్రమ స్క్రాప్ దుకాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ రావు, ముషీరాబాద్ మాజీ కార్పొరేటర్ సుప్రియ నవీన్ గౌడ్, వెంకటేష్, రామ్ రెడ్డి, మోహన్, కృష్ణ, నరసింహ, చింటూ, కనకేష్, బబ్లు,గడ్డం నవీన్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డిగ్రీ విద్య జీవితానికి కీలక మలుపు

**మల్కాజిగిరి, జూలై 6 (జనంసాక్షి) :** విద్యార్థులు క్రమశిక్షణతో చదివి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని మల్కాజిగిరి డిగ్రీ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ బండి రాజు పేర్కొన్నారు. డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బండి రాజు మాట్లాడుతూ, డిగ్రీ విద్య జీవితానికి కీలక మలుపని, విద్యార్థులు లక్ష్యంతో శ్రమించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ అడవి రాజు, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్. రాజేశ్ కుమార్, అకడమిక్ కో-ఆర్డినేటర్ గుణాకర్ విద్యార్థులకు కళాశాల నిబంధనలు, పరీక్షల విధానం, విద్యా ప్రమాణాలు మరియు కెరీర్ అవకాశాలపై అవగాహన కల్పించారు. అనంతరం నూతన విద్యార్థులకు కళాశాల గ్రంథాలయం, ప్రయోగశాలలను చూపించి వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ హరిత, డాక్టర్ స్వాతి, ప్రొఫెసర్ వెంకటరెడ్డి, డాక్టర్ ప్రదీప్, డాక్టర్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.




# రైలు మార్గంలో గంజాయి అక్రమ రవాణా

- ముగ్గురు అంతర్రాష్ట్ర ముఠా సభ్యుల అరెస్ట్
- సికింద్రాబాద్‌లో రూ.20.56 లక్షల మత్తుపదార్థం స్వాధీనం

**సికింద్రాబాద్, జూలై 6 (జనంసాక్షి) :** ఒడిశా నుంచి మహారాష్ట్రకు రైలు మార్గంలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న అంతర్రాష్ట్ర గంజాయి అక్రమ రవాణాను పోలీసులు భగ్నం చేశారు. సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులు తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీనాబ్) ఈగిల్ బృందం, రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్) సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో భారీగా మత్తుపదార్థం పట్టుబడింది. రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.20.56 లక్షల విలువైన 41.131 కిలోల పొడి (డ్రై) గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో ఇద్దరు యువకులతో పాటు ఒక మైనర్ బాలుడు ఉన్నాడు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైల్వే డీఎస్పీ జావేద్ ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన దిలీప్ వాంధారే (25), కార్తిక్ చంద్రకాంత్ అంబే (30)తో పాటు ఓ 17 ఏళ్ల బాలుడిని ఒడిశాలోని బలంగీర్‌కు చెందిన ప్రధాన నిందితుడు, సూత్రధారి సంజు



సాహు గంజాయి రవాణాకు మోహరించాడు. నిందితులకు ఒక్కో ట్రిప్‌కు రూ.5 వేల చొప్పున ఇస్తానని ఆశ చూపించి మత్తుపదార్థాల రవాణాకు అలవాటు చేశాడు. వీరు గతంలోనూ ఇదే తరహాలో పలుమార్లు అక్రమ రవాణాకు పాల్పడినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది.

### ట్రాలీ బ్యాగుల్లో దాచి, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ప్రయాణం

ఈ నెల 3న బలంగీర్ రైల్వే స్టేషన్‌లో సంజు సాహు నిందితులకు గంజాయి ప్యాకెట్లను అందజేశాడు. పోలీసులకు ఎలాంటి అనుమానం రాకుండా ఉండేందుకు వాటిని పెద్ద పెద్ద ట్రాలీ సూట్‌కేసులు, బ్యాక్‌ప్యాక్‌లలో భద్రపరిచారు. అక్కడ నుంచి నాగావళి ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణించి చర్లపల్లి చేరుకున్నారు. ఆ తర్వాత సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకుని, అక్కడ నుంచి దక్షిణ్ ఎక్స్‌ప్రెస్‌లో నాగ్‌పూర్ వెళ్లేందుకు సిద్ధమవుతుండగా నిఘా వర్గాల సమాచారంతో పోలీసులు ఏకకాలంలో దాడి చేసి పట్టుకున్నారు. నిందితుల బ్యాగులను క్షుణ్ణంగా తనిఖీ చేయగా, చిన్న చిన్న ప్యాకెట్లుగా ప్యాక్ చేసిన 41.131 కిలోల డ్రై గంజాయి లభ్యమైంది. అంతర్జాతీయ మార్కెట్‌లో దీని విలువ సుమారు రూ.20,56,000 ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. పట్టుబడిన నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టంలోని పలు కఠిన సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పరారీలో ఉన్న ప్రధాన సూత్రధారి సంజు సాహు పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను రంగంలోకి దించినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ ముఠాతో సంబంధం ఉన్న ఇతర వ్యక్తుల కోసం ఆరా తీస్తున్నారు. అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అక్రమాలను సమర్థవంతంగా ఛేదించిన సికింద్రాబాద్ జీఆర్పీ, టీజీనాబ్ ఈగిల్ బృందం, ఆర్పీఎఫ్ సిబ్బందిని రైల్వే అండ్ రోడ్ సేఫ్టీ ఐజీ కె. రమేష్ నాయుడు ప్రత్యేకంగా అభినందించారు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న సిబ్బందికి ప్రభుత్వ పరంగా తగిన ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని ఆయన ప్రకటించారు.

## సింగారం జగన్నాథ స్వామి ఆలయానికి మహర్దశ



**యాచారం, జూలై 7 (జనం సాక్షి) :** యాచారం మండల పరిధిలోని నజ్దిక్ సింగారం గ్రామంలో వెలసిన సుమారు నాలుగు వందల సంవత్సరాల క్రితం నాటి అత్యంత పురాతనమైన శ్రీ శ్రీ జగన్నాథ స్వామి ఆలయ అభివృద్ధికి ఎట్టకేలకు మోక్షం లభించనుంది. ఆలయానికి వెళ్లేందుకు సరైన దారి లేకపోవడంతో నిత్యం దర్శనానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని సింగారం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మాల్రెడ్డి రంగారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సోమవారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి, గ్రామం నుండి గుడి వరకు నూతన రోడ్డు నిర్మాణంతో పాటు, ఆలయ ప్రాంగణంలో నిరంతర విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేకంగా ఒక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. భక్తుల ఇబ్బందులను, ఆలయ ప్రాధాన్యతను ఆలకించిన ఎమ్మెల్యే మాల్రెడ్డి రంగారెడ్డి సానుకూలంగా స్పందించారు. తక్షణమే స్పందించిన ఆయన, విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ తో ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యను వివరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ పరిసరాల్లో వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించాలని, రోడ్డు సమస్యపై నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే చొరవపై గ్రామ ప్రజలు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిత్తారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టొద్దు

- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి




**ఇబ్రహీంపట్నం, జూలై 6 (జనం సాక్షి) :** ప్రజావాణి ఫిర్యాదులను పెండింగులో పెట్టొద్దని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 112 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిరంతరం సమీక్షిస్తూ నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు 36, ఇతర శాఖలకు 76, మొత్తం 112 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శారద, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాలు యువతకు ఆదర్శం



**షాబాద్, జూలై 6 (జనం సాక్షి) :** దేశ సమైక్యత జాతీయ సమగ్రత, విద్యాభివృద్ధి కోసం విశేషంగా కృషిచేసిన గొప్ప వ్యక్తి శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని బిజెవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కూతూ రు మహేందర్ పేర్కొన్నారు. షాబాద్ మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద సోమవారం వారి 125వ జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు, అనంతరం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశ ప్రయోజనాలే పరమవదిగా భావించి ప్రజాసేవలో అంకిత భావంతో పనిచేసిన మహనీయుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. యువత శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని దేశాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు లంబాడి రాము, మండల ప్రధాన కార్యదర్శి దాదే హరీష్, దళిత మోర్చా అధ్యక్షులు లింగాల మహేందర్, నాయకులు తాళ్ల నవీన్ గౌడ్, గోపాల్ నారాయణ, కృష్ణ చారి, శేఖర్, విజయ్ కుమార్, అనంతం,గంధం రమేష్, విక్రమ్, వివేక్, రాఘవేందర్ శివ, శ్రీశైలం, మల్లేష్, రాధాకృష్ణ, మల్లికార్జున్, రవి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు పారదర్శక, వేగవంతమైన సేవలు



**గద్వాల నడిగడ్డ, జులై 6 (జనం సాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని పలు మండలాల నుంచి వచ్చిన మొత్తం 20 ఫిర్యాదులను జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు స్వయంగా స్వీకరించి బాధితులతో నేరుగా మాట్లాడారు.ప్రతి అర్జీని శ్రద్ధగా పరిశీలించిన ఎస్పీ సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో తక్షణం సంప్రదించి చట్టపరమైన చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. బాధితులకు ఆలస్యం లేకుండా న్యాయం జరిగేలా పర్యవేక్షణ కొనసాగిస్తామని తెలిపారు. భూ వివాదాలు,ఆస్తి సమస్యలు,కుటుంబ కలహాలు వంటి అంశాల్లో చట్టపరమైన పరిష్కారమే తీసుకువస్తామని స్పష్టం చేశారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కారమయ్యాయో నిరంతరం సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందిస్తున్నామని తెలిపారు. భూ వివాదాలకు సంబంధించి 8,చీటింగ్ కు సంబంధించి 1,గొడవలు 6,కుటుంబ వివాదాలు సంబంధించి 1,ఇతర సమస్యలు 4,మొత్తం 20 ఫిర్యాదులు వచ్చావని జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు.

## హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం



**సదాశివపేట, జులై 6 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాజుద్దీన్ పేర్కొన్నారు. సోమవారం ఇందిరా పార్క్ లో జరిగే మహాధర్నకు సదాశివపేట నుంచి సిపిఐ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా తాజుద్దీన్ మాట్లాడుతూ... గత ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. ప్రతి పేద వాడికి ఇంటి స్థలం ప్రతి పూరి గుడిసే వేసుకున్న వారికి పట్టాలిస్తామని ఎన్నికల ప్రచారంలో చెప్పినప్పటికీ ఇప్పటివరకు ఒక్కరికి కూడా ఇండ్ల పట్టాలు ఇవ్వలేకపోయారని ఆరోపించారు. అధికార పార్టీ ఇచ్చిన హామీల అమలుకై ఇందిరా పార్క్ లో వామపక్ష పార్టీలతో మాహ ధర్నా నిర్వహించడం జరిగిందన్నారు. ధర్నాలో ఎంఏ రెహమాన్ , ముస్తఫా , వెంకట్ గౌడ్ , జ్యోతి , సాదక్ అలీ, కళావతి , తస్లీమ్ , రాజమ్మ తదితరులు వెళ్లడం జరిగింది.

# యువత చిన్న ఉద్యోగంతో మొదలై ఉన్నత లక్ష్యాన్ని సాధించాలి

- బిఆర్ఎస్ ఎల్పీ విప్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద

**నిజాంపేట్, జూలై 6 (జనం సాక్షి) :** నేటి యువతీ యువకులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతోతమ అంతిమ లక్ష్యాన్ని ఛేదించేందుకు బొట్టు, బొట్టు నీరు అంతిమంగా నదిగా మారినట్టు, చిన్న ఉద్యోగంతో మొదలైనా మీరు అంతిమంగా ఉన్నత లక్ష్యాన్ని సాధించాలని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బహదూర్‌పల్లిలో గల కేఎం. పాండు మెమోరియల్ వోకేషనల్ జూనియర్ కళాశాల" వేదికగా ఇంటర్మీడియట్ వోకేషనల్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళా కార్యక్రమానికి సోమవారం బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మాట్లాడుతూ నిరుపేద మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో స్థాపించబడిన కేఎం. పాండు మెమోరియల్ వోకేషనల్ జూనియర్ కళాశాల ప్రతి సంవత్సరం వందలాది మంది విద్యార్థులకు విద్యను అందిస్తూ, జాబ్ మేళాల ద్వారా వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం ఎంతో ప్రశంసనీయమని అన్నారు. ప్రభుత్వ వోకేషనల్ విద్యాభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తున్న జేఈటీఎల్, ఏవీ రావు పవనపుత్ర ఎంటర్‌ప్రైజెస్ తో పాటు ఈ కార్యక్రమానికి సహకరించిన అన్ని సంస్థలు, దాతలను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఈ జాబ్ మేళా ద్వారా ఉద్యోగాలకు ఎంపికైన యువత పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా తమ నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకుని, ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఇలాంటి కార్యక్రమాలు యువత భవిష్యత్తుకు బలమైన పునాదిని, మనోధైర్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో దాదాపు 30 కంపెనీలు పాల్గొని విద్యార్థులకు ఇంటర్వ్యూలను నిర్వహించి అర్హులైన వారిని ఎంపిక చేయడం జరిగింది. అనంతరం ఎం.ఎస్.ఎన్ ల్యాబోరేటరీస్ లో నియామకం అయిన నలుగురు విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఐఈఓ కుషాన్, ఇంటర్మీడియట్ ఒకేషనల్ ఎడ్యుకేషనల్ డిపార్ట్మెంట్ జాయింట్ సెక్రటరీ జోష్నా, ఆర్డిఎస్ఐఈ ఏడి ఉషేంద్ర, కుత్బుల్లాపూర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్ర, మల్కాజ్గిరి ప్రభుత్వ



జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఉమా, కూకట్ పల్లి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య, దాతలు బి. సాయి కుమార్, ఏవి.రావు, వెలుగు ట్రస్ట్ ఫౌండర్ నారాయణ రావు, మాజీ కౌన్సిలర్లు ఎలుగారి సత్యనారాయణ, భరత్, మాజీ సర్పంచ్ కొమురయ్య యాదవ్, సగ్గడి పద్మారావు, నాయకులు సగ్గిడి శ్రీనివాస్, నాయి కోటి శ్యామ్, అధ్యాపకులు, వివిధ కంపెనీల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
07 జూలై 2026

# అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



**బిజినేపల్లి, జూలై 6 (జనం సాక్షి) :** బిజినపల్లి మండల కేంద్రంలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సోమవారం ఉదయం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బిజినపల్లి గ్రామంలోని జహంగీర్ బీ నివాసానికి వెళ్లిన జిల్లా కలెక్టర్, అక్కడ బూత్ స్థాయి అధికారి (బీఎల్ఓ) శివలీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటింటి ఓటరు ధృవీకరణ, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ ప్రక్రియను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నేరుగా ఓటర్లతో మాట్లాడి ఎన్యూమరేషన్ ఫారాలను ఎలా పూరించాలి, ఏయే వివరాలను నమోదు చేయాలి, అవసరమైన పత్రాలను ఎలా జత చేయాలనే విషయాలను వివరించారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమానికి ప్రజలు పూర్తి సహకారం అందించి, తమ వివరాలను సక్రమంగా నమోదు చేయించుకోవాలని సూచించారు. అనంతరం మండల తహసీల్దార్‌తో సమావేశమైన జిల్లా కలెక్టర్, మండలంలో మొత్తం ఉన్న ఓటర్ల సంఖ్య, ఇప్పటివరకు పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారాల వివరాలు, తిరిగి స్వీకరించిన ఫారాల సంఖ్య, ఆన్‌లైన్‌లో నమోదైన దరఖాస్తుల పురోగతి తదితర అంశాలపై సమగ్రంగా ఆరా తీశారు. ప్రతి దశలో నమోదు ప్రక్రియ నిబంధనల ప్రకారం జరుగుతోందా లేదా అనే విషయాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మండల తహసీల్దార్ మునీరుద్దీన్ బిజినపల్లి మండల పరిధిలో మొత్తం 61,545 మంది ఓటర్లు ఉన్నారని, వారందరికీ 100 శాతం ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియను పూర్తి చేసే దిశగా చర్యలు చేపట్టామని, ఇప్పటికే ఫారాలను ఓటర్ల నుంచి తిరిగి స్వీకరించే ప్రక్రియను ప్రారంభించడం జరిగిందని, 2 వేలకుపైగా ఓటర్ల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. మిగిలిన దరఖాస్తులను కూడా నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అదే సమయంలో అనర్హుల పేర్లను నిబంధనలకు అనుగుణంగా తొలగించే ప్రక్రియను కూడా అత్యంత జాగ్రత్తగా చేపట్టాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను స్వయంగా కలుసుకుని ఎన్యూమరేషన్ ఫారాలను అందజేయడంతో పాటు, వాటిని పూర్తిగా నింపించి తిరిగి స్వీకరించాలని చెప్పారు. ఫారాల్లో నమోదైన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసి, ఎలాంటి జాప్యం లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని, ఓటర్లకు ఏవైనా సందేహాలు ఉంటే వాటిని వెంటనే నివృత్తి చేసి, వారికి పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో నిర్లక్ష్యానికి ఎలాంటి అవకాశం ఉండకూడదని, ప్రతి అధికారి ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజల భాగస్వామ్యంతోనే ఓటరు జాబితా మరింత పకడ్బందీగా రూపొందుతుందని, ప్రతి అర్హత కలిగిన ఓటరు తమ వివరాలను పరిశీలించి, అవసరమైన పత్రాలతో ఎన్యూమరేషన్ ఫారాలను నిర్ణీత సమయంలో బీఎల్ఓలకు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. తనిఖీ సందర్భంగా జిల్లా కలెక్టర్ బూత్ స్థాయి అధికారులు నిర్వహిస్తున్న రికార్డులు, ఫారాల పంపిణీ రిజిస్టర్లు, స్వీకరణ వివరాలు, ఆన్‌లైన్ నమోదు పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మండలడిప్యూటీ తాసిల్దార్ రవికుమార్, ఎన్నికల విభాగం అధికారులు, మండల స్థాయి సిబ్బంది, బూత్ స్థాయి అధికారులు మంగమ్మ,మల్లీశ్వరి,సంబంధిత శాఖల అధికారులు,బూతు లెవెల్ పార్టీల ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## రేగులపల్లి విద్యుత్ సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- సీపీఎం డిమాండ్



**బెజ్జంకి, జూలై 6 (జనం సాక్షి) :** మండలంలోని రేగులపల్లి గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించి,విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న జేఎల్ఎంను తొలగించి,సమర్థుడైన లైన్మెన్‌ను నియమించాలని కోరుతూ సోమవారం సీపీఎం నాయకులు,గ్రామ ప్రజలు బెజ్జంకి విద్యుత్ శాఖ ఏఈకి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ మాట్లాడుతూ రేగులపల్లి గ్రామంలో గత కొన్ని రోజులుగా తీవ్ర విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతున్నప్పటికీ జేఎల్ఎం స్పందించకపోవడం వల్ల రైతులు,గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు.విద్యుత్ సమస్యల కారణంగా పలువురి టీవీలు,ఫ్రిజ్‌లు,ఫ్యాన్లు వంటి విద్యుత్ పరికరాలు దెబ్బతిన్నా అధికారులు పట్టించుకోవడం లేదు అని అన్నారు.విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న జేఎల్ఎంను వెంటనే తొలగించి,సమర్థుడైన లైన్మెన్‌ను రేగులపల్లికి నియమించి గ్రామంలోని విద్యుత్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో ఏఈ కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కుర్రా ఐలయ్య,కుంభం శ్రీకాంత్,ముడికే నరసయ్య,జెల్లా అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# గురుజాల్ శివరాజ్ పాటిల్‌కు ఘనంగా సన్మానం

- రష్యా పర్యటన విజయవంతం



**కృష్ణ, జూలై 6 (జనం సాక్షి) :** రష్యా పర్యటనను విజయవంతంగా ముగించుకుని స్వదేశానికి చేరుకోవడం ఎంతో ఆనందంగా ఉందనీ ఈ పర్యటన సందర్భంగా అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొనే అవకాశం లభించడం. వివిధ దేశాల ప్రతినిధులతో సమావేశమై అభివృద్ధి, పరిపాలనా విధానాలు, పర్యావరణ పరిరక్షణతో పాటు పలు సమకాలీన అంశాలపై చర్చించి విలువైన అనుభవాన్ని పొందాననీ పర్యటన విజయవంతం అయిందని బి ఆర్ ఎస్ నాయకులు శివరాజ్ పాటిల్ అన్నారు. ఈ అనుభవాలు ప్రజాసేవలో మరింత సమర్థవంతంగా పనిచేయడానికి నాకు దోహదపడతాయని,విశ్వసిస్తున్నానన్నారు.సోమవారం కృష్ణ మండలం క్షిరలింగేశ్వర దేవాలయ ప్రాంగణంలో, అఖిలపక్ష నాయకులు శివరాజ్ పాటిల్ కు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు, అలాగే కృష్ణ మండలంలో తనకు ఆత్మీయంగా స్వాగతం పలికిన శివప్ప, నాగరాజ తాత, మహాలింగ, చేగుంట సర్పంచ్, బాలరాజ్, తిప్పన్న, ఆంజనేయ, రెడ్డి, అంబ్రేష్, బసన్న గౌడ్, రాజు, రెడ్డి, శ్రీనివాస్, సంతోష్, మహాలింగ, లింగప్ప, డా. శేఖర్, రవి, జయప్రకాశ్, లింగహల్లి ఆంజనేయ, రాఘవేంద్ర, వెంకటేష్, సురేష్ కుమార్,, మదుమాల్ శీను, తిమ్మప్ప, కు, అందరికి, నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు . మీరు చూపించిన ప్రేమ, ఆదరణ, విశ్వాసం నాకు మరింత బాధ్యతను గుర్తుచేశాయనీ అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, ప్రజాహితమే లక్ష్యంగా, మరింత నిబద్ధతతో, అంకితభావంతో ప్రజాసేవలో కొనసాగుతానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో ఈ పర్యటన ద్వారా పొందిన అనుభవాలను ప్రజలతో పంచుకుని, మన ప్రాంత అభివృద్ధికి ఉపయోగపడే అంశాలపై కృషి చేస్తానన్నారు.

# విద్యా రంగ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన
- కలెక్టరేట్‌లోకి దూసుకుపోయిన విద్యార్థులు
- పోలీసులు ఆపేందుకు ప్రయత్నం
- పోలీసుల విద్యార్థి సంఘం నాయకుల మధ్య తోపులాట
- కలెక్టరేట్ మెయిన్ డోర్ మూసి వేసిన పోలీసులు కలెక్టరేట్ ఏవో కు వినతి
- విద్యార్థుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తానని హామీ
- ఉద్రిక్తను విరమించిన విద్యార్థులు



**సంగారెడ్డి, జూలై 6 (జనం సాక్షి) :** పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని విద్యారంగా సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ధర్నా నిర్వహించారు. ఒకేసారి విద్యార్థులు కలెక్టరేట్లోకి గేటు తోసుకొని వెళ్లే ప్రయత్నం, ఉద్రిక్త త పోలీసులు మధ్య విద్యార్థి సంఘాల మధ్య తోపులాట ఉద్రిక్తత నెలకొంది ఒకేసారి విద్యార్థులు కలెక్టరేట్లోకి దూసుకు వెళ్లి కలెక్టర్ మెయిన్ డోర్ వద్ద నిరసన వ్యక్తం చేశారు కలెక్టరేట్ ఏవో విజయలక్ష్మి కి వినతి పత్రం అందజేశారు ఆమె సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు నిరసనను విరమించారు ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, విద్యారంగానికి తగిన నిధులు కేటాయించాలని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలని, ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలపై ప్రభుత్వం స్పందించే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు , విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## టీయూడబ్ల్యూజే మహా సభను జయప్రదం చేయండి

- ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్ రావులకోరి




**హత్నూర, జూలై 6 (జనం సాక్షి) :** జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్(ఐజెయు) అనుబంధంగా తెలంగాణ రాష్ట్ర యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టియుడబ్ల్యూజె) ఆధ్వర్యంలో ఈ నెల 9న జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో నిర్వహించనున్న జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్ రావులకోరి పిలుపునిచ్చారు.మండలంలోని కాసాల గ్రామ పరిధిలో సోమవారం మహాసభకు సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జర్నలిస్ట్ నాయకులు గుండ్ల మాచునూర్ గ్రామ సర్పంచి శ్రీహరి మాట్లాడుతూ ప్రజా సమస్యలను,ప్రభుత్వ పాలనా తీరును నిష్పక్షపాతంగా ప్రజలముందుంచుతూ ప్రజలకు – ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తున్న మీడియా జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగో స్తంభంగా పిలువబడే మీడియా జర్నలిస్టుల జీవన స్థితిగతులు అధ్వాన్నంగా మారాయన్నారు. అనంతరం వెంకటేష్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించుకునేందుకు జర్నలిస్టులంతా ఐక్యమత్యం తో ముందుకు సాగాలన్నారు.కార్యక్రమంలో మండల జర్నలిస్టులు రవి,ప్రతాప్,వీరేశం,ప్రభాకర్ ,యాదగిరి, బిక్షపతి,వేణు గౌడ్,దస్తగిరి,నగేష్,శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్యామ ప్రసాద్ ముఖర్జీ సేవలు చిరస్మరణీయం



**పెద్దశంకరంపేట, జూలై 6 (జనం సాక్షి) :** జనసంఘ వ్యవస్థాపకులు శ్యామ ప్రసాద్ ముఖర్జీ సేవలు చిరస్మరణీయం పెద్ద శంకరంపేట మండల బిజెపి అధ్యక్షుడు శ్రావణ్ కుమార్ అన్నారు. సోమవారం డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి పురస్కరించుకొని పెద్ద శంకరంపేట లోని బిజెపి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి మండల బిజెపి నాయకులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మండల బిజెపి అధ్యక్షుడు శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ దేశ సమగ్రత కోసం జాతీయ ఐక్యత దేశ ఉజ్వల భవిష్యత్తు కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. వారి దేశభక్తి త్యాగం జాతీయ సమైక్యత కోసం చేసిన పోరాటం యావత్ భారతదేశానికి చిరస్మరణీయంగా నిలిచిపోతా యన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీజేవైఎం అధ్యక్షుడు బుగుడాల కృష్ణ.. నాయకులు వెంకయ్య శంకర్రావు అనిల్ నర్సింలు సాయిలు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాలు తనిఖీ



**మల్దకల్, జూలై 6 (జనంసాక్షి) :** రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలని ఎవరైనా అధిక ధరలకు అమ్మిన కఠిన చర్యలు తప్పవని తహసిల్దార్ ఝాన్సీరాణి హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని పలుఎరువులు దుకాణాలను వ్యవసాయ శాఖ అధికారి రాజశేఖర్ తో పాటు ఆమెకలిసి తనిఖీలు చేశారు.ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచి యాప్ ఈపాస్ ద్వారా అమ్మకాలు కొనసాగించాలని దుకాణాలు యజమానులకు సూచించారు.గ్రామాలలో కొనసాగుతున్న సర్ సర్వేను తాసిల్దార్ ఝాన్సీరాణి తనిఖీ చేశారు.ఇంటింటికి ఎనుమరేషన్ ఫారాలను పంపిణీ పూర్తి చేసి వెంటనే తీసుకొని కంప్యూటర్లో ఎక్కించాలన్నారు.తొందరగా సర్ సర్వేను పూర్తి చేసేందుకు వీఎల్వోలు,బిఎల్వోలు సక్రమంగా పనిచేయాలని ఆమె ఆదేశించారు.

## బాబు జగ్జీవన్‌రామ్ సేవలు వెలకట్టలేనివి

- ఘన నివాళి అర్పించిన కాంగ్రెస్ శ్రేణులు



**మక్తల్, జూలై 6 (జనంసాక్షి) :** భారత స్వాతంత్ర సమరయోధులు, మాజీ ఉప ప్రధాని, భారతదేశ తొలి కార్మిక శాఖ మంత్రిగా పనిచేసిన స్వర్గీయ బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా మక్తల్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టౌన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ అట్టడుగు వెనుకబడిన ప్రాంతం నుంచి వచ్చిన బాబు జగ్జీవన్ రామ్ స్వాతంత్ర ఉద్యమంలో కీలక భూమిక పోషించారని తెలిపారు. దేశ స్వాతంత్రం తర్వాత నెహ్రూ హయాంలో ఏర్పడిన తొలి క్యాబినెట్లో కార్మిక శాఖ మంత్రిగా పనిచేశారని, అనంతరం దేశ ఉప ప్రధానిగా సైతం సేవలు అందించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస హనుమంతు, మార్కెట్ వైస్ చైర్మన్ గణేష్ కుమార్, కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ అల్మూరి రవి కుమార్, మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, కట్టా సురేష్ గుప్తా, కాంగ్రెస్ పార్టీ వార్డు కౌన్సిలర్ లు, మార్కెట్ డైరెక్టర్ లు, కాంగ్రెస్ పార్టీ అన్ని విభాగాల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రం నిధులతోనే అభివృద్ధి

- ఎంపీ డీకే అరుణ




నారాయణపేట జిల్లా బ్యూరో, జూలై 6 (జనం సాక్షి) : కేంద్ర ప్రభుత్వం నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతున్నదని రాష్ట్రం చేసింది ఏమి లేదని పాలమూరు ఎంపి.డి కే అరుణ అన్నారు.సోమవారం ఆమె నారాయణపేట నియోజకవర్గంలోని నారాయణపేట మండలం బోయిన్ పల్లి లో సి సి రోడ్డు పనులను ప్రారంభించి పాఠశాలకు కంప్యూటర్ అందజేశారు.అలాగే పాక్ పల్లి,కొల్లంపల్లి గ్రామంలో హై మాస్ట్ లైట్లను ప్రారంబించారు.ధన్వద మండలం మంత్రినిపల్లి లో హై మాస్ట్ లైట్లను,సి సి రోడ్డు అభివృద్ధి పనులను ప్రారంబించారు.ఈ సందర్భంగా ఎం పి మాట్లాడుతు గ్రామ పంచాయతీల భవ నాలు, అంగన్వాడీ భవనా లు, మహిళా సంఘాల భవనాలు, సీసీ రోడ్లు, ఉపాధి హామీ లో 60శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తున్నదన్నారు. అన్ని అభివృద్ధి పనులలో కేంద్రం నిధులు ఉన్నాయ న్నారు.కృష్ణా మండలానికి రైల్వే స్టాప్ ఏర్పాటు చేయించింది కేంద్ర ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు.అమృత్ పథకం లో డ్రైనే జీలు, త్రాగునీరు,చెరువుల పునరుద్ధరణ చేస్తుంది కేంద్ర ప్రభుత్వమే నన్నారు.భూ సేకరణ కాకపోవడం ద్వారానే రైల్వే ప్రాజెక్టుల ఆలస్యం జరుగుతుం దన్నారు.మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లాలో ఇరిగేషన్ ప్రాజెక్టులు పోరాటాలు చేసి సాధించుకున్నానన్నారు. పదేళ్లు పాలించిన బి ఆర్ ఎస్, రెండేళ్లలో కాంగ్రెస్ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ పెండింగ్ పనులు పూర్తి చేయలేదనీ విమర్శించారు.ఆర్ అండ్ ఆర్ పనులు అనేక ప్రాజెక్టుల కింద పెండింగ్ లో ఉన్నాయన్నారు. కేసీఆర్ మాదిరిగానే రేవంత్ రెడ్డి మాటలతో ప్రజలను మోసం చేస్తున్నారనీ విమర్శించారు.ఆరు గ్యారంటీలు అన్నారు..హామీలు చేసినవి ఎన్ని, ఒక్కో మహిళలకు 75 వేల బకాయిలు పడిందన్నారు.పెన్షన్ల పెంపు,కొత్త పెన్షన్ లు లేవు అన్నారు. ఈ ప్రభుత్వం ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత కాంగ్రెస్ మూటగట్టు కుందన్నారు.కళ్యాణ లక్ష్మీ తులం బంగారం, నిరుద్యో గులకు ఉద్యోగాలు ఏది ఇవ్వలేదన్నారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక చేసిన అప్పులు,అభివృద్ధి ఎంతో ప్రజలకు చెప్పాలనీ డిమాండ్ చేశారు.పాలమూ రు రంగారెడ్డి ప్రాజెక్ట్ జాతీయ హోదా అని మాట్లాడుతున్నారు.జూరాల నుంచి నార్లపూర్ కు అప్రోచ్ మార్చారనారు.మొదట రూపొందించిన ప్రాజెక్ట్ కానే కాదన్నారు.జూరాల నుంచి నీళ్లు తీసుకొని మహబూబ్ నగర్ పార్లమెంట్ తో పాటు రంగారెడ్డి జిల్లాకు నీళ్ళు ఇవ్వవచ్చు కదా.అన్నారు.పెండింగ్ ప్రాజెక్టులు ఎక్కడి గొంగళి అక్కడే ఉందన్నారు.రెండున్నర ఏళ్ళు అయిపోయింది ఇంకా ఎప్పుడూ చేస్తారు అనే ఆవేదన ప్రజల్లో ఉందన్నారు.పది వేల కోట్లు పెడితే మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లాలో మెజారిటీ గ్రామాల కు రోడ్లు వస్తాయనీ సీఎంగా ఉండి కనీసం అది కూడా చేయలేరా అని ప్రశ్నించారు.ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర నాయకులు కే .రతంగ్ పాండురెడ్డి,లక్ష్మీకాంత్ రెడ్డి,పగుడాకుల శ్రీనివాసులు ,జిల్లా బిజెపి అధ్యక్షుడు సత్య యాదవ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## జూనోటిక్ వ్యాధులపై అవగాహన అవసరం



**జడ్చర్ల, జూలై 6 (జనంసాక్షి) :** జంతువుల నుండి మనుషులకు వ్యాపించే జూనోటిక్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వెటర్నరీ సర్జన్ డాక్టర్ శ్రావణి పేర్కొన్నారు. కోడుగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన ప్రపంచ జూనోటిక్ డేలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు మారేపల్లి శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ శ్రావణి మాట్లాడుతూ కుక్కలు, పందులు, కోతులు, దోమల ద్వారా వ్యాధులు సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని హెచ్చరించారు. వ్యక్తిగత పరిశుభ్రత, పెంపుడు జంతువులకు సకాలంలో టీకాలు వేయించడం, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఈ వ్యాధులను సమర్థవంతంగా అరికట్టవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తాహేర్, రవికుమార్, కృష్ణయ్య, శశిధర్, స్లీవారెడ్డి, శరణప్ప, గోవర్ధన్, కర్ణాకర్, శ్రీనివాస్ శెట్టి, ఆంజనేయులు, మల్లికార్జునలింగం, అంజలి దేవి, బాలచంద్రుడు, లావణ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

# జంతువుల ద్వారా వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో. (జనంసాక్షి):** జంతువుల ద్వారా మనుషులకు వ్యాధులు సంక్రమించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి అని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. ఐడీఓసీ కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ జునోసిస్ దినోత్సవం నిర్వహించారు. జంతువులలో ఉండే వైరస్ మనుషుల్లోకి ప్రవేశిస్తాయని, అందుకే పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించాలని సూచించారు. వ్యాధి లక్షణాలు కనిపించగానే వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డిఎంహెచ్వో డా. మధుసూదన్, డిఆర్వో వసంత కుమారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**బాలలు బడిలో ఉండాలి: కలెక్టర్..**

బాలలు సమాజ సంపద. వారు పనుల్లో కాదు బడిలో ఉండాలి అని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. ఐడిఓసి కార్యాలయంలో ఆపరేషన్ ముస్కాన్-12 జిల్లా స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, తప్పిపోయిన, నిరాశ్రయ, భిక్షాటన చేస్తున్న పిల్లలను గుర్తించి రక్షించాలని ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రతి బిడ్డకు రక్షణ, విద్య, పునరావాసం కల్పించాలని చెప్పారు. బాలల సమస్యలపై 1098 కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు, డిఆర్వో, అదనపు ఎస్పీ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# 24 వరకు అంబేద్కర్ వర్సిటీ బీఎడ్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



**హనుమకొండ ప్రతినిధి జులై 6 (జనంసాక్షి) :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి నిర్వహించనున్న బి.ఎడ్ ప్రవేశాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విశ్వవిద్యాలయం వరంగల్ ప్రాంతీయ కేంద్రం సంచాలకులు ప్రొఫెసర్ సుంకరి జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ అభ్యర్థులు 1,000 దరఖాస్తు రుసుము చెల్లించి ఈ నెల 24వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 750రుసుముతో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్లు వెల్లడించారు. నిర్దేశిత గడువు తర్వాత కూడా 500 అపరాధ రుసుముతో ఈ నెల 26వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. ప్రవేశ పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్లను ఈ నెల 29వ తేదీ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. అర్హత కలిగిన అభ్యర్థులు గడువులోగా దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రొఫెసర్ సుంకరి జ్యోతి పేర్కొన్నారు. అనంతరం జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ప్రిన్సిపాల్ జ్యోతి వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ సామాజిక న్యాయం, సమానత్వం కోసం జీవితాంతం కృషి చేసిన మహోన్నత నాయకుడని అన్నారు. ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు.


# వారంలోగా పెండింగ్ అర్జీలను పరిష్కరించాలి

- ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యానికి తావివ్వొద్దు
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్



**హనుమకొండ ప్రతినిధి, జూలై 6 (జనంసాక్షి) :** ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన అర్జీల పరిష్కారంలో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా సంబంధిత శాఖల అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, ప్రతి అర్జీని ఓర్పుగా ఆలకించిన కలెక్టర్ వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు. ప్రజావాణి పోర్టల్‌లో గత సోమవారం వరకు నమోదై ఉన్న పెండింగ్ అర్జీలను శాఖల వారీగా సమీక్షించిన కలెక్టర్, వచ్చే సోమవారం నాటికి అన్ని అర్జీలను తప్పనిసరిగా పరిష్కరించాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా పరిష్కారం చూపని అధికారులపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, హాస్టళ్లలో దోమల నివారణ కోసం తలుపులు, కిటికీలకు మెష్ ఏర్పాటు చేయించాలని ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో మున్సిపల్, సంక్షేమం, వైద్య ఆరోగ్యం, మత్స్యశాఖ, గురుకులాలు, విద్య, వ్యవసాయం తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 263 అర్జీలు అందాయి. వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వర్చువల్ విధానంలో మండల తహసీల్దార్లకు కూడా ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్. రవి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, జిల్లా పరిషత్ ప్రధాన కార్యనిర్వహణ అధికారి శేషాద్రి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మేన శ్రీను, జిల్లా ప్రణాళిక అధికారి సత్యనారాయణరెడ్డి, ఇతర జిల్లా అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాను అడ్డుకున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర



**టేకుమట్ల, జులై 06 (జనంసాక్షి) :** టేకుమట్ల మండలం బూర్ణపల్లి గ్రామంలోని మానేరు వాగులో జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాపై ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి అందిన సమాచారం మేరకు భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి సంఘటన స్థలాన్ని సందర్శించారు. కొడవటంచ లక్ష్మీనరసింహా స్వామి దేవాలయ అభివృద్ధి పేరుతో అనుమతి లేకుండా వాగు నుంచి ఇసుక తరలిస్తున్న లారీలను ఆయన అడ్డుకుని అధికారులను ప్రశ్నించారు.

ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి పేరుతో ఇసుకను ప్రయివేట్ కాంట్రాక్టర్లకు కమిషన్లకు ఆశపడి దారాదత్తం చేస్తున్న తీరుపై మండిపడ్డారు. వాగులో నుంచి ఇసుక తవ్వకాలకు ఎవరి ప్రమేయంతో మీరు అనుమతి ఇచ్చారని తహసీల్దార్, సీఐలను ప్రశ్నించారు. అనుమతి లేకుండా భారీ స్థాయిలో ఇసుక రవాణా జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దురదృష్టకరమని విమర్శించారు. ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఇసుక మాఫియా విచ్చలవిడిగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని, ఇసుక తరలిస్తున్న లారీలను సీజ్ చేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజా సంపదను కొల్లగొట్టే అక్రమ ఇసుక దందాను బీఆర్ఎస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని స్పష్టం చేశారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి అక్రమాలను పూర్తిగా అరికట్టాలని కోరారు. లేకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజలను కలుపుకుని పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వెంట టేకుమట్ల, చిట్యాల, మొగుళ్ళపల్లి బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించాలి

- స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- భక్తుల అవసరాలకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- ఆలయాల భూముల రక్షణకు తక్షణమే చర్యలు తీసుకోవాలి



**స్టేషన్ ఘన్‌పూర్, జూలై 06 (జనంసాక్షి) :** నెల రోజులలో ఆలయాల అభివృద్ధిపై సమగ్ర నివేదిక అందించాలని, స్టేషన్ ఘనపూర్ నియో జకవర్గ పరిధిలోని ఆలయాల అభివృద్ధికి సమ గ్రమైన మాస్టర్ ప్లాన్ రూపొందించాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. హైదరాబాద్ లోని దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలోని జీడిక ల్, నవాబ్ పేట, చిల్పూర్, స్టేషన్ ఘనపూర్, మల్లికుదుర్ల ఆలయాల అభివృద్ధి పై కమిషనర్ హనుమంత రావుతో కలిసి దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ చైర్మన్లు, ఈఈ, ఈవో లతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ గతంలో ప్రిన్సిపల్ సెక్రటరీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆలయాల సమగ్ర అభివృద్ధికి వెంటనే మాస్టర్ ప్లాన్ రూపొం దించాలని అన్నారు. మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు ఆర్జేసి ఆధ్వర్యంలో ప్రత్యేక అధికారుల బృందా న్ని ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ మాస్టర్ ప్లాన్ లో భక్తుల అవసరలకు అనుగుణం గా అభివృద్ధి పనుల ప్రతిపాదనలు సిద్ధం చేయా లని చెప్పారు. అసంపూర్తిగా ఉన్న గర్భాలయం, ప్రాకారాలను వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. వచ్చే జాతర నాటికి కమ్యూనిటీ టాయిలెట్స్ నిర్మాణం చేయాలని అలాగే ఆఫీస్ కార్యాలయం, మీటింగ్ హాల్ తో పాటు 10రూములతో కూడిన జీ1 గెస్ట్ హౌస్ నిర్మాణం చేయాలని తెలిపారు. ఆలయ భూమి లో ఉన్న ప్రయివేట్ వ్యక్తుల ఇళ్లకు నోటీసులు ఇచ్చి వాటిని తొలగించాలని, ఆలయ పూజారి నివాసం కోసం వసతి గృహాన్ని పునర్ నిర్మించాల ని అన్నారు. జీడికల్ ఆలయ అభివృద్ధికి 5కోట్లతో మాస్టర్ ప్లాన్ రూపొందించాలని తెలిపారు. నవాబ్ పేట శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో కళ్యాణ మండపం అభివృద్ధికి ఇప్పటికే ప్రతిపాద నలు ఇప్పటికే ప్రభుత్వానికి పంపించినట్లు తెలిపారు. నవాబ్ పేట ఆలయ అభివృద్ధికి 3కోట్ల తో మాస్టర్ ప్లాన్ రూపొందించాలని అన్నారు. చిల్పూర్ - బుగులు వెంకటేశ్వర స్వామి దేవస్థాన సంబంధించి, వెంకటేశ్వర్ల పల్లి నుండి చిల్పూర్ దేవస్థానం వరకు రోడ్డు వెడల్పు చేయాలని అలాగే గుట్ట ప్రాంతంలోని 1కిలోమీటర్ వరకు రెండు వైపులా డ్రైనేజి నిర్మాణంతో పాటు సెంట్ర ల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఈశన్యం లో రిటైనింగ్ వాల్ నిర్మాణం, కళ్యాణ మండపం అభివృద్ధి, పాకశాల, అన్నదాన సత్రం, కళ్యాణ కట్ట, కాటేజెస్, ఈవో కార్యాలయం, టాయిలెట్స్ నిర్మాణం చేపట్టాలని తెలిపారు. అలాగే గుట్ట ముందు భాగంలో ఉన్న ఆక్రమనల ను తొలగించాలని సూచించారు. చిల్పూర్ ఆలయ అభివృద్ధికి 10కోట్లతో మాస్టర్ ప్లాన్ రూపొందించాలని అన్నారు. స్టేషన్ ఘనపూర్ శ్రీ తిరుమలనాథ స్వామి దేవస్థానం కు సంబంధించి అక్రమణలకు గురై దేవస్థాన భూమిలో ఉన్న ఇళ్లను, షాపులను తొలగించాలని అన్నారు. ఆలయంలో ఉన్న కోనేరు అభివృద్ధి చేయాలని తెలిపారు. జాతీయ రహదారి కోసం ఇచ్చిన భూమికి సంబందించిన నష్ట పరిహారం ఆర్డివో వద్ద పెండింగ్ లో ఉన్న మొత్తాన్ని వెంటనే ఆల యానికి అందించాలని అలాగే దేవాలయానికి సంబందించిన ఆభరణాలకు పంచనామా నిర్వ హించి ఆలయానికి అప్పగించాలని సూచించా రు. ఆలయ అభివృద్ధికి 2కోట్లతో మాస్టర్ ప్లాన్ రూపొందించాలని తెలిపారు. మల్లికుదుర్ల గట్టు మల్లికార్జున స్వామి దేవస్థానం సిజీఎఫ్ నిధుల ద్వారా మంజూరు అయిన పనులను వెంటనే పూర్తి చేయాలని అన్నారు. అలాగే భక్తుల విరాళా లతో చేపట్టిన అభివృద్ధి పనులను కూడా త్వరిత గతిన పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు, ఆలయ కమిటీ చైర్మన్లు, పొట్లపల్లి శ్రీధర్ రావు, నీల నర్సింహులు, ఏలే మూర్తి, ఈఈలు, ఈవోలు, ఇతర దేవాదాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి

- క్షేత్రస్థాయిలో విచారణ త్వరగా చేయాలి
- గ్రీవెన్స్ వినతులు పెండింగ్ లో ఉండొద్దు
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ ప్రతినిధి, జులై 06(జనంసాక్షి) :** జిల్లా లోని వివిధ ప్రాంతాల నుండి వచ్చి తమ సమస్య ల పైన వినతులను సమర్పించే ప్రజలకు నమ్మకం కలిగేలా వారి సమస్యలను త్వరితగతిన పరిష్కారించేందుకు జిల్లా అధికారులు కృషి చేయాలనీ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. సోమవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోంతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజల నుంచి కలెక్టర్ స్వయంగా ఫిర్యాదులను తీసుకుని..వారి సమస్యలను అడిగి తెలుసుకుని... సమస్య పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ప్రజల వినతులను పెండింగ్‌లో లేకుండా దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని, పారదర్శకంగా ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం అని స్పష్టం చేశారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా.. వారి అర్జీలను త్వరగా పరిష్కరించాలని, సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంబంధిత శాఖల జిల్లా అధికారులకు సూచించారు. ఈనాటి గ్రీవెన్స్ కి 396 వినతులు రాగ... అందులో కొన్నింటి వివరాలు. జనగాం మండలం వెంకిర్యాల గ్రామానికి చెందిన రామగుండం పద్మ అనే మహిళ ఇందిరమ్మ ఇళ్ళు కోసం దరఖాస్తు సమర్పించింది. దేవరోప్పుల మండలం నిర్మల గ్రామానికి చెందిన అంగల మనోహర్ రెడ్డి అనే వ్యక్తి తనకు చెందిన భూమి... పూర్తిగా పాస్ బుక్ లో నమోదు కాలేదని...సర్వే ప్రక్రియ పూర్తి అయిన భూమికి సంబందించిన వివరాలను పాస్ బుక్ లో నమోదు చేయాలనీ కోరారు. జనగాం మండలం ఇప్పగూడెం కి చెందిన శ్రీకాంత్.. తను పేదవాడిని అలాగే అందు దని పేర్కొంటూ... అంత్యోదయ కార్డు కావాలని కోరారు బచ్చన్నపేట మండలం కొన్నే గ్రామానికి చెందిన లక్ష్మయ్య తనకు చెందిన భూమి ని వారసత్వ పట్టా ప్రకారం తన పేరు మీదకు మార్చాలని వినతి సమర్పించాడు ఈ ప్రజావాణిలో డీఆర్డీఓ భాస్కర్, గృహ నిర్మాణ శాఖ పీడీ మాత్రు నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ప్రాధాన్యతగా పరిష్కరించాలి

- కలెక్టర్ రాహుల్ శర్మ

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో. (జనంసాక్షి):** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను అధికారులు ప్రాధాన్యతగా తీసుకుని పరిష్కరించాలి అని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. ఐడిఓసి కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యలు విని 112 దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిశీలన అవసరమైన దరఖాస్తులపై వెంటనే నివేదికలు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డిఆర్వో వసంత కుమారి, శిక్షణా డిప్యూటి కలెక్టర్ నవీన్ రెడ్డి, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మంత్రి అజారుద్దీన్ ను కలిసిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

- ఇచ్చోడ షాదీఖాన మంజూరు చేయాలి
- పోడు భూముల సమస్యలు పరిష్కరించాలి
- ఖబరస్తాన్, ఈద్గాలకు కాంపౌండ్ వాల్ లు మంజూరు చేయాలి



**బజార్హత్నూర్/ఇచ్చోడ జూలై 06 (జనంసాక్షి) :** ఇచ్చోడ, గుడిహత్నూర్ మండలంలోని కేషవపట్నం, బాబ్జిపెట్, గుండాల, లింగాపూర్, జోగిపేట్, ప్రజలు ఎదుర్కొంటున్న పోడు భూముల సమస్యల పరిష్కారం కొరకు సోమవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్ ని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వినతిపత్రంలో పేర్కొన్న సమస్యలు నియోజకవర్గంలోని పోడు సాగుదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను మంత్రి దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే, అర్హులైన రైతులకు అటవీ హక్కుల చట్టం ప్రకారం హక్కులు కల్పించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. అలాగే మైనార్టీ వర్గాలకు సంబంధించిన ఖబరస్తాన్, ఈద్గాలకు కాంపౌండ్ వాళ్ళు మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా ఇచ్చొడ మండల కేంద్రంలో షాదీఖాన ఏర్పాటు కొరకు ప్రభుత్వం వద్ద ప్రతిపాదన పెట్టడం జరిగిందని దాన్ని కూడా అధికారిక మంజూరు చేయాలని కోరారు. మంత్రి అజారుద్దీన్ కు ఎమ్మెల్యే వినతిపై సానుకూలంగా స్పందిస్తూ సంబంధిత అధికారులతో సమీక్షించి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేషవపట్నం సర్పంచ్ అల్తాఫ్, సదర్ ఇబ్రహీం, సాదిక్, షేక్ సాదిక్, జాకీర్, ఖమర్, జూమ్మ తదితరులు ఉన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, జూలై 6 (జనంసాక్షి) :** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశం మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. నెన్నెల మండలం గంగారం గ్రామానికి చెందిన పాగిడి శోభ తాను ఏ ఎన్ ఎం, ఇంటర్, ఎం పి హెచ్ డబ్ల్యు అర్హత కలిగి ఉన్నానని, ప్రభుత్వ ఆసుపత్రిలో ఉపాధి కల్పించి ఆదుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి పట్టణం కాంట్రాక్టర్ బస్తీకి చెందిన కొలిపాక శ్రీనివాస్ తాము నివసిస్తున్న ప్రాంతంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం గోలేటి టౌన్షిప్ ప్రాంతానికి చెందిన బాసపోయిన రవీంద్ర కుమార్ తాను మంచిర్యాల జిల్లాలోని గరిమెళ్ళ గ్రామంలో కొనుగోలు చేసిన భూమికి ముటేషన్ ద్వారా పట్టా జారీ చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. లక్షెట్టిపేట మండలం చందారం గ్రామానికి చెందిన రాచర్ల సంతోష్ తన తండ్రి పేరిట గ్రామ శివారులో భూమి ఉందని, ఆయన మరణించారని, ఇదే అదనుగా కొందరు భూమిని అక్రమంగా ఆక్రమించి పట్టా చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, ఈ విషయమై తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. తెలంగాణ లైబ్రరీ సైన్స్ విద్యార్థులు - నిరుద్యోగుల సంఘం ప్రతినిధులు తమ దరఖాస్తులలో జిల్లా కేంద్ర గ్రంథాలయం, శాఖా గ్రంధాలయాలలో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలో లైబ్రరీ అండ్ పోస్టులను ప్రత్యక్ష పద్ధతిన డి ఎస్ సి ద్వారా భర్తీ చేయాలని కోరారు. భారత విద్యార్థి ఫెడరేషన్ ప్రతినిధులు ప్రభుత్వ పాఠశాలలలో సమస్యలు పరిష్కరించడంతో పాటు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించాలని దరఖాస్తు అందజేశారు. హాజీపూర్ మండలం నమ్నూర్ గ్రామపంచాయతీ చందనాపూర్ గ్రామవాసులు తమ గ్రామంలోని ఆర్ అండ్ ఆర్ కాలనీలో 136 రేషన్ కార్డులు ఉన్నాయని, స్థానికంగా రేషన్ షాప్ ఏర్పాటు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జైపూర్ మండలం రామారావుపేట గ్రామానికి చెందిన కడియాల పద్మ తనకు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకొనుటలో ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆలస్యం జరిగిందని, ఇప్పుడు ఇల్లు నిర్మించుకునేందుకు అనుమతి అందించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో 79 దరఖాస్తులు అందాయని, ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారుల సమన్వయంతో క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# అలసత్వం వహిస్తే వేటే

- జిల్లా కలెక్టర్ రాజార్షి షా



**మావల, జూలై 07 (జనంసాక్షి):** ప్రజావాణిలో అందించే అర్జీలపై అధికారులు అలసత్వం వహిస్తే వేటు తప్పదని, అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోనీ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. వారి సమస్యలను ఎంతో ఓపికగా ఆలకించిన ఆయన వారి అర్జీలను సంబంధిత శాఖ అధికారులకు అందజేస్తూ వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరిస్తూ బాధితులకు భరోసా కల్పించాలని అదేశించారు. 94 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఆర్ఎస్ చిత్రు, రాజేశ్వర్, డిఆర్ఓ స్రవంతి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# హనుమకొండ పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన సీపీ శ్వేత




**హనుమకొండ ప్రతినిధి జూలై 6 (జనంసాక్షి) :** ఇటీవల నూతనంగా వరంగల్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎన్. శ్వేత సోమవారం హనుమకొండ పోలీస్ స్టేషన్ ను తొలిసారి ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించి, ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించి రసీదు ఇవ్వాలని పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. రాత్రి సమయాల్లో అత్యవసర ఫిర్యాదులపై అప్రమత్తంగా ఉండాలని, శాఖాపరమైన ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో స్వీకరించి స్టేషన్ అడ్మిన్ ఎస్ఐ పర్యవేక్షించాలని సూచించారు.

## ప్రజావాణిలో వచ్చిన ప్రతి వినతికి నిర్దేశిత గడువులో పరిష్కారం చూపాలి

● జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలై 6 (జనంసాక్షి) :** ప్రజావాణిలో ప్రజలు సమర్పించే ప్రతి వినతిని అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపేలా సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐ డి ఓ సి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతితో కలిసి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వినతులు, ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు.

### ప్రజావాణిలో స్వీకరించిన కొన్ని వినతులు

సుజాతనగర్ మండలం సింగభూపాలెం గ్రామానికి చెందిన సంఘం నాగేశ్వరరావు, తన తండ్రి మరణించడంతో ఆయన పేరుపై ఉన్న పట్టా భూమిని వారసత్వ హక్కు ప్రకారం తన పేరుకు మార్చాలని చేసిన వినతిని జిల్లా కలెక్టర్ పరిశీలించి, తదుపరి చర్యల కోసం సంబంధిత సెక్షన్ సూపరింటెండెంట్‌కు ఎండార్స్ చేశారు.

టేకులపల్లి మండలం రాజు తండా గ్రామానికి చెందిన అజ్మీర రవి, కొత్తగూడెం--ఇల్లందు జాతీయ రహదారి విస్తరణలో తన ప్రహరీ గోడతో పాటు మూడు గదుల ఇల్లు కోల్పోతున్నందున తగిన నష్టపరిహారం మంజూరు చేయాలని చేసిన దరఖాస్తును పరిశీలించి, అవసరమైన చర్యల కోసం టేకులపల్లి తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు.

ఇల్లందు మండలం ఇందిరానగర్‌కు చెందిన పోతరాజు రమేష్, గత



నాలుగు సంవత్సరాలుగా తీవ్రమైన శారీరక, మానసిక వైకల్యంతో బాధపడుతూ, 50 శాతం వైకల్యం ఉన్నందున కుటుంబానికి ఆర్థిక ఆధారం లేక చికిత్స భారంగా మారిందని పేర్కొంటూ వికలాంగుల పింఛన్ మంజూరు చేయాలని చేసిన దరఖాస్తును జిల్లా కలెక్టర్ పరిశీలించి, తదుపరి చర్యల కోసం సంబంధిత అధికారికి ఎండార్స్ చేశారు. బూర్గంపహాడ్ మండలం ఎదుళ్ల చెరువు గ్రామానికి చెందిన దుర్గాల వెంకటేశ్వర్లు, తాను 2000 సంవత్సరం నుంచి సాగు చేస్తున్న 1 ఎకరం 50 సెంట్ల పోడు భూమిలో సాటిలైట్ పాయింట్ మంజూరైందనే కారణంతో అధికారులు సాగు చేయకుండా అడ్డుకుంటున్నారని, ఆ భూమికి సంబంధించి సర్వే కూడా పూర్తయిందని పేర్కొంటూ వ్యవసాయం కొనసాగించేందుకు అనుమతి కల్పించాలని చేసిన వినతిని జిల్లా కలెక్టర్ పరిశీలించి, తగు చర్యల కోసం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారికి ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

● జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**ఖమ్మం కార్పొరేషన్, జూలై 6 (జనం సాక్షి) :** ప్రజావాణిలో ప్రజలు సమర్పించే దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు సత్వరమే పరిశీలించి, పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలు సమర్పించిన ప్రతి దరఖాస్తును సానుకూల దృక్పథంతో పరిశీలించి, అర్హత ఉన్న వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఖమ్మం అర్బన్ మండలం 15వ డివిజన్‌కు చెందిన సయ్యద్ రహమత్ బీ తాను అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నానని, సొంత ఇంటి స్థలం కూడా లేదని, డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించగా, ఖమ్మం మున్సిపల్ కమీషనర్ కు పంపిస్తూ, నిబంధనల మేరకు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. తిరుమలాయపాలెం మండలానికి చెందిన భానురేఖ టేకులపల్లి మహిళా ప్రాంగణంలో ఏఎన్ఎం కోర్సు పూర్తి చేసినప్పటికీ, ఏఎన్ఎం సర్టిఫికెట్ రిజిస్ట్రేషన్ విషయంలో అధికారులు స్పందించడం లేదని దరఖాస్తు సమర్పించగా, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారికి విచారించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నేలకొండపల్లి మండలం రెవెన్యూ గ్రామానికి చెందిన



లక్కం వెంకన్న, బక్కయ్య, శ్రీనివాస్ లు సర్వే నంబర్లు 993లో 23 గుంటలు, 616లో 15 గుంటలు, 1004లో 12 గుంటలు, 1005లో 12 గుంటల భూమి ఉందని, సాధా బైనామా కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ పాస్ పుస్తకాలు అందలేదని తెలపగా, సంబంధిత తహసీల్దార్‌కు పంపిస్తూ విచారించి నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రఘునాథపాలెం మండలం మంచుకొండ గ్రామానికి చెందిన వంగర రమాదేవి తన కుమార్తెకు కళ్యాణలక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ మంజూరు కాలేదని తెలపగా సంబంధిత తహసీల్దార్‌కు పంపిస్తూ అర్హత మేరకు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, డిఆర్ఓ సిహెచ్ రామ్మూర్తి, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ అడ్మిషన్లకై దరఖాస్తుల ఆహ్వానం

సూర్యాపేట, జూలై 6 (జనంసాక్షి) : సూర్యాపేట జిల్లా కేంద్రానికి సమీపంలోని బాలెంలలో గల తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను ఎస్సీ,ఎస్టీ విద్యార్థినుల కోసం డిగ్రీ అడ్మిషన్ల కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.నీల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ కళాశాలలో బీఏ (హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్), బీకాం (కంప్యూటర్ అప్లికేషన్స్), బీకాం (జనరల్), బీఎస్సీ (మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ), బీఎస్సీ (మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, డేటా సైన్స్), బీఎస్సీ (బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ), బీఎస్సీ (మైక్రోబయాలజీ, జువాలజీ, కెమిస్ట్రీ) గ్రూపులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థినులు సంబంధిత సర్టిఫికెట్లతో నేటి నుండి కళాశాలలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అడ్మిషన్ల కోసం సంప్రదించవచ్చని తెలిపారు. అడ్మిషన్ కోసం టీసీ, ఎస్ఎస్సీ మెమో, ఇంటర్మీడియట్ షార్ట్ మెమో, బోనఫైడ్ సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, ఐదు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, దోస్త్ ఐడీతో ఆసక్తి గల విద్యార్థినులు కళాశాలలో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 7995010681లో సంప్రదించవచ్చని తెలిపారు.

## కొడుకును హత్య చేసిన తండ్రి అరెస్ట్



**కల్లూరు, జూలై 6 (జనం సాక్షి) :** చెడు వ్యసనాలకు బానిసై డబ్బుల కోసం ఇల్లు అమ్మాలని ప్రయత్నిస్తుండగా భార్య కొడుకు అడ్డుపడుతున్నారని కొడుకుని చంపితే తనకు ఎదురు లేదని పథకం ప్రకారం హత్య చేసిన తండ్రి సీతారాములును పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సత్తుపల్లి రూరల్ సీఐ ముత్తిలింగం, ఎస్ ఐ డి హరిత, హత్య సంఘటనకు సంబంధించివివరాలు వెల్లడించారు. పట్టణంలోని అంబేద్కర్ నగర్ కాలనీకి చెందిన కొత్తపల్లి సీతారాములు చెడు వ్యసనాలకు బానిసయి, వివిధ నేరాలకు పాల్పడుతూ పలుమార్లు జైలుకు వెళ్లి వచ్చాడు. కొత్తపల్లి సీతారాములు తన వద్ద చెడు వ్యసనాలకు సరిపడ డబ్బులు లేకపోవడంతో అతను కుటుంబము తో సహా ఉంటున్న ఇల్లు అమ్మకానికి బేరాలు తీసుకొస్తుండగా అతని భార్య కుమారుడు కిరణ్ కుమార్ఒప్పుకోకపోవడంతో పలుమార్లు సీతారాములు కుమారుడిని ఇల్లు ఖాళీ చేయమని చెప్పటం జరిగిందన్నారు. అయినా వినకపోవడంతో, కుమారుడిని చంపితేనే అతడికి ఇల్లు అమ్ముకోవడం వీలు పడుతుందని భావించి, ముందస్తు ప్లాన్ ప్రకారం ముద్దాయి సీతారాములు ఈనెల 3 తేదీన సాయంత్రం తన కుమారుడిని కల్లూరు లో ఉన్న ఒక బెల్ట్ షాప్ కి తీసుకువెళ్లి మద్యం తాపించి, మరలా ఇంటికి తీసుకొని వెళ్ళాడు. కుమారుడు కిరణ్ మద్యం మత్తులో మంచంపై పడుకొని గాఢ నిద్రలో ఉండగా, నిందితుడు అనుకున్న ప్లాన్ ప్రకారం కిరణ్ కుమార్ తలపై రోకలి బండతో గట్టిగా మోది, గాయపరచగా కిరణ్ కుమార్ రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతుండగా, అతడు చనిపోయాడని భావించిన సీతారాములు తన ఆటోలో అక్కడి నుంచి పరారైనాడు. గత రెండు రోజులుగా ఆంధ్రప్రదేశ్లోని తిరువూరు, విస్సన్నపేట ఏరియాలలో తిరుగుతూ సోమవారం కల్లూరు వైపునకు ఆటోలో వస్తుండగా నమ్మదగిన సమాచారం మేరకు అతని కోసం వెతుకుతున్న పోలీస్ బృందానికి ఉదయం 10:30గంటల సమయంలో ముగ్గు వెంకటాపురం గ్రామము వద్ద అతనిని అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన నేరం ఒప్పుకున్నాడని తెలిపారు . అతని వద్ద నుంచి ఆటో నేరానికి ఉపయోగించిన రోకలి బండ, కత్తిని, మధ్యవర్తుల సమక్షంలో సీజ్ చేసి ముద్దాయిని అదుపులోకి తీసుకోవడం జరిగింది. ముద్దాయిని రిమాండ్ నిమిత్తం సత్తుపల్లి జడ్జి ముందు ఆధారపరచగా రిమాండ్ కి తరలించినట్లు తెలిపారు. కేసును చేదించిన ఎస్సై డి. హరిత ని పోలీస్ కానిస్టేబుల్ సిబ్బందిని సిఐ అభినందించారు.

## భద్రాచలం సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ



**భద్రాచలం, జూలై 06 (జనంసాక్షి) :** భద్రాచలం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యుడు పోరిక బలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు తెలిపారు. సోమవారం భద్రాచలంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాబోయే గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఈ సమావేశంలో భద్రాచలం గ్రామ సర్పంచ్ పూనం కృష్ణ, రెండో వార్డు సభ్యుడు బంబోతుల రాజీవ్, కాంగ్రెస్ నాయకులు రత్న రమాకాంత్, భీమవరపు వెంకటరెడ్డి, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఓటు పరిరక్షణకు బీఎల్ఏలు అప్రమత్తంగా పనిచేయాలి



**చింతపల్లి, జూలై 6 (జనంసాక్షి) :** ఎస్ఐఆర్ ఓటరు జాబితా సవరణలో అర్హుల ఓటు రక్షణకు బీఎల్ఏలు, కాంగ్రెస్ నాయకులు బాధ్యతగా పనిచేయాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. చింతపల్లి మండల కేంద్రంలో ఎస్ఐఆర్ ఓటరు జాబితా సవరణలో అర్హుల ఓటు సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ బిఎల్ఓలతో సమన్వయం చేసుకుంటూ ప్రతి బూత్‌లో ఓటరు జాబితాను పరిశీలించాలని, అర్హుల పేర్లు తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఓటర్ల వివరాలు సరిచూసి బూత్ స్థాయిలో పటిష్ట వ్యవస్థను నిర్మించాలని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని, ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ సిద్ధాంతాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో నల్లగొండ జిల్లా అధ్యక్షులు పున్న కైలాష్ నేత, మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు జటావత్ హరి నాయక్, మాజీ ఎంపీపీలు కొండూరు భవాని పవన్ కుమార్, రవి నాయక్, మాజీ సర్పంచ్ ముచ్చర్ల గిరి, మాజీ అధ్యక్షులు అంగిరేకుల నాగభూషణం, మాజీ జడ్పీటీసీలు జంగిటి నర్సింహా, మాస భాస్కర్, మాజీ ఎంపీటీసీ ఎరుకల వెంకటయ్య గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దాసరి శ్రీనివాస్ యాదవ్, నియోజకవర్గ ఎస్ ఐ ఆర్ కోఆర్డినేటర్ కొర్ర రాంసింగ్ నాయక్, సర్పంచ్లు కసారపు శ్వేత శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ ఆరు మొక్కలు పంపిణీలో వేగం పెంచాలి

● జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, జూలై 6 (జనంసాక్షి) :** జిల్లాలో హరితహారం కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని, ప్రతి ఇంటికీ ఆరు మొక్కల చొప్పున పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారంపై కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హరితహారంలో భాగంగా ఇచ్చే మొక్కలు అన్ని రకాలు ఉండేలా చూడాలని, ప్రజలు నాటుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. పర్యావరణాన్ని కాపాడుకోవడమే లక్ష్యంగా ఊరూరా పచ్చదనం పరుచుకోవాలని పిలుపునిచ్చారు. అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని ఆదేశించారు. కేవలం మొక్కలు నాటడమే కాకుండా వాటిని కంటికి రెప్పలా కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పంచాయతీ రాజ్, మున్సిపాలిటీలు, అటవీ శాఖ, వ్యవసాయం, నీటి పారుదల శాఖలు సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఖాళీ ప్రదేశాలు ఎక్కడ ఉన్నా మొక్కలు నాటేందుకు సిద్ధం చేయాలన్నారు. స్కూళ్లలో పండ్ల మొక్కలు, హాస్టళ్లలో స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని, విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించేలా విద్యాశాఖ చర్యలు తీసుకోవాలన్నారు. హాస్టల్ పరిసరాల్లో ఎకో క్లబ్ లను యాక్టివేట్ చేసి మొక్కల సంరక్షణ బాధ్యతను అప్పగించాలని సూచించారు. కేవలం ప్రభుత్వ కార్యాలయాలే కాకుండా పెట్రోల్ బంకులు, రైస్ మిల్లులు, పరిశ్రమలు కూడా ఈ వనమహోత్సవంలో భాగస్వాములు కావాలని ఆదేశించారు. ప్రతి ఇండస్ట్రీ మేనేజ్‌మెంట్ తమ పరిసరాల్లో మెగా ప్లాంటేషన్ డ్రైవ్ చేపట్టాలని స్పష్టం చేశారు. మొక్కలు నాటడంలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. మొక్కల పంపిణీకి సంబంధించి మున్సిపల్ అధికారులు ముందస్తు ప్లానింగ్‌తో ఉండటంపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. పోస్టర్లు, ప్రచార చిత్రాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న తీరు బాగుందని మెచ్చుకున్నారు. ఇదే ఉత్సాహంతో క్షేత్రస్థాయిలో పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, జడ్పి సీఈవో శిరీష, హౌసింగ్ పిడి సిద్ధార్థ్, డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, డిపిఓ యాదగిరి, సిపిఓ కిషన్, డిఏఓ శ్రీధర్ రెడ్డి, డిఎఫ్ఓ దామోదర్ రెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి



**సూర్యాపేట ప్రతినిధి, జూలై 6 (జనంసాక్షి) :** ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా, డివిజన్ స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పాత ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజు, జడ్పీ సీఈఓ శిరీష, డీపీఓ యాదగిరి, డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, హౌసింగ్ పిడి సిద్ధార్థ్, డిఎఫ్ఓ దామోదర్ రెడ్డి, సిపిఓ కిషన్, డీఈఓ అశోక్ , సంక్షేమ అధికారులు నరసింహారావు, దయానందరాణి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, డిజిటలైజేషన్‌ను వేగవంతం చేయాలి

**ఖమ్మం కార్పొరేషన్, జూలై 6 (జనం సాక్షి) :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు/ జిల్లా ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ కార్యక్రమ పురోగతిని సమీక్షించారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాధపురం నుండి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి వీడియో సమావేశంలో పాల్గొనగా, జిల్లా కలెక్టరేట్ నుండి మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య పాల్గొన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూలి గ్రామీణ ప్రాంతాల్లో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ దాదాపు పూర్తయిందని, మేడ్చల్, హైదరాబాద్, రంగారెడ్డి వంటి పట్టణ ప్రాంతాల్లో పంపిణీ ఆశించిన స్థాయిలో లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారంలోగా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఇళ్లకు వెళ్లిన సమయంలో తాళం వేసి ఉంటే వాటిని 'అబ్సెంట్'గా నమోదు చేయాలని, అవసరమైతే తర్వాత మరోసారి సందర్శించి ఫారాలను అందజేయాలని సూచించారు. అందజేసిన ప్రతి ఎన్యూమరేషన్ ఫారాన్ని బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) తిరిగి సేకరించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా డిజిటలైజేషన్ ప్రక్రియను రాష్ట్ర వ్యాప్తంగా వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాన్ని ఎలా పూరించాలో వివరించడంలో ఇబ్బంది పడుతున్న బీఎల్‌వోలకు సూపర్‌వైజర్లు సహకరించాలని, ఎన్నికల నమోదు అధికారులు (ఈఆర్‌వోలు) సూపర్‌వైజర్ల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అన్ని విధాలా చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి కలెక్టర్ వివరించారు ఈ సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ అన్సారీ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మణుగూరు నూతన పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించిన డీజీపీ సివి ఆనంద్

**మణుగూరు, జూలై 6 (జనంసాక్షి) :** శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజా సేవలో పోలీసులు నిరంతరం పని చేస్తారని తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి) సి వి ఆనంద్ అన్నారు. సోమవారం మణుగూరు మండలంలోని అంబేద్కర్ సెంటర్లో నిర్మించిన నూతన రక్షక భటులు నిలయాన్ని ప్రారంభించారు. ముందుగా ఐజి చంద్రశేఖర్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యే డీఎస్పీ రవీందర్ రెడ్డి సిఐ లు పుష్పగుచ్చం అందజేసి వేదమంత్రాలు మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికారు. అనంతరం కార్యాలయంలోని ఎస్ హెచ్ ఓ ఇతర గదులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ముందుగా మణుగూరు పట్టణ ప్రజలకి పోలీసు వారు తరపున కృతజ్ఞతలు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ, సాంకేతికత ప్రాధాన్యత ఫ్రెండ్లీ పోలీసింగ్ సమస్యలను పరిష్కరించవచ్చని అన్నారు. సింగరేణి, బీటీపీఎస్ పరిశ్రమలు కలిగిన మణుగూరు వంటి కీలక ప్రాంతంలో శాంతిభద్రతలను కాపాడటమే పోలీసుల ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. నూతన భవనంలో అత్యాధునిక వసతులు, సిసిటివి నెట్‌వర్క్ అనుసంధానం మెరుగైన కమ్యూనికేషన్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఎలాంటి భయం లేకుండా పోలీస్ స్టేషన్‌కు వచ్చి తమ సమస్యలను చెప్పుకునేలా వాతావరణం ఉండాలని, బాధితులకు తక్షణ న్యాయం జరిగేలా సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. మహిళలు, బాలల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా నిరంతరం నిఘా కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

### మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం

మాదక ద్రవ్యాలపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉక్కు పాదం మోపింది. రాష్ట్రంలో నక్సల్స్, మావోయిస్టులను, మట్టు పెట్టామని, ప్రస్తుతం మాదక ద్రవ్యాలపై దృష్టి పెట్టామని, ఈ సమస్యను తీవ్రంగా పరిగణిస్తున్నామని ఇది మన సమాజాన్ని పూర్తిగా వినాశనం చేసే విధంగా ఉంది. దీనికోసం ఈగల్ సంస్థ ఏర్పాటు చేసి హోంగార్డు నుంచి డిజిపి వరకు డ్రగ్స్ పై పోరాటం చేస్తోంది. భవిష్యత్తు తరాలవారికి మంచి జీవితాన్ని అందించేందుకు మా వంతు కృషి చేస్తున్నామని తెలిపారు. డ్రగ్స్ పై ఎప్పటికప్పుడు నిఘా పెట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

### ప్రత్యేక కృతజ్ఞతలు

మణుగూరు మండలంలో జనాభా ఎక్కువగా ఉండటం స్థానిక పోలీస్ స్టేషన్ కు సరైన వసతులు విశాలమైన భవనం లేకపోవడం వల్ల విధి నిర్వహణలో సమస్యలు తలెత్తే వాటిని దృష్టిలో పెట్టుకొని నూతన పోలీస్ స్టేషన్ నిర్మించాలని ఆలోచనతో మొదలుపెట్టామని కొంత నిర్మాణం చేపట్టిన తర్వాత



నిధుల కొరతతో నిలిచిపోయింది. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ప్రత్యేక చొరవతో స్థానిక సింగరేణి సంస్థ తోడ్పాటు ప్రజల సంపూర్ణ సహకారంతో పోలీస్ స్టేషన్ ప్రారంభించుకున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐజి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీ బలరాం నాయక్. శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు. జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు. సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట , ఐటీడీఏ పీవో రాహుల్, డి.ఎస్.పి రవీందర్ రెడ్డి, సీఐ నాగబాబు, సీఐ వెంకటేశ్వర్లు ఎస్సైలు, పోలీస్ అధికారులు, సింగరేణి జిఎం దుర్గం రామచందర్, ఏజీఎం రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.




# త్వరలో మొబైల్ రీఛార్జ్‌లు భారం..

### 12-15% టారిఫ్‌లు పెరిగే ఛాన్స్!

**న్యూఢిల్లీ:**ఫోన్ రీఛార్జ్ ప్లాన్ ధరలను మరోసారి పెంచేందుకు టెలికాం కంపెనీలు సిద్ధమవుతున్నాయి. మొబైల్ టారిఫ్‌లు 12-15 శాతం పెంచే అవకాశం ఉందని సెంట్రమ్ ఇన్‌స్టిట్యూషనల్ రీసెర్చ్ వెల్లడించింది. టెలికాం మార్కెట్‌లో పోటీ తగ్గడంతో పెంపునకు అనుకూల పరిస్థితులు నెలకొన్నాయని అభిప్రాయపడింది. రానున్న 3-4 నెలల్లో ఈ పెంపు ఉండొచ్చని అంచనా వేసింది. 5జీ నెట్‌వర్క్ విస్తరణ కోసం చేసిన ఖర్చును తిరిగి రాబట్టడానికి టెలికాం కంపెనీలు త్వరలో ఛార్జీలు పెంచొచ్చని ఇప్పటికే అంచనాలున్నాయి. ఈ క్రమంలో సెంట్రమ్ కూడా ఇదే తరహా అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.

దేశీయ టెలికాం మార్కెట్‌లో రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్ కంపెనీలు తమ హవాను కొనసాగిస్తున్నాయి. ప్రతి నెలా కొత్త సబ్‌స్క్రైబర్లను ఆకర్షించడంలో ముందు వరుసలో ఉంటున్నాయి. మరో ప్రైవేటు టెలికాం కంపెనీ వొడాఫోన్ ఐడియా కూడా కొత్త యూజర్లను చేర్చుకుంటున్నప్పటికీ.. జియో, ఎయిర్‌టెల్‌తో పోల్చినప్పుడు ఈ అంతరం ఎక్కువగా ఉంటోంది. త్రైమాసిక ప్రాతిపదికన చూసినప్పుడు జియోకు కొత్తగా సగటున 70 లక్షల మంది చందాదారులు చేరొచ్చని, భారతీ ఎయిర్‌టెల్‌ను 50 లక్షల మంది ఎంచుకోవచ్చని పేర్కొంది. వొడాఫోన్ ఐడియాలో 2 లక్షల సబ్‌స్క్రైబర్లు చేరొచ్చని నివేదిక తెలిపింది.దేశంలోని 90 శాతానికి పైగా జిల్లాల్లో జియో, ఎయిర్‌టెల్ 5జీ నెట్‌వర్క్‌ను అందిస్తున్నాయి. వొడాఫోన్ ఐడియా కూడా దాదాపు 100 నగరాల్లో తన 5జీ సేవలను విస్తరించింది. వినియోగదారులు 2జీ నుంచి 4ఉ, 5ఉ నెట్‌వర్క్‌లకు మారుతుండడం, పోస్టుపెయిడ్ యూజర్లు పెరుగుతుండడంతో టెలికాం కంపెనీల సగటు ఆదాయం (ఒఖీఖఐ) కూడా మెరుగు కానుందని నివేదిక పేర్కొంది. జూన్ త్రైమాసికంలో ఒఖీఖఐ 1-1.5% పెరుగుతుందని అంచనా వేసింది. 4జీ, 5జీ వినియోగం పెరుగుతుండటంతో డేటా వినియోగం కూడా గణనీయంగా పెరగనుందని తెలిపింది.




# గరిష్ఠాల నుంచి స్టాక్స్ సగానికి పతనం..

## అందరి చూపూ ఐటీ ఫలితాలపైనే!

భారత జీడీపీకి పెద్ద మొత్తంలో తోడ్పాటునంది ఒచడంతో పాటు, ఎక్కువ సంఖ్యలో ఉద్యోగాలు కల్పిస్తున్న రంగం ఐటీ. ప్రపంచంలోని వివిధ రంగాలకు సాంకేతిక పరిష్కారాలను అందిస్తున్న కంపెనీల్లో మన ఐటీ కంపెనీలు ముందు వరుసలో ఉన్నాయి. వివిధ దేశాలకు ఐటీ ఉత్పత్తులను ఎగుమతి చేస్తూ పెద్దమొత్తంలో విదేశీ మారకాన్నీ ఆర్జించి పెడుతున్నాయి. అలాంటి కంపెనీలు నేడు గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. భారీగా మార్కెట్ విలువను కోల్పోయి సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ఈ క్రమంలో వెలువడనున్న క్యూ1 ఫలితాలపై ఆసక్తి నెలకొంది.ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి త్రైమాసిక ఫలితాల సీజన్ ప్రారంభమైంది. 2026-27 ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి జులై 9న టీసీఎస్ ఫలితాలు వెలువరించనుంది. ఆపై మిగిలిన ఐటీ కంపెనీలూ క్యూ1 ఫలితాలు ప్రకటిస్తాయి. సంప్రదాయ ఐటీ సేవలపై జనరేటివ్ ఏఐ ప్రభావం ఎలా ఉంటుందోననే భయాలు, అంతర్జాతీయంగా బలహీన గిరాకీ నేపథ్యంలో ఈ ఫలితాలు వెలువడుతుండడంతో ఆసక్తి నెలకొంది. మార్కెట్‌పై ఆయా ఫలితాల ప్రభావంపైనా మదుపర్లలో ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా మెరుగైన ఫలితాలు ప్రకటించినా.. భవిష్యత్ అంచనాలపై మరింత మంది దృష్టి సారించనున్నారు. గ్లోబల్ ఐటీ కంపెనీ యాక్సెంచర్ ఇప్పటికే ఆదాయ అంచనాల్లో కోత విధించడం ఇందుకు నేపథ్యం.

**విలువలు భారీగా క్షీణత**

దేశీయ ఐటీ కంపెనీలు ఇప్పటికే భారీగా పతనమయ్యాయి. 10 అగ్రగామి కంపెనీలు దాదాపు రూ.17 లక్షల కోట్ల మార్కెట్ విలువను కోల్పోయాయి. ఆల్‌టైమ్ గరిష్ఠాల నుంచి దాదాపు సగం విలువను పోగొట్టుకున్నాయి. ఐటీ మేజర్ టీసీఎస్ షేరు విలువ 2024 ఆగస్టులో రూ.4,592.25 ఉండగా.. దాదాపు 56 శాతం క్షీణించి రూ.2063కు చేరుకుంది. కంపెనీ మార్కెట్ విలువ రూ.9.12 లక్షల కోట్లు ఆవిరైంది. ఇన్ఫోసిస్ షేరు విలువ సైతం రూ.2,006.45 నుంచి దాదాపు సగానికి పతనమై రూ.1035 వద్ద ట్రేడవుతోంది. విప్రో, ఎల్‌టీఎం, టెక్ మహీంద్రా ఇతర కంపెనీలదీ అదే పరిస్థితి.



బ్రోకరేజీ కంపెనీల అంచనా:త్రైమాసిక ఫలితాలపై ఇప్పటికే పలు బ్రోకరేజీ సంస్థలు తమ అంచనాలను వెలువరించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసిక ఫలితాలు బలహీనంగా ఉండే అవకాశం ఉందని మోర్గాన్ స్టాన్లీ అంచనా వేసింది. రెండో త్రైమాసికానికి సంబంధించిన అంచనాల విషయంలోనూ బలహీనంగా ఉండే అవకాశం ఉందని అభిప్రాయపడింది. అంతర్జాతీయంగా క్లయింట్లు తమ ఐటీ ఖర్చులను తగ్గించుకోవడం, కొత్త ఒప్పందాలపై నిర్ణయాలు తీసుకోవడానికి ఎక్కువ సమయం తీసుకుంటుండడం ఇందుకు నేపథ్యం.


ఏఐ ప్రభావం :మరోవైపు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల సంప్రదాయ ఐటీ కంపెనీలకు ఒక సవాలుగా మారింది. ఏఐ వల్ల ఐటీ కంపెనీల ఉత్పాదకత పెరిగినప్పటికీ, ఆ లాభాన్ని క్లయింట్‌లకే బదిలీ చేయాల్సి వస్తోంది. ఇంతకుముందు క్లయింట్లు పాత పద్ధతిలో పని గంటల ఆధారంగా బిల్లింగ్ చెల్లించేవారు. ఇప్పుడు ఫలితాన్ని బట్టి ప్రైసింగ్ ఆశిస్తున్నారు. దీంతో సంప్రదాయ ఐటీ కంపెనీల ఆదాయాలు తగ్గే అవకాశం ఉందన్న భయాలు నెలకొన్నాయి. మరోవైపు వేతనాల పెంపు, ఏఐలో పెట్టుబడులు వల్ల మార్జిన్‌లపై ప్రభావం పడే అవకాశం ఉందని భావిస్తున్నారు. అయితే, జనరేటివ్ ఏఐ అందుబాటులోకి వచ్చిన తర్వాత, కోడింగ్ పూర్తిగా ఆటోమేట్ అయిపోతుందని, తద్వారా ఐటీ కంపెనీల అవసరం తగ్గిపోతుందనే అనుమానాలూ ఉన్నాయి. అయితే, ఇన్ఫోసిస్ లాంటి ఐటీ దిగ్గజాలను ఏఐ భర్తీ చేయలేదని ఆ కంపెనీ ఛైర్మన్ నందన్ నీలేకని అభిప్రాయపడ్డారు. పైగా కంపెనీల వేగాన్ని, సామర్థ్యాన్ని మాత్రమే పెంచుతుందని చెప్పడం ద్వారా ఏఐపై అనుమానాలను కొంతవరకు తగ్గించారు. దీనికితోడు అంతర్జాతీయ పరిణామాల వల్ల రూపాయి విలువ క్షీణించడం ఐటీ కంపెనీలకు కలిసొచ్చే అంశం. సాధారణంగా ఐటీ కంపెనీలకు డాలర్లలో బిల్లులు వసూలు చేస్తాయి. రూపాయి విలువ క్షీణించినప్పుడు ఆ మేర దేశీయ ఐటీ కంపెనీలు లాభాలను పొందుతాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వల్ల క్షీణించిన రూపాయి విలువ ఐటీ కంపెనీల మార్జిన్లకు కొంతవరకు రక్షణగా నిలిచే అవకాశం ఉందని అనలిస్టులు భావిస్తున్నారు.

# వైఎల్ మోడల్ పైనే టెస్లా ఆశలు

### ఏడాదిలో 468 యూనిట్ల విక్రయం..

అమెరికాకు చెందిన ప్రముఖ కార్ల తయారీ కంపెనీ టెస్లా భారత్‌లో అడుగుపెట్టి ఏడాది పూర్తయ్యింది. కానీ, కంపెనీ ఆశించిన స్థాయిలో విక్రయాలు జరగలేదు. ఇప్పటివరకూ 468 వాహనాలను మాత్రమే విక్రయించింది. 2025 చివరి నాటికి ఈ సంఖ్య 226 యూనిట్లుగానే ఉంది. అయితే, భారత ఈవీ మార్కెట్‌లో తన వాటాను పెంచుకునేందుకు ఇటీవల లాంచ్ చేసిన వైఎల్ మోడల్ దోహదం చేస్తుందని కంపెనీ ఆశిస్తోంది.టెస్లా వై ఎల్ మోడల్ కు ఈ మధ్య డిమాండ్ పెరుగుతోంది. మూడంకెల బుకింగ్స్ నమోదయినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. దీంతో భారత్‌లో మార్కెట్ విస్తరణకు కంపెనీ ఆ మోడల్‌పైనే ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. దేశంలో ఎస్‌యూవీలకు పెరుగుతున్న ఆదరణను దృష్టిలో పెట్టుకుని ఆరు సీట్ల జ ఒ మోడల్‌ను టెస్లా లాంచ్ చేసింది. దీని ప్రారంభ ధర రూ.61.9 లక్షలుగా ఉంది. ముఖ్యంగా బెంగళూరు, హైదరాబాద్ నగరాల నుంచి టెస్లా కార్లకు మంచి డిమాండ్ వస్తోంది. ఈ రెండు నగరాలతో పాటు ముంబయి, దిల్లీ, గురుగ్రామ్‌లో టెస్లా ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు ఉన్నాయి.






# నాలుగో రోజు లాభాల్లోనే..

### సెన్సెక్స్ 521 పాయింట్లు పైకి

**ముంబై:**దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి చము రు ధరలు తగ్గుముఖం పట్టడం, క్యూ1 ఫలితాలపై ఆశావహ దృక్పథం పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది. ముఖ్యంగా ఆటో, రియల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు రాణించాయి. ఈ క్రమంలో వరుసగా నాలుగో రోజూ సూచీలు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 521 పాయింట్లు లాభపడగా.. నిఫ్టీ 24,400 పాయింట్ల పైకి ఎగబాకింది. నిఫ్టీ 159.50 పాయింట్ల లాభంతో 24,430.35 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌డీఎఫ్‌సీ, మహీంద్రా అండ్ మహీంద్రా, బీఈఎల్, రిలయన్స్, ఐసీఐసీఐ, మారుతీ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. కోటక్, టీసీఎస్, బజాజ్ ఫిన్‌సర్వ్ లిమిటెడ్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, అదానీ పోర్ట్స్, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు నష్టాలను చవిచూశాయి. డాలరుతో పోలిస్తే రూపాయి విలువ 95.38గా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 71.50 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,148.34 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# హైదరాబాద్ నుంచి విమాన ఛార్జీ తగ్గుతుందా!

### • రూ.13,975 కోట్ల విమానాశ్రయ విస్తరణ ప్రణాళిక కోసం జీఎంఆర్ గ్రూప్ ప్రతిపాదన

**హైదరాబాద్:**రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్‌జీఐఏ) నుంచి బయలుదేరే ప్రయాణికులకు టికెట్ ధర స్వల్పంగా తగ్గే వీలుంది. ఇదే సమయంలో వేరే ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చేవారిపై అదనపు భారం పడనుంది. ప్రయాణికుల నుంచి వసూలు చేస్తున్న 'యూజర్ డెవలప్‌మెంట్ ఫీజు (యూడీఎఫ్)' విధానంలో మార్పులు చేయాలని నిర్వహణ సంస్థ జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (జీహెచ్‌ఐఏఎల్) నిర్ణయించడమే ఇందుకు కారణం. తన ప్రతిపాదనలను భారత విమానాశ్రయాల టారిఫ్ నియంత్రణ సంస్థ (ఏఈఆర్‌ఏ) ముందు జీహెచ్‌ఐఏఎల్ ఉంచింది. ప్రస్తుతం ఇక్కడి నుంచి బయలుదేరే ప్రయాణికుల నుంచే యూడీఎఫ్ వసూలు చేస్తున్నారు. ఈ రుసుమును 23% తగ్గిస్తూ.. ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడ దిగే ప్రయాణికులపై కొత్తగా రుసుము విధించాలని ప్రతిపాదించింది. గత ఆర్థిక సంవత్సరంలో ఈ విమానాశ్రయం నుంచి 3.1 కోట్ల మంది రాకపోకలు సాగించారు. 2030-31 నాటికి విమానాశ్రయ ప్రయాణికుల వార్షిక సామర్థ్యాన్ని 5.1 కోట్లకు పెంచేందుకు.. మరో టెర్మినల్, కొత్త రన్‌వేను రూ.13,975 కోట్లతో ప్రతిపాదించారు. వీటికి నిధులు సమకూర్చుకోవడమే లక్ష్యంగా యూడీఎఫ్‌లో మార్పులు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ ఛార్జీలు విమాన టికెట్ ధరలోనే కలిసి ఉంటాయి.జీహెచ్‌ఐఏఎల్ సమర్పించిన టారిఫ్ ప్రతిపాదనకు నియంత్రణ సంస్థ ఆమోదం లభిస్తే.. 2026 సెప్టెంబరు 1 నుంచి 2031 మార్చి 31 వరకు కొత్త ధరలు అమలయ్యే అవకాశం ఉంది.



ప్రస్తుతం శంషాబాద్ నుంచి బయలుదేరే దేశీయ ప్రయాణికులు రూ.750, అంతర్జాతీయ ప్రయాణికులు రూ.1,500 చొప్పున యూడీఎఫ్ చెల్లిస్తున్నారు. కొత్త ప్రతిపాదనల ప్రకారం.. ఇక్కడ నుంచి బయలుదేరే వారికి యూడీఎఫ్‌ను దాదాపు 23% తగ్గిస్తారు. దేశీయ గమ్యస్థానాలకు వెళ్లే ప్రయాణికులు ఇక్కడ విమానం ఎక్కితే యూడీఎఫ్ రూ.750 నుంచి రూ.580కి తగ్గుతుంది. విమానం దిగే ప్రయాణికుడిపై కొత్తగా రూ.170 రుసుము విధిస్తారు. వారికి ఈ మేర భారం పెరుగుతుంది. అంటే.. ఇక్కడే విమానం ఎక్కి-దిగేవారికి యూడీఎఫ్ ఖర్చులో మార్పేమీ ఉండదు. ఎక్కేటప్పుడు తగ్గినా, దిగేటప్పుడు అంతమేర విధిస్తుండటమే ఇందుకు కారణం. మొత్తం భారం రూ.750గానే ఉంటుంది.విదేశీ ప్రయాణానికి బయలుదేరేటప్పుడు యూడీఎఫ్ రూ.1500 నుంచి రూ.1150కి తగ్గుతుంది. ఇక్కడ దిగే అంతర్జాతీయ ప్రయాణికులపై కొత్తగా రూ.350 రుసుము ప్రతిపాదించారు. ఇరువైపులా ప్రయాణానికి అయ్యే మొత్తం ఖర్చు రూ.1,500 స్థిరంగానే ఉంటుంది. దిల్లీ విమానాశ్రయంలో దేశీయ నగరాల నుంచి వచ్చేవారిపై రూ.56, అంతర్జాతీయ ప్రయాణికులపై రూ.275 చొప్పున యూడీఎఫ్ విధిస్తున్నారు. నవీ ముంబయి విమానాశ్రయంలో దేశీయ ప్రయాణికుల నుంచి రూ.270, అంతర్జాతీయ ప్రయాణికుల నుంచి రూ.525 చొప్పున వసూలు చేస్తున్నారు.త్వరలో ప్రారంభం కానున్న భోగాపురం (రూ.835), గోవా (రూ.840) విమానాశ్రయాల్లో మొత్తం యూడీఎఫ్ హైదరాబాద్ కంటే ఎక్కువగా ఉండనుంది. కొత్త మార్గాలు ప్రారంభిస్తే విమానయాన సంస్థలకు రాయితీలుకొత్త మార్గాలకు సర్వీసులు ప్రారంభించే విమానయాన సంస్థలకు 'విమాన ల్యాండింగ్ ఛార్జీలను' భారీగా తగ్గించాలని జీహెచ్‌ఐఏఎల్ ప్రతిపాదించింది. సరికొత్త అంతర్జాతీయ సుదూర గమ్యస్థానాల విమాన సర్వీసులకు ల్యాండింగ్ - యూడీఎఫ్ ఛార్జీలను ప్రారంభ సంవత్సరాల్లో పూర్తిగా తొలగిస్తారు.




# 'లులు' అదిరిపోయే ఆఫర్స్..

### 4 రోజుల పాటు ఫ్లాట్ 50% డిస్కౌంట్ సేల్

హైదరాబాద్: కూకట్‌పల్లి లులు మాల్‌లో ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు 'లులు ఆన్ సేల్' నిర్వహించనున్నారు. వినియోగదారులకు ఫ్లా?ట్ 50 శాతం డిస్కౌంట్ అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సేల్‌కు సంబంధించి సోమవారం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. టాలీవుడ్ నటుడు శ్రీనందు సందడి చేశారు. ఆయన చేతులమీదుగా సేల్ అధికారిక లోగోను, ప్రత్యేక టీ-షర్ట్‌ను ఆవిష్కరించారు. లోగో ఆవిష్కరణ అనంతరం శ్రీనందు తనదైన శైలిలో కస్టమర్లతో మాట్లాడి వారిలో ఉత్సాహాన్ని నింపారు. అనంతరం నిర్వాహకులు విలేకరులతో మాట్లాడారు. 200లకు పైగా బ్రాండ్లు ఈ మెగా సేల్‌లో పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఫుడ్ కోర్టులో సైతం స్పెషల్ ఆఫర్లు పొందొచ్చని, మాల్‌లోని ఇతర రిటైల్ స్టోర్లు సైతం ఇందులో పాల్గొంటున్నాయని తెలిపారు. లులు గ్రాండ్ షాపింగ్ కార్నివాల్ కాంటెస్ట్‌లో 'లులు హ్యాపీనెస్ రిజిస్టర్డ్ కస్టమర్లు కనీసం రూ.2999 షాపింగ్ చేసిన వాళ్లు లక్కీ డ్రా ద్వారా హ్యుందాయ్ ఐ20 కారు గెలుచుకునే అవకాశం ఉందన్నారు. లులు హైపర్ మార్కెట్‌లో గ్రాసరీస్, ఫ్యాషన్, ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలు తదితర 25 వేలకు పైగా వస్తువులపై ఫ్లాట్ 50 శాతం తగ్గింపు అందిస్తున్నట్లు తెలిపారు. అటు గేమ్స్ జోన్ ఫంటురాలో ప్రత్యేకంగా 100 శాతం బోనస్ సెలబ్రేషన్ ఆఫర్‌ను అందిస్తున్నారు. రూ.2000 లేదా అంతకంటే ఎక్కువ రీఛార్జ్ చేసుకుంటే, ఆ అమౌంట్ రెట్టింపు అవుతుందన్నారు. దీంతోపాటు కస్టమర్లకు ఉచితంగా రైడ్ కూపన్స్ కూడా అందిస్తున్నట్లు తెలిపారు. లులు హ్యాపినెస్ లాయల్టీ కస్టమర్లకు 8వ తేదీ నుంచే సేల్ యాక్సెస్ ఉంటుందని చెప్పారు. ఈ నాలుగు రోజులూ ఉదయం 9 గంటల నుంచే స్టోర్ తెరిచి ఉంటుందని తెలిపారు. వినియోగదారుల సౌకర్యార్థం అదనపు పార్కింగ్, ఇతర వసతులు సహా అన్ని అవసరమైన ఏర్పాట్లు చేశామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల్ రీజినల్ మేనేజర్ మహ్మద్ షరీఫ్, మాల్ మేనేజర్ ఏజిల్ అరసన్, డీజీఎం విశాల్ కుమార్, ఫంటురా అసిస్టెంట్ మేనేజర్ సూర్యకాంత్, మార్కెటింగ్ మేనేజర్లు ఫణి, మను ఆంథోనీ పాల్గొన్నారు.

## జమ్మూకశ్మీర్‌లో క్లౌడ్‌బరస్ట్

ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. ప్రజలు, పర్యాటకులకు సహాయం అందించేందుకు కంట్రోల్ రూమ్, హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

## మీ స్నేహాన్ని ఎప్పటికీ మరువలేం..

ఇరాన్ దివంగత సుప్రీం నేత ఖమేనీ అంత్యక్రియల కార్యక్రమాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఆయన భౌతికకాయాన్ని రాజధాని టెహ్రాన్‌లోని గ్రాండ్ మొసల్లా మసీదులో ఉంచారు. దేశ విదేశీ ప్రతినిధులు, అధికారులు ఆయన భౌతిక కాయానికి శ్రద్ధాంజలి ఘటించారు. భారత్ తరపున బిహార్ గవర్నర్, సయ్యద్ అతా హస్నైన్, విదేశాంగ శాఖ సహాయ మంత్రి పబిత్రా మార్గరీటా నివాళులర్పించారు. కాంగ్రెస్ నేత సల్మాన్ ఖుర్షీద్, జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీతో పాటు భారత్‌కు చెందిన సిక్కు, హిందూ, ముస్లిం, క్రైస్తవ మత పెద్దలు అంత్యక్రియలకు హాజరయ్యారు. ఖమేనీ పార్థివ దేహాన్ని ఆయన సొంత పట్టణం మషహద్‌లో ఈనెల 9న ఖననం చేయనున్నారు.



### హైకోర్టులో బండి భగీరత్ బెయిల్‌పై ముగిసిన వాదనలు

## తీర్పు రిజర్వు

**హైదరాబాద్,జూలై6(జనంసాక్షి):** బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో వాదనలు ముగిశాయి. భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేయవద్దని బాధితురాలి తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశముందని కోర్టులో పేట్ బషీరాబాద్ పోలీసులు కౌంటర్ దాఖలు చేశారు. నిందితుడిపై బాలిక తల్లి ఫిర్యాదు చేయగా పోక్సో కేసు నమోదు చేశామని తెలిపారు. బాలిక వాంగ్మూలాన్ని నమోదు చేశాక ఆరోపణలు తీవ్రంగా ఉండటంతో అభియోగాలను సవరించినట్లు పోలీసులు చెప్పారు. బాధితురాలి వాంగ్మూలం ప్రకారం నిందితుడు స్నేహం పేరుతో పరిచయం చేసుకుని, పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడంటూ ప్రభుత్వం తరఫు న్యాయవాది కోర్టుకు తెలియజేశారు. బండి భగీరథ్ తండ్రి కేంద్ర మం త్రి కాబట్టి కేసుపై ప్రభావం చూపుతోందని బాధితురాలి తరఫు న్యాయవాది వాదించారు. దర్యాప్తు దశలో బెయిల్ మంజూరు చేయవద్దని కోరారు. ఇంకా ఈ కేసులో సాక్షులను విచారణ చేయాల్సి ఉందని.. బెయిల్‌పై బయటకు వస్తే సాక్షులు స్టేట్‌మెంట్ ఇవ్వడానికి నిరాకరించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇరుపక్షాల వాదనలు ముగియడంతో తీర్పును హైకోర్టు రిజర్వ్ చేసింది.

# సెప్టెంబర్‌లో ఎన్ఎస్ఈ రూ.30,000 కోట్ల ఐపీఓ

దిల్లీ: ఏళ్లుగా ఎదురుచూస్తున్న నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ తొలి పబ్లిక్ ఇష్యూ ఈ ఏడాది సెప్టెంబర్‌లో పట్టాలెక్కనుంది. మొత్తం రూ.30వేల కోట్లు మార్కెట్ నుంచి సమీకరించనున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. దాదాపు రూ.5 లక్షల కోట్ల మార్కెట్ విలువతో ఐపీఓకు రానుంది. పబ్లిక్ ఇష్యూకు సంబంధించి ఎన్ఎస్ఈ త్వరలో రోడ్‌షోలు నిర్వహించనుంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే స్టాక్ మార్కెట్ చరిత్రలో అతిపెద్ద ఐపీఓగా నిలవనుంది. 2024 అక్టోబర్‌లో వచ్చిన హ్యుందాయ్ మోటార్ ఇండియా ఐపీఓనే (రూ.27,870 కోట్లు) అతిపెద్ద పబ్లిక్ ఇష్యూగా ఉంది.ఎన్ఎస్ఈ ఐపీఓ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలో నిర్వహించనున్నారు. అంటే ప్రస్తుత వాటాదారులు తమ వాటాలను వదులుకోనున్నారు. సుమారు 6 శాతానికి సమానమైన 14.80 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనున్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎంఎస్ స్ట్రాటిజిక్ (మారిషస్) లిమిటెడ్, కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు, అరండ ఇన్వెస్ట్‌మెంట్స్ (మారిషస్), బ్యాంక్ ఆఫ్ బరోడా, స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ది న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీ, నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీలు తమ వాటాలు విక్రయించనున్నాయి. ఎన్ఎస్ఈలో అతిపెద్ద వాటాదారుగా ఉన్న ఎల్ఐసీ మాత్రం పబ్లిక్ ఇష్యూలో తన వాటాలను విక్రయించడం లేదు. స్టాక్ ఎక్స్ఛేంజీలో ఈ సంస్థకు 10.72 శాతం వాటా ఉంది.

**దశాబ్దం కల నెరవేరుతున్నవేళ**

ఎన్ఎస్ఈ ఐపీఓ దాదాపు దశాబ్దం క్రితమే రావాల్సింది. 2016లో రూ.10వేల కోట్లు సమీకరించేందుకు సెబీకి ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది. గవర్నెన్స్ సమస్యలు, కోలొకేషన్ వ్యవహారం తెరపైకి రావడంతో సెబీ రెడ్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో అడ్డంకులను తొలగించుకుంటూ వచ్చింది. నియంత్రణ సంస్థ నుంచి ఆమోదం కోసం పలుమార్లు విజ్ఞప్తులు చేసింది. ఈ క్రమంలోనే సెబీ నుంచి ఎన్‌వోసీ రావడంతో ఐపీఓకు ఈ ఏడాది ఫిబ్రవరి 6న ఎన్ఎస్ఈ బోర్డు ఆమోదం తెలిపింది. ఐపీఓలో భాగంగా 20 మంది మర్చంట్ బ్యాంకర్లను నియమించింది. మరోవైపు రిలయన్స్ ఇండస్ట్రీస్ కూడా జియో ప్లాట్‌ఫామ్ పేరిట అతిపెద్ద ఐపీఓకు సన్నద్ధమవుతోంది. ఇప్పటికే ముసాయిదా పత్రాలను దాఖలు చేసింది.

# సీనియర్ మైనింగ్ స్టాఫ్‌కు తక్షణం ఓవర్‌మెన్, గ్రేడ్–బి ప్రమోషన్లు

- అప్పటి వరకు కేడర్ స్కీమ్ ప్రకారం విధులు మాత్రమే
- ఖాళీలు లేవని కారణం చూపి ప్రమోషన్లు నిలిపివేత
- జూలై 22 నుంచి వర్క్ టు రూల్ పాటిస్తామని హెచ్చరిక
- ఏఐటియుసీ నాయకులు ఆర్జీ–1 జీఎంకు వినతి



**గోదావరిఖని, జూలై 5 (జనం సాక్షి):** సింగరేణిలో 2016, 2017 బ్యాచ్‌లకు చెందిన సీనియర్ మైనింగ్ సర్దార్ (ఓఎంహెచ్) కేడర్ స్కీమ్ ప్రకారం మూడేళ్ల సర్వీసు పూర్తి చేసిన అనంతరం ఓవర్‌మెన్, గ్రేడ్–బి హోదాకు అర్హులైనప్పటికీ, "ఓవర్‌మెన్ ఖాళీలు లేవు" అనే కారణంతో వారి ప్రమోషన్లు అనవసరంగా నిలిపివేయబడ్డాయని, తక్షణమే ఖాళీలతో సంబంధం లేకుండా వారికి ప్రమోషన్లు ఇచ్చే విధంగా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసీ ఆర్జీ–1 బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను పేర్కొన్నారు.
సోమవారం ఏఐటియుసీ ఆర్జీ–1 బ్రాంచి ఆధ్వర్యంలో ఆర్జీ–1 జనరల్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ, సీనియర్ మైనింగ్ సర్దార్‌లకు ఓవర్‌మెన్ ప్రమోషన్ ఇవ్వకుండానే వారితో ఓవర్‌మెన్ విధులను నిరంతరం నిర్వహింపజేయడం జరుగుతోందని ఆరోపించారు. దీని వల్ల సంస్థలో వాస్తవ ఓవర్‌మెన్‌లు అవసరం ఉండగా ఖాళీలు ప్రతిబింబించడం లేదని, ఓవర్‌మెన్ ల పోస్టుల ఖాళీలు కృత్రిమంగా తగ్గినట్లుగా కనిపిస్తూ, అర్హులైన ఉద్యోగులకు రావలసిన ప్రమోషన్లు దాదాపు మూడేళ్ల నుంచి ఇవ్వకుండా యాజమాన్యం ఆలస్యం చేస్తోందని అన్నారు.
ఈ పరిస్థితి కేడర్ స్కీమ్ యొక్క ఉద్దేశ్యానికి, ఉద్యోగుల న్యాయమైన హక్కులకు విరుద్ధంగా ఉందని ఆయన తెలిపారు. ముఖ్యంగా మైనింగ్ స్టాఫ్ డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేడర్ స్కీమ్ ప్రకారం అర్హులైన సీనియర్ మైనింగ్ సర్దార్ (ఓఎంహెచ్) లందరికీ తక్షణమే ఓవర్‌మెన్, గ్రేడ్–బి ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం ఓవర్‌మెన్ ప్రమోషన్లు కల్పించే వరకు సీనియర్ సర్దార్‌లకు ఓవర్‌మెన్ విధులను అప్పగించరాదని ఆయన పేర్కొన్నారు.
అలాగే సంస్థలోని ఓవర్‌మెన్ ఖాళీలను భర్తీ చేయడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని, లేనియెడల జూలై 22 మొదటి షిఫ్ట్ నుంచి సీనియర్ మైనింగ్ సర్దార్ కంపెనీ ఇచ్చిన ఆఫీస్ ఆర్డర్ ప్రకారం మైనింగ్ సర్దార్ డ్యూటీ మాత్రమే నిర్వహిస్తామని తెలిపారు. కనుక యాజమాన్యం తక్షణమే స్పందించి మైనింగ్ స్టాఫ్ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, ఆర్జీ–1 బ్రాంచి ఆఫీస్ బేరర్స్ మాదన మహేష్, సిద్దమల్ల రాజు, సిర్ర మల్లికార్జున్, గండి ప్రసాద్, పిట్ కార్యదర్శులు ఇజ్జగిరి రాజు, మైనింగ్ స్టాఫ్ నాయకులు పెర్క మహేందర్, శ్రీనివాస్, నాయకులు గొడిశెల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్యూమరేషన్ ఫారాలను గడువులోపు అందించాలి

- ఓటరు జాబితా సవరణలో ప్రతి ఓటరు బాధ్యత తీసుకోవాలి
- ఆగస్టు 5న ముసాయిదా జాబితా ప్రచురణ
- హెల్ప్ డెస్క్ ఏర్పాటు.. అధికారులు సందర్శనలు పెంచాలి
- విద్యా సంస్థలు, సంక్షేమ హాస్టళ్ల పర్యవేక్షణకు సూచన



**నిజామాబాద్, జూలై 6 (జనం సాక్షి):** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాలను పూరించి, నిర్ణీత గడువులోపు ప్రతి ఓటరు తప్పనిసరిగా బూత్ లెవెల్ అధికారికి అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. సోమవారం ప్రజావాణి అనంతరం కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అన్ని శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు అందరూ విధిగా ఈ నెల 24వ తేదీలోపు ఎన్యూమరేషన్ ఫారాలను నింపి బీఎల్ఓలకు అందించాలన్నారు. లేని పక్షంలో ఆగస్టు 5న ప్రచురించే ఓటర్ల ముసాయిదా జాబితాలో పేరు కోల్పోతారని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ తేలికగా తీసుకోకూడదని, అధికారులు ఎంత పెద్ద హోదాలో, ఏ స్థాయిలో ఉన్నా ఎన్నికల సంఘం నిర్దేశించిన మేరకు ఎన్యూమరేషన్ ఫారం అందించాల్సిందేనని అన్నారు.
జిల్లాలో దాదాపుగా అన్ని ప్రాంతాలలో ఇప్పటికే ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ పూర్తయ్యిందని తెలిపారు. అయితే తీసుకున్న ఎన్యూమరేషన్ ఫారాలను తగిన వివరాలతో పూరించి, బీఎల్ఓలకు గడువులోపు అందించడం ఎంతో ముఖ్యమని సూచించారు. ఈ మేరకు ఓటర్లకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని, వివిధ శాఖల జిల్లా అధికారులకు, మండల స్పెషల్ ఆఫీసర్లు అవకాశం మేరకు తహసీల్దార్ కార్యాలయాలను సందర్శించి, ఎస్ఐఆర్ అమలు తీరును, బీఎల్ఓల పనితీరును పరిశీలించాలని అన్నారు.
కాగా, ఎన్యూమరేషన్ ఫారం భర్తీ విషయంలో, ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ, తగిన సహకారం అందించేందుకు వీలుగా కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజ్‌ను ఆదేశించారు. ఇదిలా ఉండగా, సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లను క్రమం తప్పకుండా సందర్శించాలని మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. విద్యా సంస్థలను మొక్కుబడిగా సందర్శించకుండా, వాటి పనితీరును నిశితంగా పరిశీలించాలని, ఏమైనా సమస్యలు ఉన్నాయా అన్నది గమనించాలని అన్నారు. అధికారుల సందర్శనతో విద్యా సంస్థల పనితీరులో స్పష్టమైన మార్పు కనిపించాలన్నారు.
ఓపెన్ బావులు వంటి ప్రమాదకర పరిస్థితులు నెలకొని ఉంటే వెంటనే తమ దృష్టికి తేవాలన్నారు. విద్యార్థులు పాముకాటు, విష కీటకాల బారిన పడకుండా అన్ని విద్యా సంస్థల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అంకిత భావంతో ఉత్తమ స్థాయిలో విధులు నిర్వర్తించే మండల స్పెషల్ ఆఫీసర్‌ను ఎంపిక చేసి తగిన ప్రోత్సాహకం అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ వి. భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్‌డీఓ సాయన్న, డీపీఓ శ్రీనివాస్ రావు, నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ బడికే పెద్దపీట

- ప్రభుత్వ విద్యపై విశ్వాసం చాటిన దేవునిపల్లి పోలీసు అధికారి
- కుమారుడిని పాఠశాలలో చేర్పించి ఆదర్శం అయిన కానిస్టేబుల్
- ప్రభుత్వ ఉద్యోగులే ముందుగా ఆదర్శంగా ఉండాలి : కానిస్టేబుల్

**కామారెడ్డి ప్రతినిధి, జూలై 6 (జనం సాక్షి):** ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం పెంపొందించాలంటే ముందుగా తామే ఆదర్శంగా నిలవాలని భావించిన ఓ పోలీసు కానిస్టేబుల్ తన కుమారున్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి పలువురి ప్రశంసలు అందుకుంటున్నారు. కామారెడ్డి జిల్లా దేవునిపల్లి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న బక్కనోళ్ళ రవి తన కుమారుడు బక్కనోళ్ళ పృథ్వీక్‌ను తాడ్వాయి మండలంలోని కృష్ణాజివాడి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మూడవ తరగతిలో సోమవారం చేర్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, మెరుగైన మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయని నమ్మి ఈ నిర్ణయం తీసుకున్నట్లు రవి తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగి అయిన తాను ప్రభుత్వ విద్యా వ్యవస్థపై విశ్వాసం ఉంచడం ద్వారా సమాజానికి సానుకూల సందేశం ఇవ్వాలనేదే తన ఉద్దేశమని రవి వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు రవి కుటుంబాన్ని అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ముందుకు రావాలని, కానిస్టేబుల్ రవి తీసుకున్న నిర్ణయం మరెందరికో స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు.

# నా కొడుకు నన్ను సాకడం లేదు

- అర్హులైన ఆస్తి తిరిగి ఇప్పించాలని ఆర్డీఓకు వేడుకోలు
- వృద్ధాప్యంలో తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసిన కుటుంబం
- సీనియర్ సిటిజన్స్ చట్టం కింద చర్యలు తీసుకోవాలని డిమాండ్
- హుజురాబాద్‌లో విషాదకర ఘటన



**హుజురాబాద్, జూలై 6 (జనం సాక్షి):** వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను పోషించకపోగా, వారి పేరున ఉన్న విలువైన భూమిని మోసగించి కాజేసిన కొడుకు, మనుమలపై ఆర్డీఓకు ఫిర్యాదు చేసిన వృద్ధ దంపతుల ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. హుజురాబాద్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన ముషం వీరమల్లు, బుచ్చి మల్లమ్మ దంపతులు అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ ఆర్డీఓ కార్యాలయానికి చేరుకొని తమ గోడును వెళ్లబోసుకున్నారు. రెక్కలు ముక్కలు చేసుకొని సాది పెద్ద చేసిన తల్లిదండ్రులను కన్న కొడుకు, మనుమలు పట్టించుకోకపోగా, తండ్రి లేదని మనుమలను సాది, పెద్ద చేసి అప్పులు చేసి మరీ ఉన్నత చదువులు చదివించి అప్పుల పాలైన వృద్ధులను సాధకపోగా వారి పేరున ఉన్న భూమిని కాజేసి నిర్లక్ష్యంగా వదిలివేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.
వృద్ధాప్యంలో ఆసరాగా ఉంటుందని కొనుగోలు చేసిన భూమిని మోసగించి నామినీ అయిన తాతకు తెలియకుండా ఆ భూమి ముగ్గురు మనుమలు కాజేశారని, మనుమల నుంచి తిరిగి తన భూమి తనకు ఇప్పించాలని ఆర్డీఓను ఆశ్రయించారు. సీనియర్ సిటిజన్స్ చట్టం–2007 ప్రకారం బాధితులైన వృద్ధులు ఆర్డీఓ (ట్రిబ్యునల్)కు ఫిర్యాదు చేసి న్యాయం పొందవచ్చన్న ఆశతో ఆర్డీఓను కలిసారు. ఆ ఆస్తి బదిలీని చెల్లనిదిగా ప్రకటించే అధికారం ఆర్డీఓకు ఉందని, మోసగించి రీ–రిజిస్ట్రేషన్ చేసుకున్న భూమిని తిరిగి వృద్ధుల పేరిట మార్చాలని విజ్ఞప్తి చేశారు. తల్లిదండ్రులను సంరక్షించని కొడుకు, సంపాదన కలిగిన మనుమల నుంచి వృద్ధులకు నెలవారీ పోషణ ఖర్చులు (గరిష్టంగా రూ.10,000 లేదా కోర్టు ఆదేశాల ప్రకారం) ఇప్పించేలా ఆర్డీఓ ఆదేశాలు జారీ చేయాలని వృద్ధ దంపతులు వినతిపత్రంలో వేడుకున్నారు.

# 'ప్రజావాణి' దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచొద్దు

### జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా.



**కరీంనగర్ బ్యూరో, జూలై 6 (జనంసాక్షి) :** ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా అత్యంత ప్రాధాన్యమిచ్చి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహించగా అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో షర్మిల, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజావాణి కి మొత్తం 169 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో అత్యధికంగా గృహ నిర్మాణ శాఖకు 67, కరీంనగర్ నగరపాలికకు 54 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు.

**కరీంనగర్ నగరపాలక సంస్థలో ప్రజావాణి కార్యక్రమం :**
కరీంనగర్ నగరపాలక సంస్థ ఆవరణలోని కళాభారతిలో సోమవారం రోజు ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'ప్రజావాణి' కార్యక్రమం జరిగింది. నగరపాలక సంస్థ కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ వివిధ డివిజన్ల నుండి వచ్చిన ప్రజల నుండి వినతి పత్రాలను, దరఖాస్తులను స్వీకరించారు. వివిధ విభాగాలకు సంబంధించి మొత్తం 19 ధరఖాస్తులలో ఇంజనీరింగ్ 4, టౌన్ ప్లానింగ్ 12, రెవెన్యూ 1, సానిటేషన్1, ఇందిరమ్మ 1 చొప్పున రావడం జరిగింది. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ... ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును త్వరితగతిన పరిశీలించి పరిష్కరించేలా విభాగాల వారిగా అధికారులు చర్యలు తీస్కోవాలన్నారు. దరఖాస్తులు పెండింగ్ లేకుండా చూడాలని సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ అదనపు కమీషనర్ అయాజ్, డిప్యూటీ కమీషనర్ ఖాధర్ మోహియోద్దిన్, డీసిపి బషీరొద్దిన్, ఏసిపి వేణు, శ్రీధర్, డీఈ లచ్చిరెడ్డి, వెటర్నరీ ఆఫీసర్ దుర్గప్రసాద్ రెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# బీఎల్ఏలే పార్టీకి బలమైన పునాది: కోరుకంటి చందర్

### 5వ డివిజన్ బూత్ లెవల్ ఏజెంట్ల సమీక్ష సమావేశం

### ఓటరు జాబితా సవరణపై సమగ్ర అవగాహన కల్పించిన మాజీ ఎమ్మెల్యే



**గోదావరిఖని, జూలై 6 (జనంసాక్షి):** ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏలు) పాత్ర అత్యంత కీలకమని రామగుండం మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి కోరుకంటి చందర్ అన్నారు. స్థానిక గంగానగర్‌లో పట్టణ అధ్యక్షుడు అచ్చ వేణు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన 5వ డివిజన్ బీఎల్ఏల సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై బీఎల్ఏలకు సమగ్ర అవగాహన కల్పించారు. కొత్త ఓటర్ల నమోదు, వివరాల మార్పులు, సవరణలు, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా బూత్ స్థాయిలో అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పార్టీ నాయకులు, బీఎల్ఏలు పరస్పర సమన్వయంతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.
బీఎల్ఏలు పార్టీకి క్షేత్రస్థాయిలో కీలక వారధిగా ఉంటారని, వారి పనితీరుపైనే ఓటరు జాబితా సమగ్రత ఆధారపడి ఉంటుందని చందర్ పేర్కొన్నారు. సమావేశం అనంతరం బీఎల్ఏలకు రామగుండం నియోజకవర్గ బీఆర్ఎస్ బూత్ లెవల్ ఏజెంట్ గుర్తింపు కార్డులను అందజేశారు.
ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ నాయకురాలు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు మూల విజయరెడ్డి, 5వ డివిజన్ ఇన్‌చార్జి సకినాల ప్రతాప్, మాజీ కార్పొరేటర్ నారాయణదాసు మారుతి, అల్లం ఐలయ్యతో పాటు పార్టీ నాయకులు, బీఎల్ఏలు పాల్గొన్నారు.

# కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులకు ఫోన్ కొనుగోలు టెండర్ రద్దు చేయాలి: సీపీఎం

**కరీంనగర్ టౌన్, జూలై 6, (జనం సాక్షి) :** కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులకు మొబైల్ ఫోన్ల కొనుగోలుకు రూ.28 లక్షలతో చేపట్టిన టెండర్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా గుడికందుల సత్యం మాట్లాడుతూ, ప్రజలు చెల్లిస్తున్న పన్నుల ద్వారా సమకూరిన నిధులతో కార్పొరేటర్లకు మొబైల్ ఫోన్లు కొనుగోలు చేయడం సమంజసం కాదన్నారు. అవసరమైతే తక్కువ వేతనాలతో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు మొబైల్ ఫోన్లు అందించాలని, ఆర్థికంగా స్థిరంగా ఉన్న కార్పొరేటర్లకు ప్రజాధనంతో ఫోన్లు కొనివ్వడం అన్యాయమని అన్నారు. టెండర్‌ను రద్దు చేసే వరకు సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ప్రజాధనాన్ని కాపాడేందుకు కార్పొరేటర్లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఫోన్ కొనుగోలు టెండర్‌ను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాయికంటి శ్రీనివాస్, ఆర్. శ్రీనివాస్, డి. శ్రీకాంత్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి లోనే ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

### కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 06 జనం సాక్షి :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 131 ఫిర్యాదులు అందాయి. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్, భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత, జిల్లా పరిషత్ సీఈఓ సాయాగౌడ్, డీపీఓ శ్రీనివాస్, డీఆర్డీఓ సాయన్న, నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.
ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే దాడులు చేస్తారా?

### మాజీ ఎమ్మెల్యే రవిశంకర్



**మల్యాల జూలై 6 (జనం సాక్షి) :** మల్యాల మండల కేంద్రంలో మహాలక్ష్మి ఫంక్షన్ హాల్ లో సోమవారం స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ మాట్లాడుతూ చొప్పదండి నియోజకవర్గంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు ఆందోళన కరంగా మారాయని తీవ్ర విమర్శలు చేశారు.
మాజీ ఎమ్మెల్యే రవి శంకర్ మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న చొప్పదండి నియోజకవర్గాన్ని స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆయన అనుచరులు బెదిరింపులతో ఆందోళనకర పరిస్థితులకు తీసుకెళ్లారని ఆరోపించారు.గ్రామ అభివృద్ధి కోసం ప్రశ్నించిన వారిపై దాడులు చేయడం,అక్రమంగా ఎస్సీ,ఎస్టీ కేసులు నమోదు చేయించడం వంటి ఘటనలు గత రెండున్నర సంవత్సరాలుగా జరుగుతున్నాయని సర్పంచ్ ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయిన శేఖర్ లావణ్య దంపతులపై హత్యాయత్నం జరిగిందని ఆరోపించిన ఆయన,గ్రామానికి రోడ్డు కావాలని అడగడం నేరమా అని ప్రశ్నించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని,ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రజలు కోరిన వారిని వేధించడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు.గుంతలతో నిండిన రహదారులను బాగు చేయాలని మహిళలు నాట్లు వేసి నిరసన తెలిపిన ఘటనను ప్రస్తావిస్తూ, ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. సోషల్ మీడియాలో ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిని బెదిరించడం,దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన ఆరోపించారు.గ్రామాల అభివృద్ధి,సంక్షేమం కోసం ప్రశ్నించే ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం మానుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతమైతే ప్రజాస్వామ్య బద్ధంగా తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు.అనంతరం మల్యాల పోలీస్ స్టేషన్లో బాధితులతో కలిసి దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి చట్ట ప్రకారం వారిని శిక్షించాలని రవిశంకర్ కోరారు.



# ప్రజల కోసం అభివృద్ధి.. ప్రజా ప్రతినిధుల కోసం కాదు

- ఎలగందుల నుంచి గన్నేరువరం వరకు బ్రిడ్జి ప్రజాధన వృధా
- లోయర్ మానేరు డ్యాం మీదుగా మైలారం వరకు బ్రిడ్జి నిర్మాణం జరగాలి
- 100 గ్రామాల ప్రజలకు ఉపయోగపడేలా ప్రణాళిక
- రాజకీయ నాయకుల స్వార్థం కోసం ప్రాజెక్టు కాదు

**కరీంనగర్ బ్యూరో, జూలై 6 (జనం సాక్షి):** ఎలగందుల నుంచి గన్నేరువరం వరకు ప్రతిపాదిత బ్రిడ్జి నిర్మాణం కేవలం మూడు ఊర్లకు మాత్రమే పనికి వస్తుందని, దీని ద్వారా ప్రజాధనం దాదాపు 100 కోట్లు వృధా అవుతుందని తెలంగాణ రక్షణ సేన కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గుంజపడుగు హరిప్రసాద్ ఆరోపించారు. లోయర్ మానేరు డ్యాం మీదుగా మైలారం వరకు బ్రిడ్జి నిర్మాణం జరిగితే దాదాపు 100 గ్రామాల ప్రజలకు ఉపయోగపడుతుందని సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ, ప్రస్తుత ప్రతిపాదన పూర్తిగా రాజకీయ నాయకుల స్వార్థం కోసం, వారి గ్రానైట్ వ్యాపారాలు, వ్యవసాయ భూముల విలువలు పెంచుకోవడం, ఫామ్‌హౌస్‌ల సౌకర్యం కోసం మాత్రమే ఉందని విమర్శించారు. ప్రజా ప్రతినిధుల కోసం కాకుండా ప్రజల కోసం అభివృద్ధి జరగాలని, ప్రజల అభిప్రాయం మేరకు వంతెన నిర్మాణం జరగాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు సంపత్, ఉదయ్, జిల్లా సీనియర్ నాయకులు రంగరవేణి లక్ష్మణ్, బాసవేణి రాజేందర్, తెలంగాణ రక్షణ సేన మనకోండూర్ నియోజకవర్గ ఇంచార్జ్ బుడుగె పర్శారం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# లైఫ్ సైన్సెస్ ఆవిష్కరణల కేంద్రంగా తెలంగాణ

- మోడల్ మ్యానుఫ్యాక్చరింగ్ జోన్‌గా జహీరాబాద్ నిమ్జ్
- పారిశ్రామిక ప్రగతిని చూసి ఓర్వలేకే ప్రతిపక్షాల దుష్ప్రచారం
- దేశంలోనే మొదటి ఇంటిగ్రేటెడ్ ఆంకాలజీ మ్యానుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు



**సిద్దిపేట, (జనంసాక్షి):** ఆరోగ్య రంగంలో వేగంగా చోటు చేసుకుంటున్న మార్పులను అవకాశాలుగా అందిపుచ్చుకునేలా... తెలంగాణను ప్రపంచ స్థాయి లైఫ్ సైన్సెస్ ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారులి. పరిశోధన, సాంకేతికత, ఏఐ, అధునాతన తయారీ, నైపుణ్యాభివృద్ధిని సమన్వయం చేస్తూ... భవిష్యత్తులో హెల్త్ కేర్ రంగంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేలా సమగ్ర ఎకో సిస్టమ్ ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం కరకపట్లలోని బయోటెక్ పార్క్ ఫేజ్ – 3లో రూ.800 కోట్ల పెట్టుబడితో సిరో ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటు చేసిన దేశంలోనే మొదటి ఇంటిగ్రేటెడ్ ఆంకాలజీ మ్యానుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీని ఆయన సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... పారిశ్రామిక ప్రగతిలో తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా మార్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. జహీరాబాద్ నిమ్జ్ ను మోడల్ మ్యానుఫ్యాక్చరింగ్ జోన్ గా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణను రూపొందించామన్నారు. రాష్ట్రంలో 'గ్రీన్ ఫార్మా' అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని... పర్యావరణహిత పద్ధతుల్లో ఔషధాలను ఉత్పత్తి చేసేలా పరిశ్రమలను ప్రత్యేకంగా ప్రోత్సహిస్తున్నామన్నారు. ప్రపంచవ్యాప్తంగా వాడుకలోకి వచ్చేలా... తెలంగాణ నుంచే ఒక కొత్త మాలిక్యూల్ ఆవిష్కృతం కావాలని ఆకాంక్షించారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందన్నారు. తెలంగాణ రైజింగ్––2047, నెక్స్ట్ జనరేషన్ లైఫ్ సైన్సెస్ పాలసీ ద్వారా పరిశోధన నుంచి ఉత్పత్తి వరకు అన్ని దశలను అనుసంధానించేలా ఒక ప్రత్యేక వ్యవస్థను నిర్మిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా బయోలాజిక్స్, బయోసిమిలర్స్, సెల్ అండ్ జీన్ థెరపీలు, ఏఐ, డిజిటల్ హెల్త్ తదితర అత్యాధునిక రంగాలకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భారత్ ఫ్యూచర్ సిటీ, హిల్ట్ పాలసీలపై ప్రతిపక్షాలు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. రెండున్నరేళ్లలో పారిశ్రామికంగా రాష్ట్రం సాధించిన ప్రగతిని చూసి ఓర్వలేకే ప్రజలను తప్పుదోవ పట్టించేలా అదే పనిగా మాపై బురద చల్లుతున్నాయన్నారు. తాజాగా ప్రారంభించిన ఈ ప్లాంట్ లో అత్యాధునిక కంటైన్‌మెంట్ టెక్నాలజీని ఉపయోగించి... క్యాన్సర్ నివారణకు సంబంధించిన ఓరల్ ఆంకాలజీ ఔషధాలు, స్టెరిలైజ్డ్ ఇంజెక్టబుల్స్, లైయోఫిలైజ్డ్ పౌడర్ ఇంజెక్షన్లు, సాఫ్ట్ జెల్ క్యాప్సూల్స్ ను ఉత్పత్తి చేస్తారన్నారు. ఇక్కడ కొత్తగా 500 మందికి ప్రత్యక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. రాబోయే రోజుల్లో ఈ సంఖ్య రెట్టింపు అవుతుందన్నారు. దేశీయ ఫార్మా రంగ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా తెలంగాణ స్థానాన్ని ఇది మరింత బలోపేతం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కంపెనీ ప్రతినిధులు డా.గోవింద రెడ్డి, డా.మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
07 జూలై 2026

# పాత ఫర్నీచర్ సేకరణకు జీహెచ్ఎంసీ నిర్ణయం

- కాల్వలు, రోడ్లపై పడేయకుండా చర్యలు




**హైదరాబాద్, జూలై6 (జనంసాక్షి) :** భాగ్యనగర వాసులకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అదిరిపోయే శుభవార్త చెప్పింది. ఇంట్లో పనికిరాని పాత పరుపులు, సోఫాలు, కుర్చీలు, టేబుళ్లు వంటి భారీ వ్యర్థాలను ఇకపై రోడ్లపై, మురుగు కాలువల్లో పడేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. పాత పరుపులు, ఫర్నిచర్‌ను ఇళ్ల వద్ద నుంచే ఉచితంగా సేకరించే ప్రత్యేక సేవను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వెల్లడించింది. ఈ మేరకు జీహెచ్ఎంసీ తన అధికారిక 'ఎక్స్' ఖాతా వేదికగా ప్రజలకు అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా భారీ వ్యర్థాలను వీధులు, ఖాళీ స్థలాలు, మురుగు కాలువల్లో పడేయకుండా నూతన సేవను వినియోగించుకోవాలని జీహెచ్ఎంసీ విజ్ఞప్తి చేసింది. ఈ మార్పు హైదరాబాద్ పరిశుభ్రత మెరుగుపడటంతో పాటు పర్యావరణ పరిరక్షణకూ దోహదం చేస్తుందని పేర్కొంది. ఇంటి వద్దకే వచ్చి పాత పరుపులు, ఫర్నిచర్‌ను ఉచితంగా సేకరించి, సురక్షితమైన, శాస్త్రీయ విధానంలో రీసైక్లింగ్ చేస్తామని జీహెచ్ఎంసీ తెలిపింది. ఇందుకోసం క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి డోర్‌స్టెప్ పికప్‌ను ముందస్తుగా బుక్ చేసుకోవచ్చని సూచించింది. ప్రస్తుతం ఈ సేవ తమ పరిధిలోని ఆరు జోన్లలో అందుబాటులో ఉందని జీహెచ్ఎంసీ తెలిపింది. సికింద్రాబాద్, ఖైరతాబాద్, గోల్కొండ, చార్మినార్, రాజేంద్రనగర్, శంషాబాద్ జోన్ల ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని వెల్లడించింది. సేవా పరిధిని కవరేజ్ మ్యాప్ ద్వారా తెలుసుకుని, క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఉచిత పికప్‌ను బుక్ చేసుకోవాలని సూచించింది. భారీ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా జీహెచ్ఎంసీకి అప్పగించడం ద్వారా పరిశుభ్రమైన హైదరాబాద్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చింది.

# తెలంగాణ విద్యార్థి ఉద్యమకారులకు 5 గ్రేస్ పాయింట్స్ కేటాయించాలి

- కేకేకు వినతిపత్రం అందజేసిన విద్యార్థి జేఏసీ నాయకులు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్‌లలో తెలంగాణ విద్యార్థి ఉద్యమకారులకు 5 గ్రేస్ పాయింట్స్ కేటాయించి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 5 సంవత్సరాలు కేటాయించినట్లు అదనంగా, ఉద్యమకారులకు కూడా 5సంవత్సరాల వయో పరిమితి ఇవ్వాలని హైదరాబాద్‌లో అమరజ్యోతిలో నిర్వహించిన కేకే కమిటీతో ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ సమావేశంలో నాటి విద్యార్థి జేఏసీ నాయకులు కమిటీ చైర్మన్ కె.కేశవరావుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్నా, ప్రతి ఒక్క తెలంగాణ ఉద్యమకారుడిని గుర్తించి, ఉద్యమకారులకు ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు అయ్యేలా చూడాలని కేకే కమిటీకి తెలిపారు. విద్యా, వైద్యం లో 80% రాయితీ ఇవ్వాలని, నిరుద్యోగ ఉద్యమకారులకు 98% సబ్సిడీతో, షూరిటీతో సంబంధం లేకుండా స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని అన్నారు. కేకే కమిటీ కాలయాపన చేయకుండా 6నెలలలో ఎన్నికల హామీలను అమలు చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో నాటి ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ నాయకులు, దేశగాని సాంబశివ గౌడ్, అనంతుల మధు, రవి నాయక్, బొమ్మ హనుమంతు, నెహ్రు, లోకేష్, రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ 50 శాతం రిజర్వేషన్లు ఎక్కడా?

- ఆగస్టు 6న భారీ బహిరంగ సభ
- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్ (జనంసాక్షి) :** బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు ఆగస్టు 6న హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. సోమవారం బంజారాహిల్స్‌లోని టీఆర్ఎస్ ఆఫీస్‌లో నిర్వహించిన పార్టీ బీసీ నాయకుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల సాధనకు సంకల్పం తీసుకుంటామని తెలిపారు. 'సామాజిక న్యాయ తెలంగాణ సాధన సభ' పేరుతో ఈ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. బీసీలతోపాటు సమాజంలోని అన్నివర్గాల వారిని ఒక్కతాటిపైకి తీసుకొచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచుతామన్నారు. జనాభా దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్ల సాధనకు తెలంగాణ జాగృతి, టీఆర్ఎస్ రెండేళ్లుగా ప్రజాక్షేత్రంలో పనిచేస్తున్నాయని గుర్తు చేశారు. హైదరాబాద్ వేదికగా నిర్వహించే సభ దేశ గతినే మార్చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. తమిళనాడులోని స్కూళ్లలో ఎన్టీఆర్ ప్రారంభించిన మధ్యాహ్న భోజన పథకాన్ని ఇప్పుడు దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నారని తెలిపారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల సాధన కోసం చేసే ఉద్యమాలకు హైదరాబాద్ సభ దిక్సూచీగా నిలుస్తుందన్నారు. తమ ఉద్యమాలకు తలొగ్గే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు విద్య, ఉద్యోగాల్లో 42 శాతం, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేలా రెండు వేర్వేరు బిల్లులు అసెంబ్లీ, కౌన్సిల్‌లో పాస్ చేసి కేంద్రానికి పంపిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆ బిల్లులకు ఆమోదం తెలిపేలా రాష్ట్ర ప్రభుత్వం నుంచి కనీస ప్రయత్నాలు కూడా చేయడం లేదన్నారు. మనమెంతో మనకంత అనే నినాదం సాకారం కావాలంటే అన్ని వర్గాలను కలుపుకొని 50 శాతం రిజర్వేషన్ల సాధన కోసం ఐక్య ఉద్యమాలు చేద్దామని పిలుపునిచ్చారు.

# 'స్టేట్ ఇన్నోవేషన్ రిజిస్ట్రీ' సర్వేతో పేదలకు ముప్పు

- హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా అమలు చేయాలని భావిస్తున్న 'స్టేట్ ఇన్నోవేషన్ రిజిస్ట్రీ' , సామాజిక సర్వేపై ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సరైన ధృవీకరణ పత్రాలు లేకపోవడం వల్ల రాష్ట్రంలోని లక్షలాది మంది పేదలు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఓ లేఖ రాస్తూ.. ఎస్ఐఆర్ సర్వేను ప్రారంభించే ముందే తెలంగాణలోని పేదలందరికీ శాశ్వత నివాస ధృవీకరణ పత్రాలను ఉచితంగా జారీ చేయాలని డిమాండ్ చేశారు.

## 52% మంది దగ్గర బర్త్ సర్టిఫికెట్లు లేవు

దేశంలోని పేదల వద్ద ప్రాథమిక పత్రాల కొరతను ఎత్తి చూడడానికి అసదుద్దీన్ ఒవైసీ ప్రముఖ థింక్ ట్యాంక్ 'లోకనీతి-సిఎస్‌డీఎస్', జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే గణాంకాలను ప్రస్తావించారు. "ఢిల్లీతో పాటు ఐదు రాష్ట్రాల్లో లోకనీతి సంస్థ నిర్వహించిన సర్వే ప్రకారం.. దేశంలో ఇప్పటికీ 52 శాతం మంది ప్రజల వద్ద పుట్టిన తేది ధృవీకరణ పత్రం లేదు. అలాగే 41 శాతం మందికి నివాస ధృవీకరణ పత్రాలు, 42 శాతం మందికి కుల ధృవీకరణ పత్రాలు లేవు. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే ప్రకారం కేవలం సంపన్న వర్గాలలోని 82 శాతం మంది పిల్లలకే బర్త్ సర్టిఫికెట్లు ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో కఠినమైన డాక్యుమెంటేషన్‌తో సర్వేలు నిర్వహిస్తే.. నిరక్షరాస్యులు, నిరుపేదలు, గిరిజన, దళిత. మైనారిటీ వర్గాల ప్రజలు రేషన్, ఫించన్లు, ఉచిత విద్యుత్ వంటి పథకాలను కోల్పోతారు" అని ఒవైసీ స్పష్టం చేశారు. అందువల్ల పేదల ప్రయోజనాలను కాపాడటానికి ప్రభుత్వం తక్షణమే పీఆర్‌సీ డ్రైవ్‌ను చేపట్టాలని ఒవైసీ సీఎంకి రాసిన లేఖలో కోరారు.

# ట్రాన్స్‌ప్లాంట్ హబ్‌గా సనత్‌నగర్ టిమ్స్

- హాస్పిటల్‌ను సందర్శించిన ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్లు
- మంత్రి దామోదర్ రాజనర్సింహతో కలిసి మాడ్యులర్ థియేటర్ల పరిశీలన



**హైదరాబాద్ (జనంసాక్షి) :** అన్నిరకాల అవయవ మార్పిడి శస్త్రచికిత్సలకు నిలయంగా సనత్‌నగర్ టిమ్స్‌ను తీర్చిదిద్దుతున్నామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ఈ మేరకు నిమ్స్, ఉస్మానియా, గాంధీ హాస్పిటళ్లకు చెందిన ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్లతో కలిసి మంత్రి సోమవారం ఉదయం సనత్‌నగర్‌లోని టిమ్స్‌ను సందర్శించారు. అత్యాధునిక మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లు, ప్రీ-ఆపరేటివ్, పోస్ట్-ఆపరేటివ్ వార్డులు, ఐసీయూలు, ఇతర వైద్య సదుపాయాలను పరిశీలించారు. అనంతరం టిమ్స్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో వైద్యులతో మంత్రి సమావేశం నిర్వహించారు. అనంతరం, టిమ్స్ అడ్మినిస్ట్రేటీవ్ బ్లాక్‌లోని కాన్ఫరెన్స్‌లో హాల్‌లో డాక్టర్లతో మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ హాస్పిటళ్లలో అన్నిరకాల వైద్య సేవలు అందించాలన్నదే తమ లక్ష్యమన్నారు. ప్రభుత్వ డాక్టర్లు అత్యంత నైపుణ్యం కలిగి ఉన్నారని, ఇప్పటికే అత్యంత క్లిష్టమైన ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీలు కూడా ప్రభుత్వ హాస్పిటళ్లలో జరుగుతున్నాయని మంత్రి గుర్తు చేశారు. అన్ని రకాల అవయవ మార్పిడి సేవలను ఒకే వేదికపై అందించేలా సనత్‌నగర్ టిమ్స్‌ను ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ ఎక్సలెన్స్ సెంటర్‌గా తీర్చిదిద్దుతున్నామని మంత్రి తెలిపారు. ఇక్కడ పేషెంట్లకు మెరుగైన, అన్నిరకాల ట్రాన్స్‌ప్లాంట్ వైద్య సేవలు అందించేందుకు అవసరమైన సూచనలు చేయాలని డాక్టర్లను మంత్రి కోరారు. ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీలకు అవసరమైన అన్ని సౌకర్యాలను టిమ్స్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఈ సందర్భంగా ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్లు తెలిపారు. ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఆధునిక ఆపరేషన్ థియేటర్లు, ఐసీయూలు, అత్యాధునిక వైద్య పరికరాలు ఉన్నాయన్నారు. అన్ని సౌకర్యాలు సిద్ధంగా ఉన్నందున, దశలవారీగా వివిధ అవయవ మార్పిడి శస్త్రచికిత్సలను ప్రారంభించవచ్చని ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్లు మంత్రికి వివరించారు. సేవల విస్తరణకు అవసరమైన అదనపు సౌకర్యాలు ఏవైనా ఉంటే ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. నిమ్స్‌లో న్యూరో సర్జరీ, కార్డియోథొరాసిక్ సర్జరీ, యూరాలజీ విభాగాల్లో నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉన్నప్పటికీ, పరిమిత సంఖ్యలో ఉన్న ఆపరేషన్ థియేటర్ల కారణంగా వాటిని విడతలవారీగా వినియోగించాల్సి వస్తోందని నిమ్స్ నుంచి వచ్చిన సర్జన్లు తెలిపారు. రోగుల సంఖ్య అధికంగా ఉండటంతో, సర్జరీల కోసం పేషెంట్లు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి నిమ్స్‌లో న్యూరో సర్జరీలు, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్లు, గుండె సంబంధిత శస్త్రచికిత్సలు తదితర సూపర్ స్పెషాలిటీ ఆపరేషన్ల కోసం ఎదురుచూస్తున్న రోగులకు టిమ్స్‌లో సర్జరీలు నిర్వహించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. సనత్‌నగర్ టిమ్స్‌లో పూర్తిస్థాయిలో సేవలు ప్రారంభించిన వెంటనే నిమ్స్ నుంచి వైద్య బృందాలు టిమ్స్‌లో ఉన్న ఆపరేషన్ థియేటర్లను వినియోగించుకునేలా అవసరమైన పరిపాలనా ఏర్పాట్లు చేయాలని మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్‌ను మంత్రి ఆదేశించారు. నిమ్స్ మాదిరిగానే సనత్‌నగర్ టిమ్స్‌ను కూడా స్వయంప్రతిపత్తి సంస్థగా నిర్వహిస్తామని, డాక్టర్లు, ఇతర సిబ్బంది నియామకాలు కూడా అదే విధానంలో చేపడతామని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వం సనత్‌నగర్ టిమ్స్‌ను దేశంలోనే ప్రభుత్వ రంగంలో అత్యాధునిక ట్రాన్స్‌ప్లాంటేషన్ సేవలు, కార్డియో థొరాసిక్ సర్జరీలు, సూపర్ స్పెషాలిటీ వైద్యం, వైద్య విద్య, పరిశోధనలకు కేంద్రంగా అభివృద్ధి చేస్తోందని మంత్రి తెలిపారు. టిమ్స్ సేవలు అందుబాటులోకి రావడం ద్వారా నిమ్స్, గాంధీ, ఉస్మానియా వంటి ప్రభుత్వ హాస్పిటళ్లపై ఉన్న ఒత్తిడి గణనీయంగా తగ్గడంతో పాటు, ట్రాన్స్‌ప్లాంట్, ఇతర క్లిష్ట శస్త్రచికిత్సల కోసం రోగులు నెలల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి కూడా తగ్గుతుందన్నారు. సమావేశంలో మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, నిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, గాంధీ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, ఉస్మానియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాకేశ్ సహాయ్, జీవన్‌దాన్ ఇన్‌చార్జ్ డాక్టర్ భూషణ్ రాజ్, నిమ్స్, గాంధీ, ఉస్మానియా తదితర ప్రభుత్వ హాస్పిటళ్లకు చెందిన ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్లు మధుసూదన్, మనీషా సహాయ్, గంగాధర్ పాల్గొన్నారు.

# త్వరలో కొత్త పెన్షన్లు మంజూరు

- రాష్ట్ర గనులు, కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి




**సిద్దిపేట (జనంసాక్షి) :** కొత్త పెన్షన్లు త్వరలో ఇవ్వనున్నట్లు రాష్ట్ర గనులు, కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని విపంచి ఆడిటోరియంలో కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను జిల్లా కలెక్టర్ కే హైమావతి, ప్రజాప్రతినిధులతో కలిసి లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అభివృద్ధి పేరిట రూ.8 లక్షల కోట్ల అప్పులు చేశారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేసిన అప్పులకు కాంగ్రెస్ ప్రభుత్వం నెలకు రూ.5 వేల కోట్ల వడ్డీ కడుతున్నట్లు తెలిపారు. తెలంగాణలో ఒక్క పెంకుటిల్లు ఉండొద్దు అనేదే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజల్లో మంచి పేరు వస్తుంటే ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు ఆరు గ్యారంటీలను అమలు చేయడం లేదని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మహిళలకు ఉచిత బస్సు, జీరో కరెంటు బిల్, సన్న బియ్యం, రాజీవ్ ఆరోగ్య శ్రీ, ఇందిరమ్మ ఇల్లు లాంటి పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి నందు వల్లే తులం బంగారం పథకం ఇవ్వడానికి లేట్ అవుతుందన్నారు. జర్మనీలో 5 లక్షల ఉద్యోగాలు ఉన్నాయన్నారు. యువతకు టాం కామ్ సంస్థ ద్వారా ట్రైనింగ్ ఇచ్చి జర్మనీ లాంగ్వేజ్ నేర్పిచ్చి ఉచితంగా విదేశాలకు పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇంచార్జి పూజలు హరికృష్ణ, జిల్లా గ్రంథాలయ చైర్మన్ దరిపల్లి చంద్రం, ఆత్మ కమిటీ నియోజక వర్గ చైర్మన్ పూజల గోపికృష్ణ, నంగునూరు ఏఎంసీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నరకుల శివప్ప తదితరులు పాల్గొన్నారు.

# మేడిగడ్డ కుంగిపోతే ఎందుకు స్పందించలేదు

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** కేసీఆర్‌కు వారం రోజులు కాళేశ్వరం ఇస్తే తెలంగాణ మొత్తానికి నీళ్లు ఇస్తామని కేటీఆర్ ఉత్తర కుమార ప్రగల్భాలు పలుకుతున్నాడని, 2023 అక్టోబరు 21వ మేడిగడ్డ కుంగిపోతే కేసీఆర్ ఇప్పటి వరకు స్పందించలేదని ప్రభుత్వ విప్, ఆది శ్రీనివాస్ ఆరోపించారు. సోమవారం ఆయన సీఎల్పీ మీడియా సెంటర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కేటీఆర్, హరీష్ రావు ప్రభుత్వంపై అపవాదులు వేస్తున్నారని, యాభై వేల మందితో వెళ్లి పంప్‌లు ఆన్ చేస్తామనడం సంఘ విద్రోహ చర్య అవుతుందని ఆయన మండిపడ్డారు. కాళేశ్వరంపైన విచారణ అసెంబ్లీలో తీర్మానం చేసి సీబీఐకి పంపించామని, బీజేపీతో ములాఖత్ రాజకీయాల వల్ల విచారణ ఆలస్యం అవుతుందని ఆది శ్రీనివాస్ ఆరోపించారు. కాళేశ్వరంలో ఏం జరిగిందో, ఎలాంటి అవకతవకలు జరిగాయో కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావుకు తెలుసు అని, కాళేశ్వరం అవినీతి పైన విచారణ జరిగితే జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. బీఆర్ఎస్ హయాంలో దాదాపు 209 వారాల పాటు కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ చేతిలోనే ఉందని, మేడిగడ్డ కూలడంపైన ఎలాంటి విచారణ జరపలేదని ఆయన ఆరోపించారు. మహాదేవ పూర్ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేసి వదిలేశారని, లక్ష కోట్లు గోదావరి పోసిన కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులు తప్పు అయిందని లెంపలు వేసుకుని గుంజిలు తీయాలని ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. వారం రోజుల్లో నీళ్లు ఇచ్చే తెలివి ఉంటే కూలిన కాళేశ్వరాన్ని ఎందుకు రిపేర్ చేయించలేదని ఆయన నిలదీశారు. కేసీఆర్ ఎందుకు కాళేశ్వరంపైన స్పందించడం లేదని, పిల్ల రాక్షసులను బయటకు పంపించి కేసీఆర్ ఇష్టానుసారంగా మాట్లాడిస్తున్నాడని ఆది శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్ధతి, డిజైన్ లేకుండా కమిషన్ల కోసం ఇష్టానుసారంగా కట్టారని, కన్నెపల్లి పంప్ హౌస్ రెండు సార్లు మునిగిపోయిన విషయం కేటీఆర్ కు తెలుసా అని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి కాళేశ్వరం పైన మాట్లాడాలని, కాళేశ్వరం నుంచి ఎలా నీళ్లు ఇస్తారో కేసీఆర్ అసెంబ్లీలో వివరించాలి, ఆయన ప్లాన్ లు ఏమిటో తాము కూడా వింటామని ఆది శ్రీనివాస్ తెలిపారు. కరెంటు బిల్లు తప్ప కాళేశ్వరం నుంచి ఏమీ సాధించలేదని, కాళేశ్వరం నీళ్లు లేకపోయినా రికార్డు స్థాయిలో పంటలు పండించామన్నారు. రాష్ట్రంలో పంటలు ఎండిపోతున్నాయని కేటీఆర్ అబద్దాల ఆట మొదలు పెట్టాడని, ఇప్పుడే విత్తనాలు విత్తుకుంటుంటే పంటలు ఎలా ఎండిపోతాయని ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. మేడిగడ్డలో నీళ్లు ఆపితే డ్యాం కొట్టుకుపో తుందని ఎన్డీఎస్ఏ చెప్పిందని, ఆ సూచనల ప్రకారం తాము నడుచుకుంటామన్నారు.

# హైదరాబాద్-రియాద్ మధ్య రోజువారీ విమాన సర్వీసులు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** సౌదీ అరేబియాకు చెందిన తక్కువ ధరల విమానయాన సంస్థ ఫ్లైదీల్ భారతీయ విమానయాన మార్కెట్‌లోకి అధికారికంగా అడుగుపెట్టింది. హైదరాబాద్-రియాద్ మధ్య రోజువారీ నేరుగా విమాన సర్వీసులను ప్రారంభించిన సందర్భంగా తొలి విమానానికి జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ ఘన స్వాగతం పలికింది. సౌదియా గ్రూప్‌నకు చెందిన వేగంగా అభివృద్ధి చెందుతున్న ఫ్లైదీల్ సంస్థ ఎయిర్‌బస్ ఎ320 విమానాలతో రియాద్--హైదరాబాద్--రియాద్ మార్గంలో ప్రతిరోజూ సర్వీసులను నడపనుంది. ఈ సర్వీస్‌తో హైదరాబాద్ విమానాశ్రయం అంతర్జాతీయ విమానయాన కేంద్రంగా మరింత బలోపేతం కావడంతోపాటు భారత్-సౌదీ అరేబియా మధ్య వైమానికం మరింత విస్తరించనుంది. సోమవారం హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న తొలి విమానానికి జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ సీఈఓ కదిర్ కదిరవన్, సంస్థ సీనియర్ అధికారులు, ఫ్లై దిల్ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ లాయిడ్ జో మిస్కిట్టా, హెడ్ ఆఫ్ ఎయిర్‌పోర్ట్ ఆపరేషన్స్ అబ్దుల్‌రహ్మాన్ అల్‌రషీద్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ సీఈఓ కదిర్ కదిరవన్ మాట్లాడుతూ భారతీయ మార్కెట్‌లో తొలి అడుగు వేస్తున్న ఫ్లైదీల్‌కు హైదరాబాద్‌లో స్వాగతం పలకడం ఆనందంగా ఉన్నదన్నారు. రియాద్‌కు కొత్త నేరుగా విమాన సర్వీస్ ప్రారంభం కావడం వల్ల మధ్యప్రాచ్య దేశాలతో హైదరాబాద్‌కు ఉన్న అనుసంధానం మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. ఈ సర్వీస్ ద్వారా ప్రవాస భారతీయులు, వ్యాపారవేత్తలు, పర్యాటకులకు ప్రయాణం మరింత సౌకర్యవంతంగా మారడంతోపాటు ఇరు ప్రాంతాల మధ్య వాణిజ్యం, పర్యాటక రంగాలకు కొత్త అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ప్రస్తుతం హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం దేశీయంగా 76 గమ్యస్థానాలు, అంతర్జాతీయంగా 24 గమ్యస్థానాలకు విమాన సర్వీసులు నిర్వహిస్తున్నది. ఫ్లైదీల్ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ లాయిడ్ మిస్కిట్టా మాట్లాడుతూ భారతదేశంలో కార్యకలాపాలు ప్రారంభిస్తూ హైదరాబాద్‌కు తొలి సర్వీస్‌ను ప్రారంభించడం తమ సంస్థకు కీలక మైలురాయిగా అభివర్ణించారు.

# బాలిక కిడ్నాప్ కేసులో నలుగురిపై పోక్సో కేసు

**ఖమ్మం, జూలై6 (జనంసాక్షి) :** కారేపల్లి మండల కేంద్రంలోని ఓ ప్రభుత్వ గురుకుల కళాశాల నుండి ఇంటర్ చదువుతున్న బాలికను కిడ్నాప్ చేసిన నలుగురు వ్యక్తులపై కిడ్నాప్, పోక్సో కేసు నమోదు కాగా నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు కారేపల్లి పోలీసులు సోమవారం తెలిపారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ దుర్గాభవాని ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఖమ్మం పట్టణంలోని టేకులపల్లి ప్రాంతంలో నివాసముంటూ నిందితుడికి సహకరించిన మరో ముగ్గురు మహిళలను కూడా ఈ కేసులో అరెస్ట్ చేసినట్లు ఆయన వెల్లడించారు.

# బాలిక అదృశ్యం

- ఆచూకీ కోసం పోలీసుల గాలింపు



**కామారెడ్డి (జనంసాక్షి) :** కామారెడ్డి జిల్లా గాంధారి మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన 13 ఏళ్ల బాలిక అదృశ్యమైన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ నరహరి తెలిపిన వివరాల ప్రకారం జిల్లాలోని గాంధారి మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన పల్లపు సాయిలు కుమార్తె, 13 ఏళ్ల పల్లపు సంధ్య ఈ నెల 3వ తేదీ నుంచి కనిపించడం లేదని తెలిపారు. ఈ బాలిక కామారెడ్డి బస్టాండ్ నుంచి అదృశ్యమైనట్లు పేర్కొన్నారు. బాలిక ఎత్తు సుమారు 4.8 అడుగులు ఉంటుందని తెలిపారు. బాలిక ఆచూకీ తెలిసిన వారు ఎవరైనా వెంటనే 7989690865, 9618261947 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని కామారెడ్డి పట్టణ సీఐ నరహరి విజ్ఞప్తి చేశారు.

# రైతుల ఖాతాలో రూ.7490 కోట్లు జమ

- మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ఆరు నుంచి 7 ఎకరాల సాగుభూమి కలిగిన రైతులకు రైతు భరోసా నిధులు సోమవారం విడుదల చేసింది. ఆరు రోజుల్లో 68.37 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.7,490.72 కోట్లు జమ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీని నెరవేరుస్తూ రికార్డు స్థాయిలో భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 68.37 లక్షల మంది రైతులకు సంబంధించిన 124.85 లక్షల ఎకరాల భూమికి భరోసా పంపిణీ చేసినట్లు వెల్లడించారు.